గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# నవంబర్ 2014

# కథలు




శ్రీహరిపురంలో ఉండే మంగయ్య తల్లిదండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన పొలం దున్నుకుంటూ బ్రతికేవాడు. కానీ తన కొడుకులిద్దరినీ బాగా చదివించాడు. పెద్దకొడుకు పున్నయ్య, చిన్నకొడుకు చెల్లయ్యలు చదువులో బాగా రాణించారు. చదువులు పూర్తి చేసిన తరువాత ఉపాధి కోసం ఉద్యోగ ప్రయత్నంలో పడ్డారు.

ఒకసారి రాజుగారి కోశాగారంలో ఏర్పడిన గణికుడి ఉద్యోగ భర్తీకి జరిగిన పరీక్షలకి పున్నయ్య హాజరయ్యాడు. అక్కడ తన ప్రతిభని మెరుగ్గా ప్రదర్శించినప్పటికీ ఎంపిక చెయ్యలేదు రాజోద్యోగులు. తన బంధువుని ఆ ఖాళీలో నియమించమని సైన్యాధికారి సిఫార్సు చెయ్యడం వల్ల రాజోద్యోగులు అతనికి అనుకూలంగా ప్రవర్తించారు.మరొకసారి భీమవరం జమిందారు గారి ఖజానాలో చెల్లింపులు జరిపే ఉద్యోగానికి ప్రయత్నించాడు పున్నయ్య. కొందరు ముఖ్య అధికారులు ప్రతిభకి విలువ ఇవ్వకుండా కానుకలు తీసుకుని పున్నయ్యకంటే దిగువున ఉన్న వ్యక్తిని నియమించారు. అలా మూడు నాలుగుసార్లు జరిగేసరికి పున్నయ్యలో నిరుత్సాహం పెరిగింది. తన ప్రతిభ చూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వరని అనుకున్నాడు. పలుకుబడి లేకపోయినా, లంచం ఇవ్వకపోయినా ఉద్యోగం రాదని తెలుసుకున్నాడు. తన తండ్రి అవేవీ చెయ్యలేడు కాబట్టి తాను ఉద్యోగం పొందలేనని అనుకోవడం మొదలుపెట్టాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు మంగయ్య గబగబా ఇంటికి వచ్చి పున్నయ్యని పిలిచాడు."సైన్యంలో చేరడానికి ఆసక్తి,

అర్హతలు ఉన్నవాళ్ళని రమ్మని రాజుగారు దండోరా వేయించారు. నువ్వు వెళితే తప్పకుండా నీకు అవకాశం వస్తుంది” అన్నాడు మంగయ్య. దానికి పున్నయ్య ‘అక్కడ ఎంపిక ఏ పద్ధతిలో జరుగుతుందో బాగా తెలుసు. నేను వెళ్ళను. నన్ను బలవంత పెట్టవద్దు” అన్నాడు నిరాశగా. అప్పటి నుంచి మరొక ఉద్యోగ ప్రయత్నం చెయ్యడం మానేశాడు.

ఇక మంగయ్య రెండవ కొడుకు చెల్లయ్య సంగతికి వస్తే అతడిది ఇందుకు పూర్తిగా విరుద్ధం. నగరంలోని భాగ్యవంతుడి బంగారు నగల దుకాణంలో ఖాతాలు సరిచూసే ఉద్యోగానికి నియమిస్తామని కబురు వచ్చినా వెళ్ళలేదు. అలాంటి చిన్న పనులు చెయ్యనన్నాడు చెల్లయ్య.పట్టణంలో ఉన్న మంగయ్య మిత్రుడు దేముడయ్య నుండి మరొక కబురు వచ్చింది చెల్లయ్యకి. తమ చెరుకు మిల్లులో ఖాళీగా ఉన్న పర్యవేక్షకుడి ఉద్యోగంలో చేరడానికి వెంటనే రమ్మనమని సారంశం. అయినా వెళ్ళలేదు చెల్లయ్య.

“నేను చిన్న చిన్న ఉద్యోగాలలో చేరను. రాజాస్థానంలో తగిన ప్రాతినిధ్యం ఉన్న పదవి వస్తే చేరాతాను. నేను విద్య నేర్చుకున్న గురుకులంలో అందరి కంటే ప్రతిభావంతుడిని. నాకు రాజాస్థానంలో మంచిపదవి వస్తుందని గురువుగారు ఎప్పుడో చెప్పారు. ఒక జ్యోతిష్కుడు కూడా నా జాతకం చూసి గొప్ప స్థితికి వెళతానని చెప్పాడు. ఇలాంటి వాటిలో చేరితే ఆ అవకాశం తప్పిపోతుంది” అనేవాడు.

కొడుకులిద్దరి ప్రవర్తనతో మంగయ్యకి విసుగు వచ్చింది. ఒకడు జరిగింది తలచుకుని బాధపడుతుంటే ఇంకొకడు జరగబోయేది ఊహిస్తూ కలలు కంటున్నాడు. దాంతో మనశ్శాంతి కోసం గుడికి వెళ్ళడం ప్రారంభించాడు. తన ఇద్దరి కొడుకులకు మంచి బుద్ధిని ప్రసాదించమని దేవుడిని మొక్కడం ప్రారంభించాడు.

ఒకరోజు భక్తుల సంఖ్య తక్కువ ఉండడంతో మంగయ్యని పలకరించాడు పూజారి. అతడు పంచాంగం చూసి ముహూర్తాలు పెట్టడం , జాతక సమస్యలకు పూజలు చేయించడం కూడా చేస్తాడు. “ నీలో మునుపటి హుషారు కనిపించడం లేదు. దేనికో బాధపడుతున్నట్టు అనిపిస్తోంది. నీ సమస్య దేముడితో చెప్పినప్పటికీ నాతో కూడా చెబితే పరిష్కారం దొరుకుతుందేమో ఆలోచిస్తాను” అన్నాడు.

దానికి మంగయ్య తన కొడుకుల ప్రవర్తన చెప్పి దానికి పరిష్కారం కోరాడు. అది విన్న పూజారి “ మీ ఇంట్లో ఒక వ్రతం చేద్దాము. దాంతో మీ ఇంట్లో శాంతి కలుగుతుంది. నేను వచ్చినప్పుడే నీ కొడుకులతో మాట్లాడి పరిష్కారం చెబుతాను” అన్నాడు.

మంగయ్య ఇంటికి వెళ్ళి "గుడిలో అర్చకుడు నా జాతకం చూసి, మన కొడుకులకి ఉద్యోగం రాకపోవడానికి నా జాతకంలో ఉన్న చిన్న లోపమే కారణమని చెప్పారు. దైవశాంతి కోసం వ్రతం చెయ్యమన్నారు." అన్నాడు.

మంగయ్య మాటలు వినగానే కొడుకుల ముఖాల్లో కళ వచ్చింది. అలాగే చేయించమన్నారు.

అనుకున్న రోజునాడు శాస్త్రోక్తంగా వ్రతం జరిపించాడు పూజారి. మంగయ్య కుటుంబసభ్యులకు ప్రసాదం, అక్షంతలు ఇచ్చి "మీ ఇంటిని పట్టి పీడిస్తున్న గ్రహాలన్నీ పారిపోయాయి. మీకు దైవానుగ్రహం కలిగింది" అన్నాడు.

అక్కడే ఉన్న పున్నయ్యతో "ఈ వ్రతంతో మీ ఇంటికి పట్టిన గ్రహాలన్నీ పోయాయి. నీకు ఉద్యోగం వస్తుంది. ప్రయత్నం మొదలుపెట్టు " అన్నాడు. పున్నయ్య మోహంలో ఆనందం, ఆత్మవిశ్వాసం కనిపించాయి.

తరువాత చెల్లయ్య వైపు తిరిగి "తనకి వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి మానవుడు. చిన్నపని పెద్దపని అని తేడాలు ఉండవు. చేస్తున్న పనినే దైవంగా భావించి ప్రయత్నం చేస్తే పెద్దస్థాయికి అంచెలంచెలుగా చేరుకుంటావు. నేరుగా పెద్దస్థాయి కలగాలనుకునే భావన నుండి బయటకు వచ్చెయ్యి. వచ్చిన అవకాశం వదలకుండా వెంటనే ఏదో ఒక పనిలో చేరు. ఆ అవకాశాన్ని ఒక నిచ్చెనగా వాడుకో. తెలివైనవాడు అలాగే చేస్తాడు. నీవు కూడా గురువులు మెచ్చిన తెలివైనవాడివి కదా" అని చెప్పాడు. ఆ మాటలకు చెల్లయ్యలో కూడా చలనం వచ్చింది.

రెట్టించిన ఉత్సాహం తెచ్చుకుని కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టారు చెల్లయ్య, పున్నయ్యలు. అతికొద్దికాలంలో స్థిరపడ్డారు వాళ్ళు.అందుకు సంతోషించిన మంగయ్య కొన్ని కానుకలు పట్టుకుని గుడికి వెళ్లి పూజారిని కలిసాడు. 'మీరు వ్రతం చేయక పోయినట్లయితే నా కొడుకులు ఇప్పటికీ స్థిరపడక పోయేవారు" అని మెచ్చుకున్నాడు.

దానికి పూజారి "ఇందులో నా గొప్పతనమేమీ లేదు. నీ కొడుకులు చేస్తున్న పొరపాటు సరిదిద్దాను. గడిచిపోయిన దాని గురించి ఊరకనే ఆలోచిస్తూ కూర్చుంటున్న మీ పెద్దకొడుకు పున్నయ్యకు పాతవిషయాలు మరిచిపోయి మరొక ప్రయత్నం చెయ్యమని చెప్పాను. అలాగే జరగబోయే దాని గురించి ఆశాసౌధాలు కడుతూ కూర్చుంటున్న మీ చిన్నకొడుకు చెల్లయ్యకి గాలిలో మేడలు కట్టకుండా తనకి వచ్చిన అవకాశం వినియోగించమని, అవకాశాలు అదేపనిగా రావనీ, వచ్చినప్పుడే వాడుకొమ్మని సూచించాను. విచక్షణాజ్ఞానం ఉన్నవాడు వర్తమానంలో నివసిస్తూ ఎప్పుడు చెయ్యాల్సిన పనులను అప్పుడే చేస్తాడని జీవిత సత్యం బోధించాను. అయితే మామూలుగా చెబితే నమ్మరు కాబట్టి వ్రతం అడ్డుపెట్టుకున్నాను" అన్నాడు నవ్వుతూ పూజారి. మంగయ్య పూజారి యుక్తికి మెచ్చుకున్నాడు.




'బ్రేకింగ్ న్యూస్ ... బ్రేకింగ్ న్యూస్"

టి వి ల ముందు కూర్చుని 'సంచలనం" ఛానల్ చూస్తున్న వారంతా ఒక్కసారిగా అలెర్ట్ అయ్యారు.

“మరో సంచలనం ... మరి కాసేపట్లో .... చూస్తూనే ఉండండి మీ టీ వీ “సంచలనం” లో ... చిటికెలో వచ్చేస్తాం. చూస్తూనే ఉండండి.” "నిను వీడని నీడను " సీరియల్ 1996వ ఎపిసోడ్ చూస్తున్న మూడు తరాల ఆంధ్ర ప్రేక్షకులు గుడ్లప్పగించి చూస్తూనే ఉన్నారు. మాటా మంతీ; వంటా వార్పూ అన్నీ ఆపేసి టీ వీ ల ముందు కూర్చుని చూస్తూనే ఉన్నారు.

ఆరు నిమిషాల వాణిజ్య ప్రకటనల అనంతరం మళ్ళీ ""నిను వీడని నీడను " మొదలయింది.

"ఇలా ఎందుకు చేశావు బామ్మా?"

" ఏం చేయమంటావే తల్లీ! .... అలా జరిగిపోయింది "

ఇరవై ఎపిసోడ్ లుగా టీ వీ లకు అతుక్కుపోయిన జనానికి "ఆమె ఎందుకు అలా చేసిందో ... అది అలా ఎందుకు జరిగిపోయిందో అర్థం కాక సస్పెన్స్ భరించలేక ఊపిరి బిగపట్టుకొని చూస్తూనే ఉన్నారు.

మరో ఐదు నిమిషాలు బామ్మ ఇంట్లో ఉన్న జనాల మొహాలను మార్చి మార్చి చూపించాడు కెమెరామేన్ ఉమాపతి. వాళ్ళ ముఖాళ్ళో అయోమయమో ... ఆందోళనో అర్థం కాని భావాన్ని చాలా నేర్పుగా ప్రదర్శించారు నటులు. అంతే చాకచక్యంగా కెమెరాలో బంధించాడు ఉమాపతి.

వీక్షకులు ఎవరికి తోచినట్లుగా వారు వూహించుకోసాగారు. చర్చించుకోసాగారు. తీవ్ర ఉద్విగ్నతకు లోనై పోతున్నారు.

ఇంతలో మళ్ళీ ... బ్రేకింగ్ న్యూస్

“ సంచలనానికే సంచలనం సృష్టిస్తున్న మీ ” సంచలనం” లో మరో సంచలనం.

'సుజాత ఆత్మహత్య చేసుకోబోతోందా? సేవ్ ఎ లైఫ్ ... మరి కాసేపట్లో ... చూస్తూనే ఉండండి. కదలకండి. చిటికెలో వచ్చేస్తాం. చూస్తూనే ఉండండి. ''

వంట చేయడానికి లేవబోయిన మహిళా వీక్షకులు మళ్ళీ కదలకుండా కూర్చున్నారు. ఒక ప్రక్క సీరియల్ సస్పెన్స్ భరించలేక టెన్షన్ పడిపోతున్న జనానికి ఈ సంచలనం బ్రేకింగ్ న్యూస్ ఏమిటో త్వరగా తెలుసుకోవడానికి తెగ టెన్షన్ పడిపోతున్నారు.

మరో ఏడు నిమిషాల వాణిజ్య ప్రకటనల తర్వాత మళ్ళీ సీరియల్ మొదలయింది.

"బామ్మా?"

"మల్లి"

బామ్మ, మల్లి ఒకర్నొకరు గట్టిగా కౌగలించుకొన్నారు. ఏడుపు మొదలెట్టారు. కాస్త మేకప్ చెదరిపోకుండ మల్లి చాలా జాగ్రత్తగా ఏడవడం మొదలెట్టింది. బామ్మ మాత్రం గ్లిజరిన్ వేసుకొని మరీ జీవించారు. వాళ్ళ మొహాల్లో ఆందోళనో ...ఆవేదనో మరే భావమో అర్థం కాక వీక్షకులు ఊపిరి బిగబట్టి ఎవరికి తోచినట్లు వారు ఊహించుకోసాగారు.

“మరో బ్రేకింగ్ న్యూస్ ...సంచలనానికి సంచలనం మీ ” సంచలనం” లో

"'సేవ్ ఎ లైఫ్ ... యూ ట్యూబ్ లో సంచలనం సృష్టిస్తున్న వీడియో. సుజాత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటానని ...కారణం తన తండ్రేనని పోస్ట్ చేసింది. ఇంతకీ ఎవరా తండ్రి? ఎవరా సుజాతా...మరి కాసేపట్లో ... చూస్తూనే ఉండండి.'

తొమ్మిది నిమిషాల ప్రకటనల అనంతరం మళ్ళీ సీరియల్ మొదలయింది.

ఈసారి బామ్మ ముక్కు గట్టిగా చీది "మల్లీ!" అని మళ్ళీ బావురుమంది. మల్లి మాత్రం ఎలాంటి భావం అర్థంకానీయకుండా

బామ్మను కావిలించుకుంది.   ఆమెకు ఎలాంటి డైలాగులు లేవు. ఎందుకంటే హింది మాత్రమే   తెలిసిన బాంబే ఇంపోర్టెడ్ సీరియల్ హీరోయిన్ ను ఇబ్బంది పెట్టడం దర్శకునికి ఇష్టం లేదు.

ఇంతలో పోలీస్   జీప్ వీధిలో ఆగింది.   సీరియల్ ముగిసింది   ...సారీ ... ఆ రోజు టికి ముగిసింది.

' సేవ్ ఎ లైఫ్ ...సంచలనం సృష్టిస్తున్న వీడియో   యూ ట్యూబ్ లో ... సుజాత ఆత్మ హత్య చేసుకుంటానని   ఎందుకు పోస్ట్ చేసింది.   ప్రేమ విఫలమైందా?   పెళ్ళి ఆగిపోయిందా... ఇంతకీ ఆ కసాయి తండ్రి ఎవరు? త్వరలో మీ “సంచలనం”లో ... కదలకండి. కాసేపట్లో లైవ్ డిస్కషన్ ... మీరూ పాల్గొనండి. "

వీక్షకుల్లో విపరీతమయిన టెన్షన్ మొదలయింది.

అంతక్రితమే వచ్చిన చుట్టాలు ఇక లాభం లేదని చల్లగా జారుకొన్నారు.

ఎనిమిది నిమిషాల వాణిజ్య ప్రకటనల అనంతరం లైవ్ మొదలయింది.

ఈసారి డిస్కషన్ ప్యానెల్ తో రెడీ అయింది   “సంచలనం” - యాంకర్ కవిత తో.

"మీ “ సంచలనం” సృష్టిస్తున్న మరో సంచలనం... ఫస్ట్   యిన్ “ సంచలనం” ...ఎక్స్ క్లూజివ్లీ సంచలనం ఓన్లీ. సుజాత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ... ఇందుకు కారణం తన తండ్రేనని యూ ట్యూబ్ లో పోస్ట్ చేసింది. ఈ వీడియో యూ ట్యూబ్ లో సంచలనం సృష్టిస్తోంది. ఇది ఎంతవరకు నిజమో అర్థం కావడం లేదు.   నిజమే ఐతే ఒక ప్రాణం ఆపదలో ఉంది.   నిగ్గదీసే పనిలో మా ప్రతినిధులున్నారు. మీరు కూడా పాలుపంచుకోండి .   ఒక ప్రాణాన్ని రక్షించండి. సమాచారం ఏదైనా మాతో షేర్ చేసుకోండి. మా ఫోన్ నంబర్లు 9999999999 మరియు 8888888888 .   ఆ అమ్మాయి మీ పక్కనే ఉండొచ్చు.   మీ వాడలోనే ఉండొచ్చు.   మీ వూరులోనే ఉండొచ్చు.   మీకు తెలిసిన   వారై ఉండొచ్చు. వివరాలు అందించండి.   ఒక ప్రాణాన్ని నిలబెట్టండి. ఒక ఆడకూతురి ప్రాణాన్ని కాపాడండి.   సమాజ సేవకు మీ వంతు సహాయం అందించండి.   ఆ కసాయి తండ్రికి తగిన గుణపాఠం చెప్పండి.

ఇక ఈ విషయాన్ని లైవ్ షో లో చర్చించడానికి మన స్టుడియో లో ప్రముఖ మహిళా నాయకురాలు శ్రీమతి వనిత గారు, ప్రముఖ సైకియాట్రిస్ట్ శ్రీ పట్టాభి గారు మరియు ప్రముఖ లాయర్ శ్రీ భగత్ గారు ఉన్నారు. చర్చ ప్రారంభిద్దాం. "

“చె ప్పండి ! వనిత గారు ! సంఘంలో మహిళల పట్ల అన్యాయాలు పెచ్చు మీరి పోతున్నాయి. మహిళా సంఘాలు, మేధావులు నిత్యం ఖండించినా, ధర్నాలు చేసినా ఆగడం లేదు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఏం చేయాలంటారు?"

"అవునండీ! దేశంలో ఆడపిల్లలకు భద్రత కరువైంది. ఆడపిల్ల ఎదగడాన్ని, తమతో పాటు వృద్ధిచెందడాన్ని ఈ పురుషాహంకార ప్రపంచం గుర్తించడం లేదు. కాకపోతే ప్రేమించాను ... పెళ్ళిచేసుకుంటాను ..అంటేనే ఇంత అకృత్యమా?

అండగా నిలబడాల్సిన తండ్రే ఇంత నీచానికి దిగజారడమా? ఎక్కడికి పోతున్నాం మనం? ఇంతకన్నా దారుణం ఇంకేమైనా ఉందా? ఇది సహించలేని సంఘటన. ప్రతి ఒక్కరూ ఖండించి తీరాల్సిందే. సమాజంలో ప్రతి ఒక్కరూ సుజాతకు అండగా నిలబడాలి." ఆవేశంగా వూగిపోతోంది వనిత.

' ట్రింగ్ ... ట్రింగ్ ... ట్రింగ్ "

'ఒక్క నిమిషం వనిత గారూ! కాల్ తీసుకొందాం ...హలో ఎవరు?"

నా పేరు విజయ మచిలిపట్నం నుంచి"

"చెప్పండి మేడం! ఇలాంటి విషయాలపై మీ స్పందనేమిటి?"

' చాలా దారుణమండీ ... పదేళ్ళ క్రితం మా వీధిలోనే ఇలాంటి సంఘటనే జరిగింది. ప్రేమ పెళ్ళి ఇష్టం లేని తండ్రి కూతుర్ని నిర్బంధించి ఇలానే చిత్రహింస చేశాడు. ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. ఇలాంటివారిని కఠినంగా శిక్షించాలి.మళ్ళి మళ్ళి జరగ కుండా చూడాలి."

"థ్యాంక్సండీ! మీ స్పందన తెలియజేసినందుకు. ... పట్టాభి గారూ! మీరు ప్రముఖ సైకియాట్రిస్ట్ గదా...ఇలాంటి విషయాల్లో సైకిలాజికల్ గా ఆ అమ్మాయి పరిస్థితి ఎలాంటిది? ఇంతకీ నేటి యువతరం ఎందుకు ఇలా ఆలోచిస్తోంది? ప్రేమ విఫలమైనంత మాత్రాన ఆత్మహత్యే శరణ్యమని భావించే నేటి యువతరం ఆలోచనా విధానం సరి అయిందేనా? దీనికి మీరేమంటారు?"

'అవునండీ! ఇలాంటి విషయాల్లో యువతరం ఆలోచనా విధానాల్లోనే మార్పు రావాలి!"

"ట్రింగ్ ...ట్రింగ్...ట్రింగ్.."

"ఒక్క నిమిషమండీ! కాలర్ లైన్లో ఉన్నారు... హలో! చెప్పండి."

" నా పేరు మూర్తి. కాలేజ్ స్టూడెంట్ నండి. మా కాలేజ్ లో సుజాత అనే అమ్మాయి, సుధాకర్ని ప్రేమించిందండీ. బహుశా ఈమె ఆ సుజాతే అని అనుమానంగా ఉంది."

" అవునా?"

"చెప్పండి. మీ కాలేజ్ పేరేంటి? వారెన్నేళ్ళుగా ప్రేమించుకున్నారు. మీకు తెలిసిన విషయాలు పూర్తిగా చెప్పండి."

"నాకు అంతమాత్రమే తెలుసండి. వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్ళివరకు వెళ్ళి ఎందుకో ఆగిపోయిందని మా ఫ్రెండ్స్ అంటుంటే విన్నాను. అంతే."

'పూర్తి వివరాలు కనుక్కోండి మూర్తిగారు! మీ ఫ్రెండ్స్ ను విచారించండి. ప్లీజ్ సేవ్ ఎ లైఫ్."

"తప్పకుండానండి. ప్రయత్నిస్తాను."

"ఇప్పుడు చెప్పండి భగత్ గారూ! ఇలాంటివి పునరావృతం కాకుండా చట్టంలో ఎలాంటి మార్పులు చేయాలి?"

"అవునండీ. చట్టాలు మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శిక్షలు కఠినంగా అమలు చేయాలి."

"ట్రింగ్ ... ట్రింగ్...ట్రింగ్"

"హలో చెప్పండి"

"నా పేరు శేఖరండీ. ఖమ్మం నుంచి మాట్లాడుతున్నాను"

"చెప్పండి శేఖర్ గారూ!"

'మా పూర్వ విద్యార్థిని సుజాత అని ఒక అమ్మాయి ఉండేదండీ! ఆమె ఎవర్నో ప్రేమించిందని; పెళ్ళికి అమ్మా, నాన్న ఒప్పుకోలేదని వార్తలేవో కార్లు చేసేవి ఆ రోజుల్లో.."

" మీరు లెక్చరర్ కదండీ. ఒకసారి పూర్తి వివరాలు చెప్పండి?"

"అంతకు మించి వివరాలు తెలియవండి."

"మీ పూర్వ విద్యార్థిని అంటున్నారు. వివరాలు కనుక్కోండి ప్లీజ్.. ఒక ప్రాణాన్ని నిలబెట్టండి."

ష్యూర్ ష్యూర్ ... ప్రయత్నిస్తాను."

"ట్రింగ్ ...ట్రింగ్...ట్రింగ్.."

''హలో''

"హలో నా పేరు శ్రీనివాసండి. ఇంతకీ పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఈ హడావుడి ఎందుకో అర్థం కావడం లేదు. ఆ అమ్మాయి ఎవరో ...ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుందో...దానికి తండ్రి బాధ్యత ఎంతో తెలుసుకోకుండా వన్ సైడ్ గా చర్చించుకోవడం సముచితం కాదేమో అనిపిస్తుంది."

''చాలా థ్యాంక్సండీ! మీ అభిప్రాయం చెప్పినందుకు. మా ఆందోళనంతా ఒక ప్రాణాన్ని రక్షించడం కోసమే మరే ఉద్దేశ్యం లేదు. అర్థం చేసుకోండి!'

"ట్రింగ్ ...ట్రింగ్...ట్రింగ్.."

"హలో చెప్పండి!''

"ఇలాంటి శ్రీనివాస్ లు ఉండబట్టే దేశం ఇలా తగలడిపోతోంది. ఒక ఆడకూతురు ఆత్మహత్య చేసుకుంటున్నాను అంటుంటే మనకేం పట్టనట్లు ఉండడం సబబు కాదు. వారు కాస్త సామాజిక స్పృహతో వ్యవహరించడం మంచిది. ఆయన కూతురికే అలా జరిగితే ... ఇలా ప్రవర్తిస్తాడా?" మరో కాలర్ ఆక్రోషం.

ఇలా ప్రేక్షకులంతా విశేషంగా స్పందించారు. వారికి తోచినట్లు విశ్లేషించారు. తమకు తోచినట్లు వ్యాఖ్యానించారు. "సుజాత" అన్న పేరుతో ఉన్న తమకు తెలిసిన/పరిచయం ఉన్న వారందరీ వివరాలు డిస్కషన్ లో వివరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు తెలిసిన వారికి ఫోన్ చేసి వాకబు చేశారు. మీ అమ్మాయేనా? మీరేనా? అని కుశల ప్రశ్నలు వేశారు.

అందరిలో ఒకటే ఉత్కంఠ ...అందరికంటే ముం దు తామే కనుక్కోవాలని; సంచలనం సృష్టించాలని ఎందరో ముందుకురికారు.

ఎప్పటికప్పుడు తమ సంచలనాలను టీ వీ తో పంచుకొన్నారు.

సంచలనం ప్రతినిధులంతా వీధిన పడ్డారు.

రోడ్లో నడుస్తున్నవారిని ... వాహనాల్లో వెళ్తున్న వారిని ... బస్సులను ...ఆటోలను ఆపి

ఆఫీసుల్లో దూరి ....షాపుల్లో చేరి --మొహాల్లో మైకులు పెట్టి మరీ అడిగారు.

'దీనికి మీ స్పందనేమిటి ? ఈ వీడియో పై మీ స్పందన చెప్పండి ....స్పందించండి"

ఉలిక్కి పడ్డ జనం ... మొహం పైన మైకులు చూసి ... ఉక్కిరి బిక్కిరి అయ్యారు. బిత్తర పోయారు. అవాక్కయ్యారు. లైవ్ లో స్పందిస్తే ఏమవు తుందో ... స్పందించకపోతే ఏమవు తుందో అని బిక్క చచ్చి పోయారు.

ఏదో ఒకటి స్పందించకపోతే మొహం పైన్నుంచి మైకు తీసేట్లుగా లేదని ...జనం స్పందించారు ఎవరికి తోచినట్లు వారు.

ఇలా లైవ్ ఇంటర్వ్యూ, లైవ్ డిస్కషన్, ప్యానెల్ డిస్కషన్ లలో; విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, అధ్యాపకులు ...అన్ని వర్గాల ప్రజలు స్పందించారు. స్పందించేట్లుగా కూడా చేశారు. అందరూ చీల్చి చెండాడారు. అమానుషం అన్నారు. అనాగరికత అన్నారు.

మారాలన్నారు. మార్చాలన్నారు. ఆవేశ పడ్డారు. ఆవేదన పడ్డారు.

ఛోటా మోటా రాజకీయ నాయకులైతే 'మీ పాలనలోనే ఇలా జరిగింది. బాధ్యత మీదంటే మీద"ని వాదించుకున్నారు. కీచులాడుకున్నారు.

ఇంతలో యాంకర్ గొంతు సవరించుకుంది.

"మరో సంచలనం. మాకు చాలా చాలా ఆనందంగా ఉంది. ఇంకా మానవత్వం మిగిలే ఉందని మీరు మరో సారి నిరూపించారు. 'సేవ్ ఎ లైఫ్" మేమిచ్చిన పిలుపుకు మీరందరూ స్పందించిన తీరుకు మాకు మహదానందంగా ఉంది. ముఖ్యంగా నేటి యువత స్పందించిన తీరు అద్భుతం. అపూర్వం. చారిత్రాత్మకం."

"ఈ వీడియో ఇద్దరి స్నేహితురాళ్ళ బెట్టింగ్ లో భాగంగా పోస్ట్ చేయడం జరిగిందని - ఇలాంటి వార్తలకు యువత స్పందించరని ... లేదు... గా స్పందిస్తారని బెట్టింగ్ చేసుకొని ఇలా యూ ట్యూబ్ లో పోస్ట్ చేశామని శ్యామల అనే విద్యార్థిని కొద్ది సేపటి క్రితమే మాకు ఫోన్ చేసి చెప్పడం జరిగింది. స్పందించినవారికందరికీ థాంక్స్. ఈ కార్యక్రమాన్ని ఇంతటితో ముగిస్తున్నాం."

మరుసటి వారంలో ఆలస్యంగా అందిన వార్తలు అంటూ ఇద్దరి ఆత్మహత్యల ఉదంతం కొన్ని పత్రికల్లో మాత్రమే కనిపించాయి. వారిద్దరి పేర్లు "సుజాత" లు గా గుర్తించడం జరిగిందని, సంచలనం సృష్టించడానికి 'అతిగా' ఆరా తీయడానికి ప్రయత్నించిన భాగంలో అమాయకులైన ఇద్దరు సున్నిత మనస్కులు సున్నితంగా లోకం విడిచి వెళ్ళిపోయారని చాలా చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఆడపిల్లలంటే అదుపులో ఉండాలని మరీ ఎక్కువ జాగ్రత్తలు తీసుకున్న ఆ అమాయక తలిదండ్రులు భోరుమని ఏడుస్తూనే ఉన్నారు.

మరో సంచలనం కోసం"సంచలనం" వీధుల్లో సంచలనం సృష్టిస్తోంది - యధావిధిగా .




అలారం మోతతో అయిదు గంటలకే మెలకువ వచ్చింది వినీలకి. కానీబద్ధకంగా ఇంకాసేపు పడుకోవాలనుకుని దుప్పటి ముసుగేసిందన్న మాటే కాని అంతలోనే స్కూల్ కి లేట్ గా వెళ్తే ..లేట్ రిజిస్టర్ లో సైన్, ఆ తర్వాత చండశాసనుడైన ప్రిన్సిపాల్ కి అపాలజి చెప్పాల్సిరావటమూ గుర్తురాగానే దిగ్గున లేచి కూర్చుని మంచం దిగి తన రొటీన్ పనిలో పడిపోయింది. తనతోపాటే లేచిన భరత శ్రీహరి కాలకృత్యాలు తీర్చుకుని వాకింగ్ కి వెళ్ళాడు.

టిఫిన్ చెట్నీ...మధ్యాన్నం లంచ్ లోకి కూర..రసం వగైరాలు చేస్కుంటూ మధ్యమధ్యలో గుమ్మం ముందు ఊడ్చి ముగ్గు వేసి ఇల్లు శుభ్రం చేస్కుంది. గిన్నెలన్నీ వెనక ఉన్నసింక్ లో పడేసి పాలు వేడి చేసి గీజర్ ఆన్ చేసి పిల్లల్ని లేపడానికి వెళ్ళింది.

వినీల జాబ్ చేస్తున్నది ప్రైవేట్ స్కూల్ కావటాన అన్నీ స్ట్రిక్ట్ రూల్స్...ఎనిమిదిన్నరకి ఒక్క సెకను ఆలస్యం అయినా లేట్ రిజిస్టర్ లో సంతకం పెట్టాలి. అలా మూడు లేట్ సంతకాలు ఒక నెలలో అయితే ఒకరోజు శాలరీ కట్ చేస్తారు. అందుకే ఉదయం చాలా హడావుడి పడాల్సి వస్తుంది. అప్పటికీ ముందురోజు సాయంత్రమే కూరగాయలు కట్ చేస్కుని పెట్టుకోవడం వలన వంటపని త్వరగానే అవుతుంది. ఎటొచ్చీ పిల్లలను రెడీ చేసి తీస్కెళ్ళడమే తనకెంతో కష్టంగా వుంటుంది.

మార్నింగ్ వాక్ మానేసి ఆ టైం లో పిల్లని తయారు చేసే పనిలో సాయం చెయ్యమని ఎన్నోసార్లు చెప్పి చూసింది వినీల భర్త శ్రీహరికి. కానీ ఆరోగ్యంగా వుండాలంటే వాకింగ్ తప్పనిసరనీ, కావాలంటే నువ్వే జాబ్ కి రిజైన్ చేసెయ్యి అని సలహా ఇస్తాడు తప్ప తనవంతు సాయం అస్సలు చేయడు. ఒక్కొక్కసారి అనుకోని పనులు ఎక్కువయ్యి స్కూలుకి లేట్ గా వెళ్ళాల్సి వచ్చినపుడు ఉక్రోషంతో ఏడుపు వస్తుంది వినీలకు. కానీ ఉద్యోగం మానటం ఇష్టం లేక అన్నీ భరిస్తూ కష్టపడటానికి అలవాటుపడిపోయింది.

బెడ్ రూంలోకి వెళ్ళి పిల్లలిద్దర్నీ లేపింది. నాల్గవతరగతి చదువుతున్న దివ్య వినీల లేపటంతోనే లేచి కాసేపు చదువుకుంటుంది ఎవరూ చెప్పకుండానే. కానీ..ఫస్ట్ క్లాస్ చదువుతున్న నానిని లేపడమే చాలా కష్టం వినీలకు.

ప్లీజ్ మమ్మీ..కాసేపు అంటున్న నానిని వీపుమీద చరిచి టైమెంతయ్యిందని అరచి కప్పుకున్న దుప్పటి లాగేసింది.

తప్పక లేచిన నానిని కాసేపు చదువుకోమని చెప్పి ప్రక్కబట్టలు సర్దేసింది. ఏడింటికల్లా వంటంతా పూర్తి కావటమూ క్యారేజీలు సర్దటమూ అయిపోయింది. పిల్లల్ని తయారు చేసి టిఫిన్ తినిపించి తను తినటమే వుంది. పిల్లలు చిన్నవాళ్ళు కావటాన ఎనిమిదింటికల్లా బయల్దేరాల్సిరావటాన న హైరానా పడాల్సి వస్తుంది.

ఏ మాత్రమన్నా భర్త సాయం చేస్తే తనకెంతో రిలీఫ్ గా వుంటుంది. కానీ ఆ విషయం ఆలోచించడు శ్రీహరి.

పిల్లలకు స్నానాలు చేయించి స్కూల్ డ్రస్ లు వేస్తుండగా వాకింగ్ పూర్తి చేసుకుని వచ్చాడు శ్రీహరి.

వస్తూనే...

వినీలా రేపు నాకు ఆఫీస్ లో ఇన్స్ పెక్షన్ వుంది, చాలా ఫైల్స్ చెక్ చెయ్యాలి. టైం లేదు. నువ్వు స్కూల్లో లిజర్ పిరియడ్ లో కొన్ని ఫైల్స్ తీసుకెళ్ళి చెక్ చేయి ప్లీజ్ అని రిక్వెస్ట్ చేసాడు.

అసలే పని హడావుడిలో ఉక్కిరిబిక్కిరిగా ఉన్న వినీల వెంటనే నో చెప్పేసింది.

నాకు ఈరోజు వుండేది ఒక్కటే లీజర్. యూనిట్ టెస్ట్ కి సంబంధించిన క్వశ్చన్ పేపర్స్ ప్రిపేర్ చెయ్యాలి. అయినా రాత్రంతా ఫ్రెండ్స్ తో తిరగకపోతే అప్పుడే చెక్ చేసుకోవచ్చుగా అంటూ సలహా ఇచ్చింది.

" సర్లే నాకు తెలీక కాదు, రాత్రి తలనొప్పిగా వుండటాన చూస్కోలేదు. నా ఏడుపేదో నేను ఏడుస్తానులే..ఆ టిఫినేదో తగలెయ్యి " అంటూ విసురుగా వెళ్ళిపోయాడు బాత్రూంలోకి.

చకచకా పిల్లల్ని తయారు చేసి టిఫిన్ తింపించి తను కూడా తిన్నాననిపించి ఎనిమిది గంటలకల్లా పిల్లలిద్దర్నీ ఎక్కించుకుని స్కూటీ స్టార్ట్ చేస్కుని వెళ్ళిపోయింది వినీల.

సరిగ్గా ఎనిమిదీ ఇరవై కల్లా వెళ్ళి రిజిస్టర్లో సంతకం పెట్టి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది.

" మేడం" అని పిల్చిన అటెండర్ శ్రీను వైపు చూసింది వినీల.

పాపకి ఒంట్లో బాలేదు..రెండు వందలుంటే ఇవ్వండి..ఫస్ట్ కి ఇచ్చేస్తాను...అన్నాడు. " నా దగ్గర లేవు శ్రీనూ..అని చెప్పబోయి ఆగిపోయింది.ఎందుకంటే ఎప్పుడైనా రెండు నిముషాలు ఆలస్యంగా వచ్చినా రిజిస్టర్ లో సంతకం పెట్టేందుకు శ్రీను సహాయం తప్పనిసరి. అందుకే ముఖానికి నవ్వు పులుముకుని రెండువందలు తీసి శ్రీను చేతిలో పెట్టింది.

పిల్లల్ని క్లాస్ దగ్గరకు పంపి స్టాఫ్ రూం కెళ్ళింది ప్రేయర్ స్టార్ట్ అవుతుండటంతో.

థర్డ్ పీరియడ్ లీజర్ కావడంతో క్వశ్చన్ పేపర్స్ తయారు చేద్దామనుకుంటూండగా ఇంచార్జ్ సార్ అయిన మురళి గారు వచ్చారు.

" వినీలా మేడం! వన్ రిక్వెస్ట్ నేను తయారు చేసిన సెవెంత్ క్లాస్ క్వశ్చన్ పేపర్స్ ఈరోజే సబ్మిట్ చెయ్యాలి. కొంచెం చెక్ చేసి పెట్టరా ప్లీజ్..ఎలాగూ మీకు లీజరే కదా" అన్నాడు.

అయ్యో...సారీ అండీ... నాకు కుదరదు... ఈరోజే నేను కూడా పేపర్స్ తయారు చెయ్యాలి..అందామనుకుంది కానీ అనలేదు. ఎందుకంటే ఇప్పుడు తను నో చెపితే ఇంచార్జ్ సార్ కి కోపం వచ్చిందంటే ఈసారి లీజర్ పీరియడ్ లో ఆయన వెళ్ళమన్న క్లాస్ కి చచ్చినట్టు వెళ్ళాలి...తప్పదు అందుకే..దాందేముంది సార్.......చెక్ చేసి ఇస్తాను...ఇటివ్వండి.. అంటూ తీసుకుంది వినీల.పీరియడ్ మొత్తం చెక్ చేయడానికే సరిపోయింది.

చేసేదేం లేక నిట్టూర్చి ఇంటికెళ్ళి పనంతా అయ్యాకా క్వశ్చన్ పేపర్స్ తయారు చెయ్యాలి అనుకుంటూండగా ఎందుకో భర్త చేసిన రిక్వెస్టు గుర్తుకొచ్చింది. ఉద్యోగ జీవితంలో అటెండర్ దగ్గర్నుంచి ప్రిన్సిపాల్ వరకూ ఇగోను ప్రక్కన పెట్టి అన్ని విషయాల్లో సర్దుకుపోవాల్సి వస్తుంది.కానీ జీవితాంతం ఒకరికొకరు తోడుగా వుంటూ కలిసిమెలిసి వుండాల్సిన భర్త విషయంలో మాత్రం సర్దుకుపోలేక చిన్న చిన్న విషయాలకే మనస్పర్థలతో కాపురంలో మనశ్శాంతి లేకుండా చేస్కుంటున్నాను....అన్న విషయం స్ఫురణకు రాగానే మనసంతా ఏదోలా అయిపోయింది.

చ..పాపం తను అడగ్గానే ఒప్పుకోవాల్సింది...ఏమైనా సరే ఈరోజు భర్త పనుల్లో తను సాయం చెయ్యాలి. అని గట్టిగా నిర్ణయించుకున్నాక తేలిక పడింది వినీల మనసు.

వినీల మీద కోపంతో టిఫిన్ సగమే తిని ఆఫీసుకెళ్ళాడు శ్రీహరి.మర్నాడే ఇన్స్పెక్షన్ వుండటంతో చాలా టెన్షన్ గా వున్నాడు. అన్ని ఫైల్స్ చెక్ చేస్కుంటూ ఉండగా ప్రక్క సీట్లో మాట్లాడుకుంటున్న లేడీ కొలీగ్స్ మాటలు చెవినబడ్డాయి.

" ఎప్పుడూ ఫ్రెష్ గా వుంటావు... ఏ విషయానికీ  టెన్షన్ పడవు...ఎలా కుదురుతుందే నీకు..అని అడిగింది...మాధవి. తన కొలీగ్ పల్లవిని.ఏం లేదే ! మా హజ్బెండ్ నాకు అన్ని విషయాల్లో హెల్ప్ చేస్తారు. ప్రొద్దుట లేచిన దగ్గర్నుంచి ఇంటి పన్లు..పిల్లల పన్లు అన్నీ షేర్ చేస్కుంటాం. అందువల్ల నేను హ్యాపీగా , ప్రశాంతంగా వుండగలుగుతున్నాను...

ఇంటి పనులన్నిటిలో ఆయన సహాయం వుండడం వల్ల ఆఫీస్ పని కూడా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ పెండింగ్ వర్క్ లేకుండా చేసుకోగలుగుతున్నాను. అందుకే రేపు ఇన్స్పెక్షన్ అయినా నాకే మాత్రం టెన్షన్ లేదు. అని చెప్పింది పల్లవి.

ఆ మాటలన్నీ విన్న శ్రీహరికి చెంపన చెళ్ళున కొట్టినట్లయ్యింది. ఎప్పుడూ హడావుడిగా ఇంటిపన్లు చేసుకుంటూ పిల్లల చదువు విషయంలో హైరానా పడ్తూ ముఖంలో ఎప్పుడూ అలసట, విసుగు తప్ప ప్రశాంతత కనిపించని భార్య వినీల ముఖం గుర్తుకొచ్చింది.

ఎందుకో ఆ క్షణంలో చాలా బాధనిపించింది శ్రీహరికి. ఇకపై మార్నింగ్ వాక్ సమయాన్ని కొంచెం తగ్గించుకుని భార్యకు సహాయపడాలని నిర్ణయించుకున్నాడు...

నేటి యాంత్రిక జీవన విధానంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్కుంటూ , తోటి ఉద్యోగస్తులతోనూ..తమ కంటే క్రింది స్థాయి ఉద్యోగస్తులతోనూ, పై స్థాయి అధికారులతోనూ, అన్ని విషయాలలో రాజీపడుతూ సర్దుకుపోవడం తప్పనిసరి..అది అవసరం కూడా..అలాగే...

జీవిత భాగస్వామి పట్ల కూడా సాధ్యమైనంత వరకూ సహనం వహిస్తూ ఒకరికొకరు చేతనైనంత సహాయం చేసుకుంటూ సర్దుకుపోతూ అలకలకూ, అపార్థాలకూ తావివ్వకుండా సంతోషాన్ని పంచుకుంటుంటే, " గృహమే కదా స్వర్గసీమ " అనే నానుడి ఖచ్చితంగా అందరిపట్లా నిజమౌతుంది.




ఆరవతరగతి గది... పాఠం చెప్తోన్న సైన్స్ టీచర్ పల్లవి అటెండర్ నోటీస్ బుక్ పట్టుకుని రావడంతో పాఠం ఆపి ఆ నోటీస్ అందుకుని చదివింది....నవంబరు 14న చాచానెహ్రూ గారి పుట్టినరోజు సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా స్కూల్లో జరిపే ఆటల పోటీల్లోను, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ

పాల్గొనదలచిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆ నోటీస్ సారాంశం...

పల్లవి చెప్పిన విషయం విని తమ పేర్లు నమోదు చేసుకున్నారు కొందరు పిల్లలు....నోటీస్ తీసుకుని అటెండర్ వెళ్ళిపోగానే తిరిగి పాఠం మొదలుపెట్టబోయిన పల్లవి ఏదో గుర్తొచ్చి, " అవునూ..శ్రీజా నీ పుట్టిన రోజు కూడా నవంబర్ 14న నే కదూ.." అంది..." అవును టీచర్.." అంది శ్రీజ.. ఇంతలో శ్రీజ పక్కనే కూర్చున్న జాహ్నవి లేచి, " టీచర్..! శ్రీజ వాళ్ళ డాడీ పెద్ద డాక్టర్ కదా..శ్రీజ ప్రతీ బర్త్ డే కి ఖరీదైన స్వీట్లూ...చాక్లెట్లూ గిఫ్టులూ పంచుతారు... " అని అడక్కుండానే చెప్పింది...వెంటనే దినేష్ లేచి, టీచర్..నా బర్త్ డే కూడా నవంబరు 14ననే..."అని చెప్తూండగా కొంతమంది పిల్లలు కిసుక్కున నవ్వటం గమనించింది పల్లవి.

రేవంత్ లేచి, "టీచర్! దినేష్ పుట్టిన రోజునాడు కనీసం చాక్లెట్స్ కూడా ఇవ్వడు. ఎందుకంటే వాళ్ళ డాడీ రిక్షా పుల్లర్....మనస్కూల్లో చాలామంది ఆ రిక్షాలోనే వస్తారు..."అన్నాడు.చిన్నబోయిన దినేష్ ని చూడగానే జాలి కలిగింది పల్లవికి. పల్లవికి. రేవంత్ అలా మాట్లాడకూడదు...అని దినేష్ దగ్గరకు వెళ్ళి, చూడు దినేష్, కేవలం పేదరికం వలన మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకోనక్కర లేదు....ఎప్పుడూ ఇలాగే చక్కగా చదువుకుని క్లాస్ ఫస్ట్ వస్తూ..మంచి ఉద్యోగం చేసి మీ అమ్మా,నాన్నలను సంతోషపెట్టాలి..ఓకే.." అంది పల్లవి.... చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ముందే ఉండే దినేష్ అంటే అభిమానం పల్లవికి." అయినా, పుట్టినరోజంటే ఖరీదయిన బహుమతులూ మాత్రమే కాదు...ఆరోజు పదిమందికి గుర్తుండే మంచిపని కూడా చేయొచ్చు..." అని చెప్పింది పల్లవి...

ఇంటికొచ్చినప్పట్నుంచీ ముభావంగా ఉన్న దినేష్ ని ఏమైందని అడిగింది అతడి తల్లి లక్ష్మి."అమ్మా! ఈసారి నా బర్త్ డే కి మా క్లాస్ మేట్స్ కి మంచి చాక్లెట్లూ..గిఫ్టులూ ఇద్దామే" దీనంగా ముఖం పెట్టి అన్నాడు దినేష్..అప్పుడే అక్కడకు వచ్చి ఆ మాట విన్న దినేష్ తండ్రి నారాయణ "ఒరేయ్! మంచి కాన్వెంట్లో ఎక్కువ ఫీజులు కడుతూ నిన్ను చదివించడమే నాకు తలకు మించి భారమౌతూ ఉంది...కానీ నువ్వు బాగా చదువుకుని గొప్పవాడివి కావాలన్న ఆశతో చదివిస్తున్నాను. పుట్టినరోజులు..బహుమతులు అంటే నావల్ల కాదు..నువ్వే అర్థం చేసుకోవాలి...." అంటూ అక్కణ్ణుంచి కోపంగా వెళ్ళిపోయాడు...కొడుకు చిన్నకోరిక తీర్చలేని తమ పేదరికం తల్చుకుని బాధపడింది లక్ష్మి.హోం వర్క్ చేసుకుంటూ కూర్చున్న దినేష్ మనసు నిండా ఒకటే ఆలోచనలు....ఎలాగైనా ఈసారి తన పుట్టినరోజుకి అందరికీ గుర్తుండే మంచి బహుమతులు ఇవ్వాలి....ఎలా..

నవంబరు 14 రానేవచ్చింది... ఖరీదైన మెరిసే కొత్త డ్రెస్ లో క్లాస్ లోకి అడుగుపెట్టింది శ్రీజ...మంచి చాక్లెట్లూ..ఖరీదైన గిఫ్టులూ పంచింది...లాల్చీ పైజామాలో గుండెలమీద గులాబీ పువ్వుతో అచ్చు చాచానెహ్రూ లాగే వచ్చాడు దినేష్....మామూలు చాక్లెట్లు పంచాడు...ఆ తరవాత వాళ్ళ నాన్న రిక్షాలో తెచ్చిన యాభై పూల మొక్కలను తోటి విద్యార్థులందరికీ బహూకరించాడు....ఆశ్చర్యంగా చూస్తున్న పల్లవి టీచర్ తో ఏదో మాట్లాడింది, దినేష్ తల్లి లక్ష్మి....

బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల బహుమతుల ప్రదానోత్సవం స్టేజి...ముందుగా ఉపన్యాసం మొదలు పెట్టిన ప్రిన్సిపల్ సర్ మైకు తీసుకుని ముందుగా అందరికీ అభినందనలు చెప్పి, ఆ తర్వాత ఇలా అన్నారు....పిల్లలూ..ఈరోజు పుట్టినరోజు సందర్భంగా దినేష్ మీకందరికీ ఇచ్చిన బహుమతి విలువ ఎంతో తెలుసా...అనంతం...ఎందుకంటే, కాలుష్యం బారిన పడి... పచ్చదనం కరువైన కాంక్రీట్ జంగల్ లో బ్రతుకుతున్న మనకు చెట్ల ఆవశ్యకతను గుర్తు చేసే చక్కటి బహుమతి...మీరందుకున్న మొక్కలను చక్కగా పెంచి, పెద్దచేసినట్లయితే అతడిచ్చిన బహుమతి సార్ధకమౌతుంది..అంతేకాదు...కాలుష్యం బారినుండి మనను మనం కాపాడుకోవాలనే స్ఫూర్తి మరికొందరిలో కలిగించినట్లవుతుంది...ఈబహుమతి పంచడానికి తన తండ్రి పేదైకం వల్ల కావాల్సిన డబ్బు తనవద్ద లేని కారణంగా తానే నర్సరీలో కొన్ని రోజులు మొక్కలకు నీళ్ళుపోసి, శుభ్రం చేసి, వాటికయ్యే ఖర్చు చెల్లించుకుంటానని చెప్పాడు..కానీ, చిన్న పిల్లల్ని పనిలో పెట్టుకోవడం నేరం కాబట్టి ఆ నర్సరీ అతను ఒప్పుకోలేదు.. దినేష్ వాళ్ళమ్మ గారు ఆ బాధ్యత తీసుకుని వారి తాహతుకు మించినదైనా వారి అబ్బాయి చేత మొక్కలు పంచే లాగా ప్రోత్సహించారు.." అని వివరించారు...

అందరూ చప్పట్లతో తమ సంతోషం వ్యక్తం చేశారు..." మంచి ఆలోచనతో మనందరికీ స్ఫూర్తి కలిగించిన దినేష్ ఈ ఏడాది బెస్ట్ స్టూడెంట్ అవార్డుకి కూడా ఎంపికయ్యాడు...."అని ప్రిన్సిపల్ సర్ ప్రకటించడంతో మరోసారి చప్పట్లు మారుమోగాయి...




వర్ధనమ్మ,పార్వతమ్మ బస్ స్టాప్ వెనుక అరుగు మీద కూర్చుని వచ్చేపోయేవారిని చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మధ్య మధ్యలో తెలిసిన వాళ్ళు పలకరిస్తూంటే మాట్లాడుతున్నా, వాళ్ళిద్దరి దృష్టి మాత్రం అక్కడ తిరుగుతున్న మనుషులమీదే

వున్నది.ఆ కాలనీలో చాలామందికి అనుమానం. రోజూ వాళ్ళక్కడ కూర్చుని ఏం చేస్తుంటారు అని. కాలక్షేపం కాక అక్కడ కూర్చుంటున్నారులే అని కొందరు తేలిగ్గా తీసుకున్నారు. ఎంత కాలక్షేపం కాకపోయినా రోజూ అలా బస్టాండులో బీటు వెయ్యటమేమిటని నోరు నొక్కుకున్నవాళ్ళూ ఉన్నారు. ఎవరేమనుకున్నా వాళ్ళు పట్టించుకోలేదు సరికదా అడిగిన వాళ్ళకక్కూడా సమాధానం ఇవ్వలేదు. వాళ్ళపని మాత్రం వాళ్ళు చేస్తున్నారు.పదిరోజులనుంచి వాళ్ళు ఆ అమ్మాయినీ, అబ్బాయినీ గమనిస్తున్నారు. అమ్మాయికి 16ఏళ్ళు ఉంటాయి. సౌందర్యరాశి అనలేం కానీ, ఆ వయసులో అమ్మాయిలు అందంగా వుంటారు. పొద్దున కాలేజ్ కి ఏ సమయంలో వెళ్తుందోగానీ, రోజూ వచ్చేసరికి సాయంకాలం 4-30 అవుతుంది. దాదాపు రోజూ అదే బస్ లో వస్తుంది.

ఒక పది రోజులు క్రితం దాకా పక్కన ఇంకో అమ్మాయి కూడా వుండేదిగానీ ఇప్పుడు కనబడడం లేదు. పైగా ఆ అమ్మాయిలో మార్పు కనబడుతోంది. ఇదివరకు బస్ దిగాక స్నేహితురాలితో కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ తుళ్ళుతూ పక్కనేం జరుగుతున్నా పట్టించుకోనట్లు వెళ్ళేవాళ్ళు. ఇప్పుడు చున్నీ నిండా కప్పుకుని వంచిన తల ఎత్తకుండా ఎవరో తరుముకు వస్తున్నట్టు గబగబా వెళ్ళిపోతోంది. వెనకే ఆ అబ్బాయి... ఇరవై ఏళ్ళుంటాయి.. డిగ్నిటీ కన్నా ఫ్యాషన్ కే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే వయసు.. ఆకారం కొంచెం అనాకారంగా అనిపిస్తూ ఆ అబ్బాయంటే అంతమంచి అభిప్రాయాన్ని కలగజెయ్యదు. వీలైనంతమటుకూ ఆ అమ్మాయిని తాకుతూ నడవడానికి ప్రయత్నిస్తూ వీళ్ళకి కనబడినంతసేపూ ఏదో మాట్లాడుతూనే ఉన్నాడూ.

వర్ధనమ్మ, పార్వతమ్మ అమాయకంగా కనిపించే అతి తెలివైన వాళ్ళు. మర్నాడూ వాళ్ళక్కడే కూర్చున్నారు. బస్ వచ్చి ఆగింది. ఆ అమ్మాయీ, అబ్బాయీ ఇద్దరూ దిగారు. అయితే ఆ అమ్మాయి కంగారుగా నడవడం మొదలుపెట్టలేదు. ఆ అబ్బాయి వంక చూసి ఏదో మాట్లాడింది. అరుగు మీద కూర్చున్న వర్ధనమ్మ, పార్వతమ్మలను చూపించి అటువైపు నడిచింది. ఆ అబ్బాయి తటపటాయించాడు. వెనక్కి తిరిగి పోబోయాడు. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో, తలెగరేసి ఓసారి జుట్టు సరిచేసుకుని వాళ్ళవైపు నడిచాడు.

" రా బాబూ, కూర్చో" వర్ధనమ్మ అరుగు మీద పక్కకి జరిగి చోటు చూపించింది. " పర్లేదులెండి చెప్పండి ఏంటి..ఎందుకు పిలిచారు?" నిర్లక్ష్యంగా అడిగాడు అతను.

" ఈ రాధ మా మనవరాలు. నువ్వు దీన్ని ప్రేమించావంట కదా..రోజూ చెబుతున్నావంట.. వీళ్ళమ్మకేమో దీన్నీ, దీని చెల్లెల్నీ బాగా చదివించి పెద్ద ఆఫీసర్లని చెయ్యాలని కోరిక. దానికోసమే వాళ్ళు ఉన్న డబ్బంతా పిల్లల చదువుకే ఖర్చు పెడతారు. దీనికీ చదువంటే ప్రాణం. కానీ నిన్ను చూస్తే ఇట్టా వదలకుండా వెంటపడుతున్నావాయే..." ఊపిరి తీసుకోవడానికని ఆగింది వర్ధనమ్మ. దొంగ చూపులు చూస్తూ ఆలోచనలో పడ్డాడు హీరో.

డామిట్..కథ అడ్డం తిరిగింది. ఏదో కాలక్షేపానికి అమాయకురాలిగా కనబడిన అమ్మాయి వెనక పడ్డాడు. కొంతకాలం ఆడుకుని వదిలెయ్యాలనుకున్నాడు. ఆ అమ్మాయి తన దోవలోకి రాకపోయేసరికి పేపర్లు, టీవీలలో చూస్తున్న రౌడీయిజం కూడా ప్రదర్శిస్తున్నాడు. ఆ అమ్మాయి భయపడుతుంటే తనకి చాలా సరదాగా ఉంది. భలే కాలక్షేపం. తనకేంటి? తన తండ్రికి ఆయన వ్యాపారంలోనూ, తల్లికి ఇంటి పనితోనూ తనని పట్టించుకునే తీరిక లేదు. తల్లి గారాబంతో అడిగిన డబ్బు ఇస్తుంది. అందుకే తనాడింది ఆట..పాడింది పాట. సరదాగా సాగిపోతున్న తన జీవితంలో ఈ ముసలాళ్ళ గోలేమిటి? ఏదో సరదాకి పోతే వీళ్ళిట్లా పట్టుకున్నారు. వీళ్ళ వాలకం చూస్తే పెళ్ళి కుదిర్చేటట్లున్నారు. తనకా ఉద్దేశమే లేదు. పైగా అమ్మా నాన్నకి తెలిస్తే చంపేస్తారు. ఏం చెప్పాలో తెలియక ఊ..ఊ.. అంటూ మూలిగాడు.అబ్బాయి అవస్థ చూసి చిన్నగా నవ్వుకున్న వర్ధనమ్మ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది. " మీ నాన్న పేరేమిటన్నావ్? ఏం చేస్తుంటాడు? అవునూ, ఇంతకూ నువ్వేం చదివావు? ఉద్యోగం చేస్తున్నావా? అక్క చెల్లెళ్ళు అన్నదమ్ములు ఎంతమంది? " వర్ధనమ్మ, పార్వతమ్మ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు ప్రశ్నలు గుప్పించేస్తున్నారు. హీరోకి చికాకు పెరిగిపోతోంది. ఫ్రెండ్స్ తో చాలెంజ్ చేసాడు. ఆ అమ్మాయిని అనుభవించి వదిలేస్తానని. ఇప్పుడు వాళ్ళకేం సమాధానం చెప్పాలి? తండ్రికి ఇలాంటి విషయాలు తెలిస్తే తాట తీస్తాడు. మేనత్త కూతురే తన పెళ్ళామని ఎప్పుడో నిర్ణయించేసారంతా,లేకపోతే ఆస్థులు ఆగమైపోవు! ఏదోవయసుమీదున్నాడు,నాలుగు రోజులు ఎంజాయ్ చేద్దామనుకున్నాడు కానీ,ఇలా ముసళాళ్ళకు సమాధానాలిచ్చుకుంటూ పైసా లేని బికారిదాన్ని పెళ్ళి చేసుకోవటానికి తనేం తెలివితక్కువ వాడా!? ముందు వీళ్ళనొదిలిచ్చుకోవాలి.

రేపు మానాన్నని తీసుకొస్తా, ఆయన మాట్లాడుతాడు. దోస్తు పిలుస్తున్నాడు మల్లొస్తా. రోడ్డు మీద వాళ్ళకెవరికో చెయ్యి ఊపుతూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.అన్నీ అర్ధమయిన శాంత (పేరు కూడా మార్చేసింది వర్ధనమ్మ) చాలా రోజుల తరువాత సంతోషం తో పడీ పడీ నవ్వింది. పీడా వదిలింది మామా. వర్ధనమ్మని వాటేసుకుని ముద్దు పెట్టుకుంది. నిన్న మీరు నన్ను ని విషయాలు అడుగుతుంటే భయపడ్డాను,ఏం చేస్తారోనని, మంచి పని చేసారు మామ్మా... ముందు మీరేం చేయగలరనేసందేహం. అమ్మా, నాన్నకి తెలుస్తే చదువు మానిపించేస్తారని భయం. నేను చదువుకుందామనుకుంటుంటే... ఈ గోలేమిటని, చికాకు అబ్బ ఒకటి కాదు, వీడి మూలం గా నరక యాతన పడ్డాననుకోండి. నిజం గా మీలాంటి వాళ్ళు ప్రతీ కాలనీ లో వుండాలి. అప్పుడు మాలాంటి వాళ్ళం నిర్భయం గా బయటకి రాగలము. నేను మా వాళ్ళందరికీ చెప్తాను. మీ సాహసం గురించి ఇంక ఇలాంటి విషయాల్లో ఏమీ భయపడవద్దని, అవసరమైతే మీ సహాయం తీసుకోమని కూడా చెప్తాం. నిజంగా మీరు గ్రేట్ మామ్మా, మిమ్మల్ని రోజూ ఇక్కడ చూసి, కబుర్లు చెప్పుకోవడానికి ఇల్లు సరిపోలేదా అని అనుకున్నాను కానీ, ఇవాళ మీరు నా జీవితాన్ని కాపాడారు. వాడు యాసిడ్ పోస్తానంటే నిజంగా చాలా భయపడిపోయాను.. భలే బెదరగొట్టారు.. మళ్ళీ ఈవైపు రారు. అబ్బ..ఎంత సంతోషంగా వుందో..." శాంత ఉత్సాహానికి అంతే లేదు.

"మీలాంటి వాళ్ళకోసమే మేమిక్కడ కూర్చుంటామ్రా..ఇంట్లో మేము చేసే పనేం లేదు. భగవంతుడు జన్మనిచ్చినందుకు ఏదోక మంచిపని చెయ్యాలి కదా..ఈమధ్య ఈ గోలెక్కువగా వున్నాయి కదా...ఆడపిల్లలకూ వ్యక్తిత్వం, ఇష్టాయిష్టాలూ వుంటాయి. ఎవడో ప్రేమించానని వెంటపడితే వాడికి భయపడి చదువూ-సంధ్యా మానేసి, ఇష్టమున్నా, లేకపోయినా వాడిని పెళ్ళిచేసుకోవాలా? లేకపోతే కుళ్ళికుళ్ళి ఏడుస్తూ ఇంట్లో కూర్చోవడమో, ఆత్మహత్యలు చేసుకోవడమో తప్ప గత్యంతరం లేదా..? అందుకే మీకు తెలీకుండానే మీలాంటి వాళ్ళకి కాపలాగా ఇక్కడ కూర్చుంటున్నాము. మామూలంగా కొంతమందికైనా మంచి జరిగితే

మాకంతకన్నా కావాల్సిందేముంది..? " తృప్తిగా సమాధానం చెప్పారు వాళ్ళు.

'మరి వాడు రౌడీ అయి ఇంకేమన్నా గోల చేస్తే ఏం చేసేవాళ్ళు...?" మళ్ళీ భయం శాంతకి."ప్రతిదానికీ ఉపాయం ఉంటుందమ్మా..మేమిన్నేళ్ళనుంచి ఈ కాలనీలో వుంటున్నాం కదా, మేము పిలిస్తే ఇక్కడివాళ్ళు పలుకుతారులే....పోలీస్ స్టేషన్ లో, కాలనీలో పెద్దవాళ్ళతో కూడా చెప్పి ఉంచాములే. మేమిట్లా చేస్తున్నాము, ఏమైనా అవసరమైతే సహాయం చెయ్యాల్సి వస్తుందని .మన కాలనీ వాళ్ళకోసం వాళ్ళూ అవసరమైనప్పుడు సహాయం చేస్తామన్నారు. మేము వయసులో కూడా పెద్దవాళ్ళం కనుక మీకుమల్లే అన్నిటికీ మొహమాటపడం. అవసరమైతే అరవగలం. మీదిప్పుడు తెలిసీతెలియని వయసు.. సరదాగా, సంతోషంగా వుండాల్సిన వయసు..ఇంట్లోవాళ్ళ ప్రేమతో హాయిగా చదువుకోండి. ముందు ముందు బాధ్యతలూ, బరువులూ తప్పవు..ఇప్పుడు కూడా ఈ గోలలన్నీ ఎందుకు...ఏ వయసు ముచ్చట ఆ వయసుది. చదువుకునే వయసులో హాయిగా చదువుకోండి.."వర్ధనమ్మ మాటల్ని మధ్యలోనే అందుకుంది పార్వతమ్మ.

"అయినా మీరు కూడా ధైర్యంగా వుండాలి. మీకే ఇబ్బందులొచ్చినా ఇంట్లో పెద్దవాళ్ళతో చెప్పండి. దాచుకుని జీవితాలు పాడు చేసుకోవద్దు. నిన్న మేం అంత గుచ్చిగుచ్చి అడిగాం కనక నువ్వు నీ సంగతి చెప్పావు లేకపోతే ఏమయ్యేదో ఒక్కసారి ఆలోచించు..ఇప్పుడు ఫలితం చూడు.. నువ్వు హాయిగా చదువుకోవచ్చు.. అందుకే మీ ఇబ్బందులు మీలోనే దాచుకుని మీ నిర్ణయాలు మీరు తీసుకోవద్దు. పెద్దవాళ్ళతో చెప్పటం నేర్చుకోండి. ఇంకెప్పుడూ ఏ విషయం ఇలా దాచుకోకు.."

" అమ్మో..తల్చుకోవటానికే భయంగా ఉంది.. వద్దు మామ్మా..ఈ పది రోజులూ నరకం అనుభవించాను. ఎంత భయపడ్డానో..తిండీ..నిద్రా లేదు. ప్రతిక్షణం భయపడుతూనే ఉన్నాను. ఇప్పుడా భయం అంతా పోయింది. చాలా ధైర్యం వచ్చింది.. ఇకముందు ఏం జరిగినా అస్సలు భయపడను..ముందు మీకు చెప్పేస్తాను...అంతేకాదు..ఈసంగతి మా ఫ్రెండ్సందరికీ చెప్పేస్తాను.. వాళ్ళ కాలనీల్లో కూడా వీలైతే పెద్దవాళ్ళనిలా కాపలా వుండే ప్రయత్నం చేయ్యమంటాను.. అప్పుడీ గోలలు తప్పకుండా తగ్గుతాయి.. ముందు హాయిగా నిద్ర పోవాలి కద మామ్మా..పదిరోజుల పైనే అయింది నిద్రపోయి...రేపటి నుండి పరీక్షలు.. చదువుకోవాలి..వస్తాను..నిజంగా మీరిద్దరూ చాలా గ్రేట్ మామ్మలూ" మళ్ళీ వాళ్ళిద్దర్నీ కౌగిలించుకుని సంతోషంగా బయల్దేరింది శాంత.




కిరణ్మయి ఆఫీసు నుంచి వచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది.గుమ్మంవద్ద కూర్చునున్న అమ్మా నాన్నల్ని చూసిఆశ్చ ర్య పోయింది." ఏంటమ్మా! ఎప్పుడొచ్చారు? అసలు ఫోనెందుకు చేయలేదు? అసలు ఇలా ఎందుకు రావాల్సి వచ్చింది! " అంది. "ముందు తలుపు తెరువు. నిదానంగా అన్నీ చెప్తాం." అంది అమ్మ అరుణ మ్మ ." దాహంతో నాలుక పిడచకట్టుకుపోయింది."అంటూ నాయన నాగేశం అన్నాడు. గబగబా తలుపు తాళం తీసి ఇద్దర్నీ లోపలికి పిలుచుకెళ్ళింది.ఫ్రిజ్ లో చల్లని నీరిచ్చి"ఏమైందో చెప్పండి! ఐనా అన్న మిమ్మల్నిలాఎలా పంపాడు? బుద్ధిలేనివాడు.మీకోడలు మహారాణి ఏంచేస్తున్నది?"అంది ఉగ్రురాలై కిరణ్మై. " కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని అదంతా ఎందుకుఏమ్మా!." "అమ్మా! కిరణ్మయి ! ఇంక నీవేమాకు దిక్కు. మీవదిన మేము ఇంట్లో ఉంటే తానుండనని యాగీచేసింది. మమ్మల్ని గెంటేసింది.

పిల్లల్ను తీసుకుని పుట్టింటి కెళ్ళిపోయింది.మీఅన్న వెళ్ళి బ్రతిమాలి తీసుకొస్తానని వెళ్ళాడు. ఆమె వచ్చేసరికి మేముంటే గొడవవుతుందని మీ అన్న మమ్మల్ని వెళ్ళిపొమ్మన్నాడు " అంటూ బావురుమన్నారు ఇద్దరునూ. " అదేంటీ వదినకీ పిదపకాలం బుద్ధి ఎందుకొచ్చిందీ! పార్వతీ పరమేశ్వరుల్లాంటి మిమ్మల్ని ఇంట్లోంచి వెళ్ళమంటుందా! ఏం ఆమె అమ్మానాన్నల్లాంటి వాళ్ళు కాదా మీరు? వాళ్ళ అమ్మా నాన్నల్ను వాళ్ళ వదిన బయటికి గెంటేస్తే ఏం చేస్తుందిట? ఐదేళ్ళనాడొచ్చిన ఆమెకోసం , కనిపెంచి పెద్దచేసిన అమ్మా నాయల్నా ను పంపించేశాడా వాడు? " అంటూ అన్న ,వదినపై కేకలేయసాగింది." ఐనా నేనుండగా మీకేం భయంలేదు. మీరిద్దరూ మాఇంట్లోనే ఉండండి.చూస్తాను వాడిపని, వాడి భార్య పనీని"అంది ధీమాగా. "మీ ఇంట్లో ఉంటే మీ అత్తామామా, మీఆయనా ఊరుకుంటారుటే!" అడిగింది అమ్మ అరుణమ్మ.

" మీ ఇంట్లో రెండుబెడ్రూంసేగా ఉండేవి, మేమెక్కడుంటా మమ్మా కిరణూ!" అడిగాడు నాయన నాగేశం. గతుక్కుమంది కిరణ్మయి . "అవని నేను చూసుకుంటా న్లేగానీ ఎప్పుడనగా తిన్నారో రండి వేడిగా దోసెసి పెడ తాను." అంది.వాళ్ళిద్దరూవెళ్ళి కాళ్ళూ ముఖాలూ కడుక్కుని డైనింగ్ టేబుల్ వద్ద కూర్చున్నారు. పర ధ్యానంగా దోసె వేస్తున్న కిరణ్మయి తో " కిరణీ ! అసలు నిన్నో విషయం అడగాలే మాబాధలోపడి మర్చేపోయాం.అసలు ఇంటి కెందుకు తాళమేసుంది? ఎప్పుడూ మీ అత్తామామా ఇంట్లోనేగాఉంటారు. నీవు వచ్చేసరికి అన్నీ వండి పెడుతుంటారుగా?" "వాళ్ళూ వాళ్ళూ .." "ఏమైనారే వాళ్ళు ? పార్వతీ పరమేశ్వరులంటే అసలు వాళ్ళేనే...ఎక్కడికెళ్ళారు.నీవులేకపోయినా మేమెప్పుడొచ్చినా వేడిగా వండిపెట్టేవారావిడ! ఆయనెంత మంచివాడే మాకు కాళ్ళుకడుక్కోను నీరు తానే తెచ్చిచ్చేవాడు. చెప్పవేమే?ఎక్కడవాళ్ళు?తరిమేశావా? తగాదా పెట్టుకున్నావా?చెప్పు." "అదీ అదీ..." నోరుదాటి మాటరాలేదు కిరణ్మికి . "ఛీ వాళ్ళకు స్థానంలేని చోట మాకూలేదు. ముందుగా ఇదివారిల్లు, ఆతర్వాతే మేముండాలి.మమ్మల్ని మీవదిన తరిమేసిందంటే అంత ఎగిరిందానివి , నీవేం చేశావే మీ అత్తామామల్ని? మేం వెళుతున్నాం,."అంటూ లేచి సంచి తీసుకుని వెళ్ళిపోయారు. వెళ్ళిరూంలో పడుకుంది.అంతా ఒక సినిమా రీలులా తిరుగు తున్నది ఆమె మదిలో. " నేను నీతో బ్రతక లేను. నీ నిజస్వరూపం తెలిక నిన్ను పెళ్ళి చేసుకున్నందుకు చాలానే అనుభవించాను. ఇహ నాకు ఓపిక లేదు." ఖచ్చితం గా చెప్పింది కిరణ్మయి .

“ నిన్ను నేనేం మోసం చేశాను!.ఏవిషయంలో..? ” అడిగాడు సమ్యమనం పాటిస్తూ గాంధీ. “నీ అమ్మా నాన్నా మనతో ఉంటారని చెప్పావా? ” “ నా పేరెంట్స్ నాతో ఉండక మరెక్క డుంటారు?” ఆశ్చర్యంగా అడిగాడు. “నా కిష్టంలేదు. వాళ్ళు మనతో ఉండటం , పెళ్ళికి ముందు నీ వివిష యం నాతో ఎందుకు మాట్లాడలేదు.” “ఇదేమన్నా అన్నివిషయాల్లాగా పెళ్ళికి ముందు చర్చించేదా? నేనొక్కడ్నే వాళ్ళకు సంతానం,వాళ్ళు మరెక్కడి కెళతారు?” “ఏ ఏట్లో కన్నా వెళ్ళమను.నాకా విషయం తెలిదు. నీఅందం, హోదా చూసి నీతో పెళ్ళికి ఒప్పుకున్నాననుకున్నావా?? ఆపాటి హోదా, ఉద్యో గం ఉండే సంబం ధాలు నాకు చాలానే వచ్చాయి. వాళ్ళంతా వాళ్ళ పేరెంట్స్ ను వాళ్ల తోనే ఉంచుకుంటామన్నందుకే నేను ఒప్పుకోలేదు.” “మరి నన్నెందుకీ విషయం ముందే అడగలేదు . అడిగి ఉంటే ఖచ్చితంగానే చెప్పేవాడ్ని. నీకోసం వాళ్ళను వదులుకోవాలా? నన్నుకన్న అమ్మా నాన్నావాళ్ళు పరాయి వాళ్ళుకాదు !” “నా కోసం వాళ్ళని వదులుకోలేక పోతే నన్నే వదులుకో!..” రోషంగా అంది కిరణ్మయి . “ఏంటే నిన్ను వదులుకోవాలా ! నీకే మన్నా పిచ్చా”? ఆశ్చర్యంగా అడిగాడు గాంధీ. “ఎస్ ? నాకు పిచ్చే నీ అమ్మానాన్నలను మనతో ఉంచుకుంటే నేను వెళ్ళిపోతాను.” “ఐతే ఏమంటావ్? విడిపోతానంటావా?” “ ఔను వాళ్ళ బాధ్యత నేను వహించలేను.

నాకు విడాకు లిచ్చెయ్! హాయిగా వంటరి బ్రతుకు బ్రతుకు తాను.”ఖచ్చితంగా అంది కిరణ్మయి . “అసలు వాళ్ళబాధ్యత నీవేం వహిస్తున్నావ్ ! మోస్తున్నావా? వండిపెడుతున్నావా? వంటరి బ్రతుకు బ్రతకాలనుకున్నదానివి నన్నెందుకు చేసు కున్నావ్ “ నీ అమ్మా అబ్బా మనతో ఉంటారని తెలిక..” “మీ అమ్మా,నాయనా మీఅన్నతో ఉండటం లేదా!వాళ్ళ నెక్కడైనా వృద్ధాశ్రమంలో చేర్పించాడా మీ అన్న ? మీవదిన నీలాగా మాట్లాడి ఉంటే ఏమయ్యేది?” “మావాళ్ళ మాటెత్తకు., మావాళ్ళకూ మీవాళ్ళకూ పోలికెక్కడ ?” “ఏం? మీ అమ్మానాయనా ఒకటి, మా అమ్మానాయనా మరొకటా? మీ అమ్మా అబ్బా నీకెక్కువైతే మా అమ్మా అబ్బానాకెక్కువే!” “నీవేమైనా అనుకో, మీ వాళ్ళతో మావాళ్ళను

పోల్చవద్దన్నానా?"     "ఛీ! నీతో మాట్లాడటంకంటే     ఆపశువులతో మాట్లాడటంమేలు." అంటూబయటికెళ్ళిపోయాడు గాంధీ, అతడికి     గాంధీమహాత్ముడంత     ఓర్పు.     మరొకరోజు—" ఈ రోజు తేల్చు , ఆ ముసలాళ్ళని ఎప్పుడు పంపిస్తావో బయటికి..."కఠిన స్వరంతో అంది కిరణ్మయి     " వాట్ నాన్ సెన్స్ యూ ఆర్ టాకింగ్ . నథింగ్ డన్.."     " దెన్ ఐ కెన్ గో."     "డు వాట్ యు వాంట్ .. ?!"     దెన్ గివ్ మి మై పోర్షన్ ఆఫ్ ద ప్రాపర్టీ.. "     "ఆర్యూ మ్యాడ్     ? నీకేమన్నాపిచ్చా? ! నీ ఆస్తేంటి ? నివేమిచ్చావ్ నాకు.? ఇదంతా మా అమ్మానాన్నల ఆస్థి. అదివారి అనంతరం నాకు, నా బిడ్డలకూ చెందుతుంది.నీవు     నాతో ఉంటే నీవూ     అనుభవించ వచ్చు. అంతే."     "ఐతే పెళ్ళి చేసుకుని వదిలేస్తావా?"     " నేనెక్కడ వదిలాను? నీవే వెళ్ళిపోతానని బెదిరిస్తున్నావ్     రోజు!. యాగీ చేస్తున్నావ్! నరకాన్ని ఇంట్లోనే సృష్టి స్తున్నావ్?" " ఔను నాకోరిక తీరే వరకూ ఇలాగే ఉంటాను. నా మాట ప్రకారం     ఆ ముసలాళ్ళని బయటికి పంపకపోతే , నన్ను మీరంతా చంపాలని చూస్తు న్నారని , నా వళ్ళు నేనే కాల్చుకుని , మీ మీద కేసుపెట్టి జైల్ కుపంపు తాను,."     "ఛీ నీచురాలా?నీవింత మృగానివని తెలీక నిన్ను చేసుకున్నాను.ఉండు మీఅన్నను అగుతాను.నీనిజస్వరూపం దాచి నాకెందుకు అంటగట్టాడో!"     " నీవు మాఅన్నకు ఫోన్ చేస్తే ఇప్పుడే గాస్ స్టవ్ వెలిగించుకు చస్తా, ఏమనుకున్నావో? "అంటూ కిచెన్ లోకెళ్ళి తలుపు మూసింది . అంతా చూస్తూ ,వింటు న్న ఆ ముసలి దంపతులు గబగబా వెళ్ళి తలుపు తట్టారు." అమ్మా! తల్లీ! మేం వెళ్ళి పోతాం , నీవేం అఘాయిత్యం     చేసుకోకు. నా కొడుక్కు     ప్రాణ భిక్ష పెట్టు     తల్లీ!" అంటూ నమస్కరించారు.     "ఈ నాటకాలు నావద్ద సాగవు. ముందు మీరిద్దరూ బయటి కెళ్ళి పోతేనే నేను బయటికి వచ్చేది.లేకపోతే పొయ్యి వెలిగించేస్తాను."అంటూ ఆగడం చేసింది కిరణ్మయి , దయ్యం పట్టిన దానిలా. ఎంతో గౌరవంగా     ఉపాధ్యాయ వృత్తిలో జీవించిన ముసలి వాళ్ళిద్దరూ కొన్ని బట్టలు గబగబా తమ సంచీల్లో కూరుకుని," ఇదో తల్లీ !వెళ్ళిపో తున్నాం. ఇహ బయటికి రా !" అంటూ హడావిడిగా బయట కెళ్ళిపోయారు. ప్రేక్షక పాత్ర వహించడం తప్ప మరేం చేయలేక పోయాడు గాంధి.

గాంధీతో చెప్పసాగాడు ఆనందు" బావా! క్షమించు. "కిరణ్మయి చిన్న తనం నుండీ పెంకెగానే ఉండేది. అమ్మ నాన్నా ఉద్యోగస్తులవటం వల్ల ఒక ఆయా చేతుల్లో పెరిగింది .కోరింది ఇవ్వకుంటే ఏదో ఒక అఘాయిత్యం చేసేది .అందుకని అమ్మానాన్నా అడిగింది ఇచ్చి అతిగారాబం చేసి చెడ గొట్టారు ,కొండమీది కోతినైనా తెచ్చి చ్చేవాళ్ళు.కోరింది చదివించారు . హాస్టల్లో ఉంటానంది ,అక్కడే ఉండిచదివింది. అత్త, ఆడబిడ్డలూ లేనివాడ్ని తెస్తేనే పెళ్ళి చేసుకుంటానంది!తాను తన భర్తాతప్ప మరెవ్వరైనా ఇంట్లో తమతో ఉండేట్లైతే పెళ్ళే వద్దంది. ఎన్నో సంబంధాలు చూసి చూసి విసిగిపోయి ఆడబిడ్డేటూ లేదుకనుక తన అమ్మా నాన్న ల్లాంటి ముసలి అత్తా మామల్ని తమతో ఉండను అంగీక రించి,సర్దుకుంటుందని భావించి,మీకు కిరణ్మయి స్వభావంచెప్పకుండా పెళ్ళి చేసిన పాపం మాదే ,దీనికై పరిహారం మేమే చెల్లిస్తాం"అంటూ కళ్ళనీరుపెట్టుకున్నాడు. "ఏయ్ కిరణ్! ఏంటే మీ అమ్మా నాన్నా వృధ్ధాశ్రమంలో ఉన్నారు?"     "ఔనే! నేలమీద పరుపుకూడాలేకుండా చాప మీదపడుకుని, ప్లాస్టిక్ కంచాల్లో అన్నంతింటున్నారు.""ఏంటే ! నీమాటలు నిజమా!మా అన్నకేం వచ్చింది? మావదిన వారిని వృధ్ధాశ్రమానికి పంపుతుంటే ఎలాచూస్తూ ఊరుకున్నాడు వాడు?" " నిజమేనే , కనీసం నీవుండబట్టి వాళ్ళగురించి తెల్సి బాధపడుతున్నావ్?పాపం మీ ఆయనతప్ప మరెవ్వరూ లేని మీ అత్తామామాకూడా అక్కడేఉన్నారు? ఈరోజు మా అత్తగారి పుట్టినరోజుపండుగని వృధ్ధాశ్రమంలో పండ్లు,స్వీట్స్ పంచేందుకు వెళ్తే అక్కడ చూశాం, నీకేమైనా మతిపోయిందా!తల్లి తండ్రి లాంటి అత్తా మామల్ని వృధ్ధాశ్రమానికి తోలేసి, మీ అమ్మా నాన్నా గురించి బాధపడుతున్నావ్? నీవేం మారలేదన్నమాట, మూర్ఖురాలా? ఛీ నీవు నా స్నేహితురాలినని చెప్పుకోనే అసహ్యా మేస్తున్నది."అంటూ ఫోన్ పెట్టేసింది కిరణ్మయి స్నేహితు రాలు సరళ.     ఇంతలో కిరణ్మై మేనత్త మాలతి ఫోన్ చేసింది" ఏమే నీవు మనిషివా రాక్షసివా! అత్తమావల్ని నీమీద హత్యా యత్నం

చేశారని కేసుపెడతానని బెదిరించి వాళ్ళను భయపెట్టి తరిమేశావా? పదిరోజులనుంచి భర్త ఇంటికిరాకపోయినా ఎట్లా తిని నిద్రపోతున్నావే! నీచురాలా? నీవు చూపిన దారినే మీ వదినా నడించింది. నీలాగే వాళ్ళ అత్తామామల్ని తరిమేసింది.ఛీ! మరెప్పుడూ మాతో మాట్లా డకు. నీవు లేవనుకుంటాం" అంటూ ఛీత్కరిస్తూ  ఒకరితర్వాత ఒకరు ఫోన్లుచేస్తుంటే కిరణ్మయి తలతిరిగి పోయింది. ఏనాడూ పొగిడ్తలేకాని ఛీత్కారాలు అందు కోని కిరణ్మయి జరిగిన పరిణామాలన్నీ నెమరువేసుకోసాగింది.

అంతా తననిలా చీదరించు కుంటున్నారంటే తాను తప్పుచేస్తున్నానేమో అనే ఆలోచన లో మొదటి మారుగా తన ప్రవర్తన గురించి తర్కించు కోసాగింది.  ఒక్కర్తె ఉండటాన మొదటిసారిగా వంటరితనం ఫీలవుతూ టీ.వీ ఆన్ చేసింది. ఒక సీరియల్ ప్రసారమవుతున్నది 64 వ ఎపిసోడ్  .అది కోర్ట్ సీను.  న్యాయమూర్తి " కేసు పూర్వాపరాలూ,వాదప్రతివాదాలూ విన్నాక ఈ కోర్టు తీర్పు ఇలా ఇస్తున్నది.కనిపెంచిన వారు వృద్ధు లయ్యాక పిల్లల నిరాదరణకు గురై , వృద్ధాశ్రమాల పాలైతే ఇహఈలోకం లో వృద్ధాశ్రమాలు వీధి కొకటి లేస్తాయి. ప్రస్తుత విద్యా విధానం లో ధనం సంపాదించడం తప్ప, బాధ్యతలు, ప్రేమాభి మానాల గురించి చెప్పే పాఠాలే లేనందున , పెద్ద చదువులు చదివిన వారంతా దేశ విదేశా లు పట్టి పోతుంటే,కన్నవారు వృద్ధాశ్ర మాలపాలవుతున్నారు.మరికొందరు అత్త మామల్ని శత్రువులుగా చూస్తున్నారు. అదేమంటే 'గృహ హింస  కేసు పెడతామని బెది రిస్తున్నారు. ఉన్న చట్టాలను ఇలా వికటంగావాడుకోడమూ నేరమే. రేప్పొద్దున వీరికి కలిగే సంతానానికి వీరే దారి చూపుతున్నారు.ఈ వింత కాలం లో ప్రతి బిడ్డా రెండేళ్ళనుంచే డేకేర్లూ ,ఆపైన చదువులన్నీ హాస్టల్లో ఉండి చదివి ,ఉద్యోగాల్లోచేరి పీ.జి ల్లో ఉంటూ , తమ తోటి ఉద్యోగుల్ని,లేదా  క్లాస్ మేట్స్ ను ,వారికి జీవితం పట్ల సరైన అవగాహన ఏర్పడక ముందే ,జీతాలు చూసుకుని వివాహాలు చేసుకుంటున్నారు.వారికి గృహ జీవనం గురించికాక సహజీవనం గురించి మాత్రమే తెలుస్తున్నది.

అమ్మా నాన్నాలతో ,సోదర సోదరీ మణులతో, బంధుజనాలతో కలసి ఉండేజీవితం అనుభవం లో ఉండటంలేదు.  కొందరు ఒంటరి పేరెంట్ పోషణ లో పెరిగిపెద్దవారై సంఘజీవనానికీ, కుటుంబ వ్యవస్థకూ దూరమై,అంతా స్వార్థం. ఉన్నతవిద్య ,వెంటనే ఉద్యోగం, ఉపాధిబాగా ఉండటంవలన డిపెన్ డెన్సీ అంటే ఆధార పడడం అనేది లేనందున ,అహంకారం,ఈగో ఎక్కువై పోతున్నాయి యువతలో.అందుకు తార్కాణాలే ఇటీవల కోర్టుకు వస్తున్న విడా కులకేసులన్నీ. ప్రస్తుతం ఈ కేసులో వివాహమైనా ఇంట్లో ఎవ్వరూ ఉండకూడదు, అత్తమామలు శత్రువులు,అందుకని ---అంటూ"  న్యాయ మూర్తి చెప్తుండగా ,టీ.వీ ఆపేసి , ఒక నిర్ణయానికి వచ్చిన కిరణ్మయి ఇంటికి తాళమేసి కారుతీసుకుని బయటికి బయల్దేరింది..




ఏప్రిల్ నెల  మూడవ వారం.  వేసవి కాలం మిట్ట మధ్యాహ్నం  వేళ..

మిడి మిడి ఎండలో  ఆర్.టి.సి. బస్ దిగి  ముఖానికి ఎండా తగలకుండా  చీర చెంగుని తల మీదుగా ముందుకు లాక్కుని వేడిని తట్టుకోలేక అక్కడికి రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఉన్న ప్రయిమరీ స్కూలుకి  గబ గబా నడవటం మొదలెట్టాను. అలా నడుస్తూ నడుస్తూనే ..

"...కొత్త  బిచ్చగాడు  పొద్దెరగడన్నట్టు  వేసవి మొదట్లోనే సూర్యుడు ఇంతలా పెట్రేగిపోతున్నాడు ..ఇప్పుడే ఇలా ఉంటే ఇక ముందు ముందు ఇంకెలా ఉంటాడో..." అని ఆలోచిస్తున్నంతలో స్కూలొచ్చేసింది . అన్నీ  తెలిసిన పరిసరాలే ..ఇంచుమించుగా మూడు నాలుగేళ్ళ క్రితం అనుకుంటా ఇదే స్కూల్లో తన సంస్ధ తరపున పిల్లలకి స్కూలు బేగ్గులూ,  పుస్తకాలు పంచటానికి తన కమిటీ వాళ్ళతో కలసి వచ్చింది తను.

సరిగ్గా నేను అక్కడికి వెళ్లేసరికి భోజనాల సమయం కావటంతో టీచర్లూ , పిల్లలూ అంతా ఆ హడావిడిలో ఉన్నారు. మధ్యాహ్న భోజన పధకమట .. పిల్లలంతా వరుసగా కూర్చుని భోజనాలు చేస్తుంటేవాళ్ళ మధ్యలో అటూ ఇటూ తిరుగుతూ అక్కడంతా పర్యవేక్షిస్తున్నారు ఒక మధ్య వయసాయన. ఆయనే హెడ్మాస్టరట . ప్యూను చెప్పాడు . నాకాయన కొత్త ..నేను ఇంతకు ముందు వచ్చినప్పుడు ఈయన కాదు . ఈయనొచ్చి రెండేళ్ళు పైమాటేనట. ఇవ్వాళ వస్తున్నానని నిన్న ఫోన్ చేసి చెప్పినప్పుడేచెప్పారాయన ఈ విషయం ..

ఆలోచిస్తూనే గొంతు ఆరుకుపోతున్నట్టనిపించి బాగ్ లోంచి వాటర్ బాటిల్ తీసి కాసిన్ని నీళ్ళతో గొంతు తడుపుకుని సీసా మళ్ళీ బాగ్ లో పెట్టుకుంటూ చుట్టూ చూసాను .ఒక పక్క ఇంకా తింటున్నవాళ్ళూ , అప్పటికే తినేసిన వాళ్ళల్లో కొంతమంది పరుగెడుతుంటే వాళ్ళని పట్టుకోవటానికి అడ్డదిడ్డంగా పరుగులు పెడుతున్న వాళ్ళు , అంతలోనే ఉన్నట్టుండి గ్రూపులు గ్రూపులుగా ఏర్పడి తన మీంచి దూకమన్నట్టుగా ఒకడు వంగుంటే వాడి మీదుగా అవతలికి దూకే వాళ్ళూ, అలా దూకుతూ పక్కకి పడిపోయే వాళ్లూ ...ఒకటే నవ్వులూ , కేరింతాలు . అరమరికలు లేని ఆ బాల్యం.

చూడ్డానికి ఎంత బాగుందో....

నిజానికి వేసవి శెలవుల్లో స్కూళ్ళు మూసేసినా ఆఫీసు పని చేస్తూనే ఉంటుంది కాబట్టి తనకి కావాల్సిన వివరాలు తర్వాతైనా వచ్చి తీసుకోవచ్చు. కానీ , పిల్లలుండరుగా ..పక్షుల్లేని చెట్లలా పిల్లల్లేని స్కూలేం స్కూలు? అందుకే , వీళ్ళంతా కనిపిస్తారని, ఈ ప్రోగ్రాం ఇప్పుడు పెట్టుకుని ఎండలో బయలుదేరిమరీ వచ్చింది తను . రెప్ప వాల్చేంత సేపు కూడా వాళ్ళని మిస్ అవ్వటం ఇష్టం లేక వాళ్ళ ఆటల్నీ , అల్లర్నీ గమనిస్తూ ఉండిపోయాను చాలాసేపు .

కాసేపటికి భోజనాలు పూర్తయ్యి ఎవరి క్లాసులకి వాళ్ళు వెళ్లిపోవటంతో అక్కడి హడావిడంతా సద్దుమణిగిపోయింది .దూరాన్నుంచి హెడ్ మాస్టర్ ఇటే రావటం చూసి గౌరవసూచకంగా లేచి నిలబడ్డాను . ఆయన నా ముందు నుంచి తన గదిలోకి వెళుతూ వెళుతూ .. “రండి మేడమ్ ..నిన్న ఫోన్ చేసింది మీరే అనుకుంట కదా..” అంటూ ఆయన చేసిన విష్ కి ప్రతిగా విష్ చేస్తూ ఆయన వెనుకే లోనికెళ్ళి ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాను

.ప్యూన్ని పిలిచి చల్లని నీళ్ళు తెమ్మన్నారు . అతనవి తెచ్చేలోపు “ఇంతసేపు ఎదురుచూసేలా చేసినందుకు మన్నించమని అడుగుతూనే అందుకుగల కారణాలు కూడా చెప్పారాయన ..

మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని అలా దగ్గరుండి చూసుకోవటం వల్ల భోజనాల్లో ఎంతో అనవసర వ్రధాని అరికట్టారట . అలా పొదుపు చేసిన దానితో పిల్లలకి అదనంగా ఇంకొక కూర ఎక్కువ వండించ గలుగుతున్నారట . ఇంకొక కూర ఎక్కువుండేసరికి ఇంకో ముద్ద ఎక్కువ తినగలుగుతున్నారట పిల్లలు. అంతే కాదు , మధ్య మధ్యలో అలా పర్యవేక్షిస్తూ ఉండటం వల్ల వండే వాళ్లకి కూడా తమ పని మీద తమకి శ్రద్ధ పెరగటంతో రుచి, శుచి రెండూ సాధ్యమయ్యాయట.ఇవన్నీ ఆయన నోటివెంట వింటూ ఉంటే లీలగా నాకు అర్ధమైనదేంటంటే ..పిల్లలు త్రుప్తిగా భోజనం చెయ్యాలి . దాంతో వాళ్ళ కడుపులు నిండాలి . ఒక్క పూట అయినా త్రుప్తిగా వాళ్ళ ఆకలి తీరాలి . ఈ పధకం ప్రవేశపెట్టటంలో ప్రభుత్వం వాళ్ళ ఉద్దేశ్యం ఏదైనా , చిత్తశుద్ధితో దాన్ని అమలు చేస్తూ ఆయన ఎంత ఆనందం అనుభవిస్తున్నారో చెప్పేటప్పుడు ఆయన కళ్ళల్లో కనిపిస్తున్న మెరుపే చెబుతుంది .

అవును . మనసు పెట్టి చేసిన ఏ   పనైనా   ఎంతో ఆనందాన్నిస్తుంది ఎవరికైనా...

నిజానికి ఈ పథకం ప్రవేశపెట్టిన దగ్గర్నుంచి అన్నీ అవకతవకలేనని టివీలూ , పేపర్లూ ఘోషిస్తూనే ఉన్నాయి . బియ్యమూ , పప్పులూ ఇళ్ళకి   చేరవేస్తున్నారనో, బ్లాక్ మార్కెట్ కి తరలిపోతున్నాయనో , ఉడికీ ఉడకనివి పిల్లలకి పెట్టేసి ఏదో అయిపోయిందన్నట్టుగా పబ్బం గడిపేస్తున్నారని..ఇలాంటివెన్నో ..

ఒకసారైతే ఇలా మధ్యాహ్నపథకంలో పెట్టిన పులిహోర టీవీ వార్తా చానల్స్ లో చూసి వాంతులొక్కటే తరువాయి . గడ్డలు గడ్డలుగా ఉన్న అన్నానికి పసుపు ఒకచోట అంటుకుని ఒకచోట అంటుకోక అక్కడక్కడా తెల్లతెల్లగా , పసుపు అన్నానికి అంటక ముద్దలు ముద్దలుగా అన్నమైతే సుద్దలు సుద్దలుగా   ..ఇక పప్పు కూర అయితే చెప్పనే అక్కర్లేదు ..ఎడ మొహం, పెడ మొహంలా పప్పుకి పప్పూ , నీళ్ళకినీళ్ళూ ..అలాంటివి తింటే రోగాలు ఎందుకురావు? ఎంత కూటికి లేని పేదవాళ్ళు అయితే మాత్రం జిహ్వకు రుచిగా లేకపోతే నోట పెట్టలేరు కదా ? ..కానీ ...

ఇక్కడ చూస్తే పరిస్థితి వేరేగా ఉంది..ఆ టీవీల్లో చూసినవన్నీ తప్పేమో అన్నట్టుగా పిల్లల కడుపు నిండితే అదే కొండంత త్రృప్తి అంటున్న ఈ పెద్ద మనిషి ..లాంటివాళ్ళు సమాజం అంతటా ఉంటే ఎంత బాగుండును ...

అదే మాట వారితో అంటే ఏమ్మాట్లాడకుండా నావైపు అలాగే చూస్తూండిపోయారుకాసేపు . అలా చూస్తూనే టేబుల్ మీదున్న బెల్ కొట్టారు."బూశమ్మని   పిల్చుకురా .." అన్నారు బెల్ కొట్టటంతోనే క్షణాల్లో వచ్చి నిల్చున్న అటెండర్ తో ..

తప్పు మాట్లాడానా? ఉన్నట్టుండి ఆయనెందుకలా మౌనంగా అయిపోయారు? నా మాటలు ఆయన్నేమీ నొప్పించలేదు కదా .." ఆలోచిస్తే నాక్కొంచెం గిల్టీగా అనిపించింది . అయినా ఇవన్నీ నాకెందుకు? ఆ బూశమ్మ   ఎవరో ? ఆమె వచ్చేలోపు నేనొచ్చిన పనేంటో   ఆయనకి చెప్పేసి , నాక్కావాల్సిన వివరాల్ని తీసేసుకుంటే త్వరగా ఇక్కడ్నుంచి వెళ్లిపోవచ్చని .."సార్ .." అంటూ ఏదో చెప్పబోతున్నంతలో స్ప్రింగ్   డోర్ తోసుకుంటూ   లోనికొచ్చింది   ఎవరో అమ్మాయి ..బహుశా బూశమ్మంటే ఈ పిల్లేనేమో ..పేరుని బట్టి ఎవరో పెద్దావిడ అనుకుంది తను .

వచ్చి రావటంలోనే చేతులు రెండూ చంకల్లో బిగించేసి భుజాలు కొంచెం పైకెత్తి కదలకుండా చేతులు కట్టుకుని నిలబడి కళ్ళార్పకుండా ఏకాగ్రతతో ఆయన వైపే చూస్తూంది . ఆ చూపుల్లో ఆయనంటే ఎంతటిభక్తిభావమో ..

నేను ఆ అమ్మాయినే గమనిస్తున్నాను . ఇందాక వరండాలో నిలబడి పిల్లల ఆటల్ని గమనిస్తున్నప్పుడు తూనీగలా చురుగ్గా అటూ ఇటూ పరుగెత్తుతున్న ఆ అమ్మాయిని ఆ కొద్దిసేపట్లోనే చాలసార్లు గమనించింది తను. ఇంతలో అకస్మాత్తుగా ..

" ఈ అమ్మాయి పేరు బూశమ్మండీ .." అన్నారు ఆయన నన్నుద్దేశించి ..

"అవునా ..!" అన్నట్టుగా తలూపాను ఆ అమ్మాయి వైపే చూస్తూ ..

" అమ్మగారికి దండం పెట్టు .." అంటూనే అలా చేసి చూపించారాయన .

ఆ అమ్మాయి వినయంగా ముందుకి వంగి మరీ నమస్కరించేసరికి ఒకలా అయిపోయాను నేను. అంతలోనే "సరే..నువ్వెళ్ళు క్లాసుకి .." అన్నట్టుగా హెడ్ మాస్టర్ గారు సైగ చేసేసరికి ఏమ్మాట్లాడకుండావెళ్ళిపోయింది.

అసలెందుకు పిలిచినట్టు ఆ అమ్మాయిని ? అంతలోనే ఎందుకు పంపించినట్టు ? క్షణంలో అనేక ప్రశ్నలు .

"ఈ అమ్మాయిని చూశారా ..? ఈ పిల్ల వినలేదు , ఏదీ అనలేదు.." మూసుకున్న స్ప్రింగ్ డోర్ వైపు చూస్తూ ఆయనన్న మాటలకి "అవునా సార్ ?" అన్నాను ..అయ్యోపాపం అన్నట్టుగా ..

నా గుండెలు బరువెక్కినట్టు నాకు తెలుస్తూనే ఉంది.. భారమైన నా హృదయాన్ని మరింత భారం చేస్తూ ..

"అవునండి ..బూశమ్మకి చెవుడు , మూగ ..ఈ రెండింటితోపాటు తల్లి లేదు . తండ్రి తాగొచ్చి కొట్టిన దెబ్బలకి ఎప్పుడో ఈ పిల్ల చిన్నప్పుడే చచ్చిపోయిందట . తండ్రి ఉన్నా లేనట్టే ..ఎక్కడో ఉంటాడు . ఎప్పుడో వస్తాడు . వచ్చిన్నాడు పిల్లని పట్టుకుని చావా చితక్కొడతాడు. వాడు కొట్టే దెబ్బలకి తట్టుకోలేక వచ్చీరాని గొంతుతో ఏడుస్తూ కీచు కీచుమని ఆ పిల్ల అరిచే అరుపులకి మా స్కూల్లో పిల్లలంతా ఆ కాసేపూ కిటికీలకంటుకుపోయేవారు . ..ఆ పిల్లనే జాలి ఆ చూస్తూ . స్కూలు గోడని అంటిపెట్టుకునే ఉండేదిలెండి వాళ్ళ పాక . మరీ స్కూలు పక్కనే కావటంతో అక్కడ జరిగేవన్నీ వద్దన్నా వినిపించేవి మా అందరికీ. ఇవన్నీ పసి పిల్లల మనసు మీద ఎలాంటి ముద్ర వేస్తాయోననే భయమే కాదు , చూస్తూ చూస్తూ ఒక పిల్ల భవిష్యత్తు నాశనమైపోతుందే అనే బాధతో ..చివరికి ఆ ఆ పిల్ల పడే బాధలు చూడలేకటీచర్స్ అంతా మాట్లాడుకుని ఎలాగైనా వాళ్ళ నాన్నని మార్చాలని చాల

ప్రయత్నం చేసాం..మా వల్ల కాలేదు . చివరికి వాళ్ళ నాన్న అందుబాటులో లేకపోవటంతో దూరపు బంధువు ఎవరో ఒకాయన ఉంటే పిలిపించి ఆయనకి విషయాన్నంతా వివరించి ఆ పిల్లని ఈ స్కూల్లో చేర్చాం ..ఈ స్కూలుకి బదిలీ అయి రాగానే నేను చేసిన మొట్టమొదటి పనిది..ఇప్పటికి బాగా నిలదొక్కుకుంది..

పాపం ..ఊగ్గుపాలప్పటి నుంచి ఈ బడి గోడల్ని , బళ్ళో పిల్లల్ని చూస్తూనే ఉందేమో చదువుకోవాలని మనసులో ఉన్నా , తాగుబోతు తండ్రితో తినటానికే వెతుకులాట. ఇక బడెక్కడ ? అలా  చొరవ చేసి ఎప్పుడైతే ఈ పిల్లని స్కూల్లో చేర్చామో ..అప్పట్నించి చదువూ ..ఆటా..పాటా ...అన్నీ ఇక్కడే . పనంటే మహా ఇష్టం .  తూర్పున వేగు చుక్క పొడిచిందంటే బడి తలుపులు తెరవాల్సిందే ..బడి మీద ఈగ వాలనివ్వదు . వంటల్లో..వేళకి కొట్టే గంటల్లో ఆటల్లో..పాటల్లో..చివరికి వాళ్ళ క్లాసులో మార్కుల్లో కూడా తనే  ముందు.

ఇప్పుడు బూశమ్మ మా అందరి జీవితాల్లో ఒక భాగం . ముఖ్యంగా ఈ నాలుగ్గోడలనబడే బడి బతుకులో బూశమ్మ బతుకు పెనవేసుకు పోయిందంటే నమ్మలేరు మీరు . మా స్కూల్లో  సుమతి అని లేడీ టీచర్ ఒకరున్నారు . ఒక్కరే ఉంటారు .ఇద్దరం ఒకేసారి ట్రాన్స్ఫర్ మీద ఇక్కడికి వచ్చాం. వారి భర్త ఎక్కడో సిటీలో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటారు..అప్పుడప్పుడూ వస్తూంటారు . రాత్రుల్లందు వారింట్లోనే పడుకుంటుంది . సుమతి మేడం వాళ్ళాయన దగ్గరకి వెళ్ళిపోవటానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు ..ఏ నిమిషంలోనైనా ఆవిడకి ట్రాన్స్ ఫర్ ఆర్డర్స్ రావచ్చు . ఆవిడా , నేనూ ఉన్నంతకాలం వరకూ అయితే బూశమ్మకి  వచ్చినఇబ్బందేం లేదు...”

కొంచెం సేపు మాట్లాడ్డం ఆపి మౌనంగా అయిపోయారు..

“ఆహా..ఇవ్వన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఇందాక మధ్యాహ్న భోజన పథకం గురించి చెబుతూ టీవీలో ఏదో చూశానన్నారుగా ..దానికి సమాధానమే ఈ బూశమ్మ . ఇందాక ఆ పిల్ల గురించి చెబుతూ వంటింట్లోనూ తనే అన్నాను కదా....మామూలుగా ప్రతి రోజూ ఇంటర్వెల్ లో వెళ్లి వంటచేసే వాళ్లకి ఏదో సాయం చేస్తూనే ఉంటుంది . వద్దని ఎంతమంది చెప్పినా వినదు . ఆ రోజు కూడా ఎప్పట్లాగే ఇంటర్వెల్లో సాయం చేస్తూంటే ఎవరో కుర్రాడు , మండలంలో ఉన్న మొత్తం స్కూళ్ళల్లో టీచర్లు ఎవరెవరూ ఎక్కడెక్కడా ఉద్యోగం చేస్తూ స్కూళ్ళకి దగ్గరలో ఉండకుండా పట్నాల్లో కాపురం ఉంటున్నారో తెలుసుకోవటానికి రైట్ టు ఇన్ఫర్మేషన్ ఏక్ట్ ప్రకారం అప్లై చేసి , వాళ్ళు సమాధానం ఇచ్చేలోపు  ఆ అధికారులు ఇచ్చే సమాచారంలో  పారదర్శకత ఎంతుందో  తెలుసుకోవటానికి ఎందుకైనా మంచిదని స్కూలు స్కూలుకి తిరుగుతూ తనూ ఎంక్వైరీ చేస్తూంటే ఈ పిల్ల ఆ కుర్రాడి కంట్లో పడింది .  ఇంకేముంది? సెల్ ఫోన్లో ఫోటోలు తీసి వాటిని తీసుకెళ్ళి టీవీ చానల్స్ వాళ్లకి ఇచ్చాడట.

ఇంకేముంది..ఒకటే గోల గోల ..పిల్లలతో పని చేయించుతున్నామని , పైగా నోరూ వాయా లేని మూగ చెవిటి పిల్లతో గొడ్డు చాకిరీ

చేయించటం నేరం, ఘోరాతిఘోరమని ఏవేవో చెప్పారు..ఒకటే చూపించారు. దాంతో ఎం ఈ వో , డి ఈ వో మా మీద దండయాత్ర ..మామూలే కదా ..మేమెంత చెప్పినా వినలేదు . నాకిష్టమై నేనే చేస్తున్నానని ఎంతగా చెప్పాలని ప్రయత్నించినా నోరు లేని ఆ అమ్మాయి మాటలు ఎవరు అర్ధం చేసుకుంటారు? అయినా ఒకసారి టీవీల్లో ప్రసారం అయిపోయాకా ఇంకెవరూ ఏమి చెప్పి ప్రయోజనం ? అప్పటికే జరగాల్సింది కాస్తా జరిగిపోయింది .

దీన్నించి బయట పడేసరికి తలప్రాణం తోక్కి వచ్చింది మాకు . ఇప్పుడు అధికారులకీ అర్ధమైందనుకోండి ..అది వేరే విషయం ..ఇదిగో ఇలా ఉంటాయి టీవీల్లో వచ్చే వార్తలు .అలా అని నిజం ఉండదని నేననటం లేదు .కానీ..విన్నారుగా ..

అక్కడికీ విద్యార్ధులెవరూ బడికి చెందిన పనుల్లో వేలు పెట్టకుండా ఏంతో జాగ్రత్తగా చూస్తూ ఉంటాం . కానీ బూశమ్మ అలా కాదు . బడంతా తానై తిరుగుతూ అన్ని పన్లూ నావే ..అంతా నా వాళ్ళే అనుకుంటుంది ..పిల్లలకి మధ్యాహ్నం భోజనాలు పెట్టేటప్పుడు కూడా ఈ బడి తన ఇల్లయినట్టూ , ఈ పిల్లలంతా తనింటికొచ్చిన అతిధులన్నట్టుగా వడ్డిస్తుంది . ఈ ఛానల్స్ వాళ్లకి ఇవ్వన్నీ తెలియవు కదా ..చెప్పినా నమ్మరు . కాబట్టి టీవీల్లో చెప్పేదీ చూసేదీ అంతా నిజం కాకపోవచ్చని ...”

అవునన్నట్టుగా తలూపాను .

ఆయన చెప్పినది వింటున్నంతసేపూ వేరే ప్రపంచంలోనికి వెళ్లిపోయినట్లు అనిపించింది నాకు . చెవిటి మూగ అమ్మాయి భూశమ్మే కళ్ళల్లో మెదులుతూ మళ్ళీ చూడాలనిపిస్తూంది.

అవునూ..మూగ, చెవుడూ రెండూ ఒక్కల్లకే ఎందుకిస్తాడో దేవుడు ? చూసింది చెప్పలేరు , .ఎవరైనా చెప్పేది వినలేరు ..అలాంటి వాళ్ళ జీవితాల్లో స్పర్శా , సైగా తప్ప శబ్దానికి తావు లేదు.

ఆలోచిస్తున్న కొద్దీ ఏదో చెప్పలేని బాధ ....తెలియని ఇబ్బంది...

కాసేపటికి ....

“ సారీ మేడం ..మీరెవరో తెలీదు . కానీ ..కొన్ని నిమిషాలు మనకి తెలియకుండానే మన మధ్య బరువుగా దొర్లి పోయాయి ..”

వాతావరణాన్ని తేలిక చేస్తూ ఆయనన్న మాటలకి అవునన్నట్టుగా తలూపుతూ నా కార్డ్ ఆయన చేతికిచ్చి" మళ్ళీ మీ స్కూలు రీ ఓపెన్ ఎప్పుడండి ?"

"జూన్ పన్నెండునండి .." అన్నారాయన కార్డ్ వైపే పరిశీలనగా చూస్తూ ..

" అదేనండి ..జూన్ లో స్కూల్స్ తెరిచే సమయానికి చల్లబడిపోయి వర్షాలు మొదలవుతాయి కదండీ

..వర్షంలో పిల్లలు ఇళ్ళ దగ్గర్నించి స్కూలికి రావాలంటే తడిచిపోతారు . వాళ్ళతో పాటు వాళ్ళ పుస్తకాలూ కూడా తడిచిపోతాయి . దాంతో జలుబులూ,దగ్గులూ ఒక్కటి కాదు సమస్య . అందుకని మా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున మీ స్కూలు విద్యార్ధులకి గొడుగులు పంచుదామని మా సంస్థ వాళ్ళం నిర్ణయించుకున్నామండి ...మీ స్కూలు స్ట్రెంగ్త్ ఎంతో చెప్తే స్కూలు తెరిచే నాటికి దానిని బట్టి సరిపడాగొడుగుల్ని ఏర్పాటు చేసుకుంటాం " అన్నాను ఆయన వంకే చూస్తూ ..

" చాల మంచి పని .." అని నన్నభినందిస్తూనే ప్యూన్ని పిలిచి లెక్కల మాస్టార్ని పిలుచుకు రమ్మనటం, ఆయన రావటం, ఆయనకి నా గురించి , నా రాక గురించి విషయం వివరించి మొత్తం ఆ స్కూల్లో ఎంతమంది విధ్యార్ధులున్నారో పేపర్ మీద వేసి నాకివ్వమని వారికి పురమాయించారు .

పావుగంట తర్వాత లెక్కల మాష్టారిచ్చిన వివరాల కాగితం తీసుకుని , దాని వెనకే వాళ్ళ ఫోన్ నంబర్లు అడిగి వ్రాసుకుని , మేము గొడుగులు తీసుకుని వచ్చేముందు రోజు ఫోన్ చేసి చెబుతానని చెప్పి స్కూలు నుంచి బయట పడ్డాను .

వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఎందుకో ఒకట్రెండు సార్లు వెనక్కెనక్కి తిరిగి చూశాను ..ఎక్కడైనా బూశమ్మకనిపిస్తుందేమోనని ..

ఏదేమైనా ఆ స్కూలికి వచ్చినప్పుడున్నంత తేలిగ్గా లేదు నా మనసు.

ఆ తర్వాత రెండు నెల్లూ మాకు గొడుగులలోనే సరిపోయింది. కొటేషన్ తీసుకోవటం, రేట్ల కాంపేరిజన్ , క్వాలిటీ ..అన్నీ బాగా పరిశీలించి నచ్చిన చోట ఆర్డరిచ్చి మొత్తం మీద వేసవి శెలవుల అనంతరం జూన్ పదమూడవ తేదీన బళ్ళు తెరిచేనాటికి సరిపడా గొడుగుల్ని సిద్ధం చేసాం .

స్కూలు తెరిచిన వెంటనే ఎందుకులే అని వారం రోజులు ఆగి ఆ తర్వాత ఒకరోజు స్కూల్లో లెక్కల మాష్టారికి ఫోన్ చేసాను …”పిల్లలకి పంచటానికి గొడుగులు తీసుకుని వస్తున్నాము ..ఏ సమయంలో వస్తేమీకు కంఫర్టబుల్ “ అని. హెడ్ మాష్టారితో మాట్లాడి మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పి అయిదు నిమిషాల్లోనే ఫోన్ చేసారాయన .

“మేడం ..రేపు సాయంత్రం నాలుగ్గంటలకి పంచుదామని చెప్పమన్నారు సారు . దాన్ని బట్టి మూడూ మూడున్నర మధ్యలో మిమ్మల్ని రమ్మన్నారు “ అంటూ ..

ఆ మర్నాడు ..

వర్షాకాలం కావటంతో ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకునుందేమో ..వాతావరణం చాల చల్లగా , ఆహ్లాదంగా ఉంది .

సుమారుగా మూడూ మూడున్నర ప్రాంతంలో నేనూ , మా సంస్థ ట్రెజరర్ జానకి , జాయింట్ సెక్రటరీ రమాదేవి ముగ్గురం గొడుగుల్ని రెండు ఆటోల్లో వేసుకుని పావు తక్కువ నాలిగింటికల్లా స్కూలికి చేరుకున్నాం .స్కూలు వదిలేసే టైమైందనో ఏమో ..పొద్దుగూకే వేళ చెట్ల మీదకి చేరి అరుస్తున్న పక్షుల కూతల్లాకలగాపులగంగా , అంతా అల్లరి అల్లరిగా , గోల గోలగా ఉంది స్కూలంతా ..అటెండర్ సాయంతో గొడుగుల పెట్టెల్ని దింపి వరండాలో పెట్టించి అతన్ని అడిగాను “ పిల్లలకి నోటీసు పంపారా ..ఈ రోజు గొడుగుల డిస్ట్రిబ్యూషన్ ఉంది బెల్లు కొట్టినా ఎవరూ వెళ్ళొద్దని ..” అని.. నోటీసు పంపించామన్నట్టుగా తలూపాడు .

అంతా సవ్యంగా జరుగుతున్నందుకు మనసులోనే “హమ్మయ్య..” అనుకుంటూ జానకిని , రమాదేవిని గొడుగుల దగ్గరుండమని చెప్పి హెడ్ మాస్టర్ని కలుద్దామని ఆయన గదిలోకి వెళ్లాను .

“నమస్కారం ..రండి మేడం ..పిల్లలకి చెప్పాము మీరొస్తారని, గొడుగులు ఇస్తారని ..”

ఆయనకి ప్రతి నమస్కారం చేస్తూనే “అవున్సార్ ..అందరికీ సరిపడా అన్ని గొడుగులూ ఒకే చోట దొరకలేదు . భయపడ్డాము అందరికీ ఒకేలాంటివి ఇవ్వగలమా లేదా అని ..చివరికి ఎలాగోలా దొరికాయనుకోండి ..” అంటున్నంతలోనే లాంగ్ బెల్ మోగింది. ఒక్కసారిగా ఒకటే అరుపులూ , కేరింతాలు

“పదండి ..” అన్నారాయన బయటికి దారితీస్తూ ..అనుసరించాను .

గొడుగుల పెట్టెల దగ్గరే నిలబడి ఉన్నారు జానకీ, రమాదేవి . హెడ్ మాస్టార్ని పరిచయం చేసాను వాళ్లిద్దరికీ. నమస్కారం చేసారాయనకు ..ప్రతి నమస్కారం చేస్తూనే గేటు వైపు చూసి గట్టిగా అరిచారాయన ..

“పిల్లలు వెళ్లిపోతున్నారు ..ఆపండి ..అరె ..ఆపు ..వెంకటేష్ నువ్వెళ్ళు ..పాపం మేడం వాళ్ళూ ఇంత శ్రమపడి వస్తే ..”అంటూ గబ గబా గేటు వైపు పరుగు తీసారాయన ..

ఆశ్చర్యంగా ..ఆయనకంటే , ప్యూను వెంకటేష్ కంటే ముందు రేసు గుర్రంలా పరుగెత్తుకెళ్ళి వెళ్ళే వాళ్లకి అడ్డం పడింది బూశమ్మ, వెళ్లిపోవద్దని , గొడుగులిస్తారని తన సైగల్తో వాళ్లకి వివరిస్తూ. అయినా ఆగటం లేదు ఎవరూ. మెల్ల మెల్లగా జారుకుంటున్నారంతా. వెళ్ళిపోయే వాళ్ళని భుజాలు పట్టుకుని మరీ వెనక్కి లాగుతుంది . అయినా బలవంతాన వదిలించుకుని మరీ వెల్లిపోతున్నారంతా ..గౌన్లూ , నిక్కర్లూ పట్టుకుని మరీ గుంజుతుంది ..ఎవరూ ఆగలేదు . పైగా అలా లాగుతున్న బూశమ్మనే నాలుగు గిల్లులు గిల్లి , వీపు మీద దబుకూ దబుకూ మంటూ నాలుగు గుద్దులేసి మరీ వెల్లిపోయారంతా .

అక్కడికీ గొడుగుల అందాలని చూసైనా వస్తారేమోనని రమాదేవి , జానకి నేనూ గొడుగుల్ని

విప్పి మరీ చూపించాం “ ఇవన్నీ మీ కోసమే ..వెళ్ళిపోకండి ..రండర్రా ..” అంటూ ..అయినా ప్రయోజనం లేకపోయింది .ఒక్కడు ..ఒక్కడంటే ఒక్కడు కూడా మిగలకుండా వె ల్లిపోయారంతా ..మా అందరికీ ఒకటే ఆశ్చర్యం ..

నా ఈ సోషల్ సర్వీసులో ఇలా ఉచితంగా ఏదైనా ఇస్తామంటే , నాకు ముందంటే నాకు ముందని ఎగబడే వాళ్ళనే చూసాను కానీ ఇలా వద్దని వెళ్ళిపోయే వాళ్ళని చూడటం ఇదే మొదటిసారి.

నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే .. ఆ గిల్లిన గిల్లుళ్ళకి , వాళ్ళు కొట్టిన దెబ్బలకి ఏడ్చుకుంటూ వచ్చింది బూశమ్మ ఎర్రగా కమిలిపోయిన చోట చేత్తో రాసుకుంటూ ..బూశమ్మని ఊరుకోబెట్టి , హెడ్ మాష్టర్ సలహా మీద వాళ్ళంతా అలా ఎందుకు వెళ్లిపోయారని అడిగారు అక్కడే ఉన్న తెలుగు టీచర్ సుమతి మేడం ఆ అమ్మాయి వైపే అయోమయంగా చూస్తూ ..

ఆ అమ్మాయి భావాలు ఆవిడకే బాగా అర్ధం అవుతాయట.

ఆవిడ అడగటమే తరువాయి ..

ఆకాశం వైపు చూపిస్తూ..గొడుగు వేసుకున్నట్టుగా తన సైగలతో ఏదో , ఏదేదో చెబుతూంది

బూశమ్మ.నాకెంతకి అర్ధం కాలేదు ..ఆ పిల్ల అంతా చెప్పటం పూర్తయ్యాకా ..

" ఎందుకు వెళ్ళిపోయారు మేడం గొడుగులు తీసుకోకుండా ?" ఉండబట్టలేక అడిగాను ఆ పిల్ల మాటల్తో స్థాణువై నిలుచుండిపోయిన తెలుగు టీచర్ని ..

" హరి ..పిడుగుల్లారా ..ఎంతగా ముదిరిపోయారర్రా మీరు ?" అన్నట్టుగా చెప్పలేక చెప్పలేక చెప్పినట్టు గా చెప్పింది..

" గొడుగులు తీసుకుంటే ..వాన కురుస్తున్నా బళ్ళోకి రావాలంట ..బడి మానేయ్యటానికుండదట . వానొచ్చి బడి మానేసానని చెప్తే ..గొడుగుందిగా అంటారట. ఒకవేళ వానొచ్చినా బళ్ళోకి రావాలనుంటే గొడుగుంటే తడుస్తూ రావటానికి కుదరదట .. తడవటమే వాల్లకిష్టమట .." వింటూనే నవ్వొచ్చింది నాకు .

నిజమే ..

"వానా వానా వల్లప్పా..వాకిలి తిరుగూ చెల్లప్పా ..తిరుగూ తిరుగూ తిమ్మప్పా ..తిరగాలేనే నరసప్పా ..తిరగాలేనే నరసప్పా ..." అని హాయిగా ఒళ్ళు మరచి స్వేచ్ఛగా వానలో తడుస్తూ తిరగటం వాళ్ళ బాల్యపు జన్మ హక్కు . .కదా.. తల తడిచిపోతున్నా ..జుట్టులోంచి నీళ్ళు దారగా కారుతూ గొంతులోకి పోతున్నా , తల పైకెత్తి కురుస్తున్న వాననిచ్చిన ఆకాశాన్ని క్రతజ్ఞతగా చూడటం ఎవరికిష్టం ఉండదు? అలా చూస్తూ చూస్తూ ముఖం మీద పడ్డ సన్నని, తియ్యని, చల్లని వాన చినుకుల్ని నాలుకతోచప్పరించటం కంటే ఏమి కావాలింక?ఇంటి చూరు మీంచి దారగా కారుతున్న వాన నీళ్ళని చేత్తో పట్టుకోవటం ,

ఒకవైపు వానలో తడుస్తూనే దూరంగా చేయి చాపి , అలా చాపిన చేతిలో పడ్డ ప్రతి చుక్కా తననెదుక్కుంటూ వచ్చిన స్వాతి చినుకులా అబ్బుర పడటం ..అలవాటుగా చూసే ఐసు ముక్కలే అయినా ఆకాశం నుంచి ఊడిపడ్డ వడగళ్ళు  అరక్షణంలో కరిగి నీరై పోతాయని తెలిసినా ..ఆ కొద్దిసేపూ వాటినలా చూడటం ఎంత అపురూపం ..ఆనందం ..  ఓరి పిడుగుల్లారా ..బట్టలు పాడవుతాయని తెలిసినా , అక్కడక్కడా గుంటల్లో నిలబడ్డ నీళ్లల్లో తపుక్కున కాలేసి  ఎగజిమ్మే నీళ్ళని చూస్తూ ఎంజాయ్ చేసే మా బాల్యం మాకే కావాలని ఎంత బాగా చెప్పారర్రా....మీరే గెలిచారర్రా...మీ బాల్యం గెలిచింది ..”

ఆలోచిస్తున్నంతలో ...ఒక సందేహం ..

“  అవునూ ..ఈ బూశమ్మ ఎందుకు వాళ్ళని ఆపాలని ప్రయత్నించింది ? అనవసరంగా ఊరికే వస్తున్న గొడుగునెందుకు పోగొట్టుకుంటారనా ? లేక తనకెంతో ఇష్టమైన హెడ్ మాస్టర్ గారు ఉండమన్నారు కదా..ఉండకుండా వెళ్లిపోతున్నారెందుకనా? వాళ్ళంతా వెళ్ళిపోకుండా ఉండి ఉంటే తనకొచ్చిన లాభమేంటి ? వాళ్ళు గిల్లుతున్నా , పిడి గుద్దులు గుద్దుతున్నా భరిస్తూనే వాళ్ళని వెళ్ళిపోకుండా ఆపాల్సినంత  అవసరం బూశమ్మకి ఏముంది ? అసలే చెప్పటానికి నోరు లేని మూగజీవి . స్కూల్లో ఇంతమంది ఉండగావెళ్ళే వాళ్ళని ఆపాలనే తాపత్రయం తనకే ఎందుకు?

ఈ మాటే సుమతి మేడంతో చెప్పి అడగమన్నాను ..ఆవిడకేగా ఆ పిల్ల సైగలు బాగా అర్థమయ్యేది .“  వాళ్ళందరూ గొడుగులు తీసుకోకుండా వెళ్ళిపోతే ..తనకొక్కదానికి గొడుగు ఇస్తారో ..ఇవ్వరోనని భయమట . తనకి  గొడుగు లేకపోతే వానలో తడుస్తూ స్కూలుకి రావాలట . అలా తడవటం వల్ల జలుబూ , జ్వరం ఏదైనా వస్తే మందులు వెయ్యటానికి వాళ్ళందరికీఉన్నట్టు తనకి అమ్మలేదట. గొడుగుంటే బడికి రాగలుగుతుందట.  బడికొస్తే కడుపు నిండుతుందట . కడుపు నిండితే ఆకలి తీరుతుందట ..”

అమ్మే కాదు ..అమ్మతో పాటే వానలో తడిచే తన బాల్యమూ తనకి లేదని చెప్పకనే  చెబుతున్న బూశమ్మ ని చూసి అనుకుంటా పైన విడిది చేసిన మబ్బులు మా బదులు మీరు వర్షించండని మా కళ్ళని ఆదేశించినట్టున్నాయ్..అక్కడున్న అందరి కళ్ళల్లో నుంచి ఒకటే వర్షం ..తడిదేరిన గుండెని ఊపిరితో అదిమిపట్టి ఒక్కడుగు ముందుకు వేసాను .

“ నాకు గొడుగు ఇస్తారో ? ఇవ్వరో ? “ అన్నట్టు సందేహంతో ఆశగా నా వైపూ , గొడుగుల వైపూ మార్చి ,మార్చి చూస్తూంది బూశమ్మ.బూశమ్మ  దగ్గరకంటా వెళ్లి తన తల మీద చెయ్యేసి ఆప్యాయంగా నిమిరాను ..అలా నిమురుతూ నిమురుతూనే తన కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ ..

“ నీకు…నీకు ..ఈ గొడుగెందుకమ్మా ..నేనే నీ గొడుగవుతా ..సరేనా ..!” అన్నాను తనకి వినిపించేంత గట్టిగా మరింత దృఢంగా

నా నిర్ణయాన్ని సమర్ధిస్తున్నట్టుగా నా వెనకే నా భుజం మీద చెయ్యేసి జానకీ , రమాదేవి.

ఇప్పుడిక తప్పదనుకున్నాయో ఏమో ..చల్లని మబ్బులు తామే కురవటం మొదలెట్టాయి ..




మనసు కలచి వేసింది. ఏదోలా ఉంది.

“ఇలాంటి కొడుకులు కూడా ఉంటారా?”

చిన్నగా అంటారేం సార్? వీడు మహా దేశముదురు!" అన్నాడు మా ఫీల్డ్ ఆఫీసర్ మురళి.

"అవునా?"

"అవును సార్! బాకీ అడుగుతామని ఫోన్ సిం మార్చేశాడు. అడ్రెస్ మార్చేశాడు. పనిచేస్తున్న కంపెని మార్చేశాడు. ఇంతకీ వాడెక్కడుంటాడో కూడా వీళ్ళకు తెలియదు. పాపం! వీళ్ళను చూడండి ఎంత హీనంగా ఉన్నారో - వాడికోసం ఎదురుచూస్తూ" హీరో హోండా ను ఒక గుడిసె ముందు ఆపుతూ చెప్పుకుపోతున్నాడు మురళి.

"ఇక్కడే సార్! వాళ్ళ అమ్మానాన్న ఉండేది." టూ వీలరుకు స్టాండ్ వేసి "సత్తెయ్య ...సత్తెయ్యా!" తలుపు తట్టాడు.

"ఎవరూ ..." అంటూ ఒక బక్క పల్చటి ఆకారం బయటికొచ్చింది దగ్గుతూ.

' మా కొత్త మేనేజర్ గారొచ్చారు సత్తెయ్యా" పరిచయం చేశాడు.

"దండాలు సార్! దండాలు. కూర్చోండి సార్!" అంటూ అక్కడే ఉన్న మంచాన్ని వాల్చాడు.

వంగిపోయిన నడుము, ఎక్కడో అతుక్కుపోయిన కడుపు, లోతుగా పీక్కుపోయిన కళ్ళు, ఎముకలు తేలిన బక్కటి శరీరం ...తెరలు తెరలుగా దగ్గు. డెబ్బై దాటిన వయసు.

నిలవడానికి కూడా శక్తి లేక తూలి పడబోయి అలానే మంచం దగ్గర నేలపైన కూలబడ్డాడు.

'ఏం తాతా! ఆరోగ్యం బాగాలేదా?"

మళ్ళీ దగ్గు ...ఆయాసం

"డాక్టర్ కు చూపించుకోలేకపోయావా?" మురళి పరామర్శ.

"దవాఖానాకు వెళ్ళాను బాబూ! ఏవో బిళ్ళలిచ్చారు. వేసుకొంటున్నా తగ్గడం లేదు." ఆయాసంతో రొప్పుతున్నాడు.

ఇంతలో - అతని భార్య -నూకాలు బయటినుంచి వచ్చింది.

"ఏంటయ్యా! గోళీలు వేసుకోలేదా? కొంత కూడా తగ్గలేదా? " అంటూ నుదుటి మీద చేయి వేసి లాలనగా అడిగింది.

"ఏసుకున్నా లేవే ... అయినా ఇది తగ్గే జబ్బు కాదే!"

"అట్టా అనబాకయ్యా! డాక్టర్ బాబు దగ్గరి కెళ్ళొచ్చాను. రేపొస్తే కొత్త మందులు రాసిస్తానన్నాడు. మేస్త్రిని రెండ్రోజుల కూలీ అడిగి తీసుకొచ్చా. రేపెల్దాం. కాస్తా ఓపిక పట్టు. !" అనునయంగా, అవేదనగా నూకాలు చెప్పుకుపోతోంది.

"ఇది రోజూ ఉండేదే కానీ ... బ్యాంక్ సార్లొచ్చారు. ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. ఏం చేద్దామే..?" రొప్పుతూ అన్నాడు.

"ఏం చేయమంటారు పెద్దసారూ! ఆ సచ్చినోడు మమ్మల్నిలా మోసం చేస్తాడనుకోలేదు. ఒక్కడే కొడుకు. ఒకడే కదా ...అని చదివించాం. హై ఇస్కూల్ తో ఆపేసి సేద్యం చేసుకో రా అంటే విన్లా! నేను చదూ కొంటానే అన్నాడు. సరే ఒకే కొడుకు కదా ... వాడి ముచ్చట ఎందుకు కాదనాలని...చదువుకొని బాగుపడని అనుకొని అప్పు సప్పు చేశాం. పట్నం చదువైపోగానే ఏదైనా ఉజ్జోగం చూసుకోరా అన్నా! కాదమ్మా! పెద్ద చదువులు చదవాలి పె ద్ద ఉద్యోగం చేయాలి అన్నాడు. ఆ జగన్నాధం మాస్టారొచ్చారు. బాగా చదువుతా ఉన్న పిల్లోని చేత మట్టి పిసికిస్తావా? మీ వాడికి బాగా చదువబ్బతావుంది. చదివించు. పైకొస్తాడు. కావాలంటే ప్రభుత్వం సహాయం చేస్తుంది. బ్యాంకులు లోన్ లిస్తాయి. ఆ తర్వాత పెద్ద ఉద్యోగం వస్తే వాడే అప్పులు తీర్చుకొంటాడు. మీరేం పరేషన్ పడొద్దు" అన్నాడు.

"సరే అన్నా. ఆయనే బ్యాంక్ లోన్ ఇప్పించాడు. ఏవేవో కాయితాల మీద ఏలుముద్రలేయించుకున్నారు. ఉన్న రెండెకరాల పొలం తాకట్టన్నారు. ఉన్న ఒకే ఒక పిల్లోడు వృద్ధిలోకి వస్తానంటే కాదనలేకపోయా. కూడబెట్టిన డబ్బులు పోయాయి . నా నగలు పోయాయి . ఇంటి జాగా కూడా అమ్మేశాం. బయట అప్పులు పెరిగాయి. ఐదేళ్ళూ కళ్ళు మూసుకుంటే... పెద్ద ఉద్యోగం వస్తుందని ఈ అప్పులన్నీ ఒక లెక్కలోది కాదని... ఏడాది తిరిగే లోపే తీరిపోద్దన్నారు.

ఐదేళ్ళయింది. ఉద్యోగం వచ్చిందన్నారు. మంచి రోజులొచ్చాయన్నారు. మా అదృష్టం పండిందన్నారు. మురిసిపోయాం. ఆర్నెళ్ళపాటూ ఏదో కొంత పంపేవాడు. ఆ తర్వాత ఏమయిందో తెలియదు వాడి జాడే లేదు. వాడి దారి వాడు చూసుకొన్నాడు.

"మాకా వయసుడిగిపోయింది . ఎప్పటికప్పుడు అప్పు చేసి పంటకు పెడితే చేతికందలా ...కళ్ళ ముందే ఎండిపోయింది . మా బతుకులూ బూడిదాయా. పూలమ్మిన చోటే కట్టెలమ్ముకోవాల్సొచ్చె. కూలి నాలి చేసుకొని కాలం తీస్తామంటే ...ఇదో ఈ ముసిలోడికి అంతు చిక్కని రోగమాయె. మేమెలా బతకాలో తెలియడం లేదు. కూటికీ గుడ్డకీ లోటు లేకుండా ఉండే. ఇప్పుడు వాటికే వనవాసమాయె. ఏం చేద్దాం?" ముక్కు చీదుకుంటూ మళ్ళీ మొదలెట్టింది.

"మొన్న చిన్న సార్ వచ్చారు. పొలాన్ని జప్తు చేస్తామన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇప్పుడూ,అప్పుడూ అని వాయిదా లేసి అబద్ధాలాడలేను. పెద్ద సారూ! దిక్కులేనోళ్ళం. దిక్కుతోచకుండా ఉంది. ఆ పొలాన్ని కూడా నా పుట్టింటోళ్ళు పసుపు కుంకుమ కింద రాసిచ్చారు. అన్నీ పోయె. కనీసం ఇదైనా నిలబెట్టుకోవాలని చూశాం. మా కష్టాలు మీకు చెప్పాం. ఇక మీరే మాకు దిక్కు." "నా రెక్కల కష్టం మీదే ఈ ముసిలోన్ని చూసుకోవాలి. మాకా వయసుడిగిపోతావుంది. పోరాడే శక్తి లేదు. మీ అప్పు తీరుస్తామని వాయిదాలు చెప్పలేను. ఎందుకంటే తీర్చే మార్గం లేదు. పొలం అమ్మాలన్నా కొనేవాళ్ళు లేరు. మీ అప్పు తీర్చలేక పోతున్నామనే మనోవేదనతోనే ఆయన మంచమెక్కాడు."

"పెద్దసారుగారు! ఆ పొలాన్ని జప్తు చేసి అమ్మేయండి. మీ బాకీ జమ చేసుకోండి. మా అయ్య పోతూ పోతూ "బిడ్డా! ఈ రెండెకరాలు నీ పేరు మీద రాశాను. చేసుకో" అనేసి కళ్ళు మూశాడు. ఈ రోజుతో ఆ ఋణం కూడా తీరిపోయింది. ఆ పొలాన్ని కూడా మీరే తీసేసుకోండి." వలవలా ఏడుస్తూ ఇంట్లోకి వెళ్ళిపోయింది నూకాలు.

బ్యాంక్ మేనేజర్ గా ఒక మొండి బాకీ వసూలుకు వెళ్ళిన నాకు పల్లెల్లోని సగటు భారతీయ మధ్య తరగతి జీవితంలోని మరో కోణాన్ని చూపించింది నూకాలు.

ఒకప్రక్క అప్పుల బెడదలు ...మరో ప్రక్క కొడుకు నిర్వాకం వాళ్ళను కృంగదీస్తోంది.

మనస్సు బరువెక్కింది. ముసల్లాళ్ళ దీన స్థితి చూసి జాలేసింది. ఇంత హీన స్థితిలో కూడా బ్యాంక్ లోన్ తీర్చలేక పోతున్నామని వాళ్ళు పడుతున్న ఆవేదన నన్ను కదిలించి వేసింది. వాళ్ళ నిజాయితీ చూసి ముచ్చటేసింది.

ఆ రెండెకరాల పొలం పై చదువు కోసం ఐదు లక్షలు; పంట అప్పు లక్ష దాకా బ్యాంక్ లోన్ ఉంది.

ఇప్పటికిప్పుడు పొలం అమ్మినా ; కొనడానికి ఎవరూ ముందుకు రారు. వచ్చినా నాలుగైదు లక్షలకు మించి పలకదు.

చిన్నప్పుడెప్పుడో చదివిన గుర్తు - సగటు భారత రైతు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనే మరణిస్తాడని - ఎంతటి నగ్న సత్యం. వీళ్ళ కోసం ఏదో చేయాలి. ముందు వాళ్ళ అబ్బాయి ఎక్కడున్నాడో తెలుసుకోవాలి.

ఇంటికి వస్తూ- జగన్నాధం మాస్టార్ని ఒకసారి కలిసి వచ్చాను.

ఆ రాత్రంతా ఏవేవో ఆలోచనలు - ఎడతెరిపి లేకుండా.

* * *

డియర్ బియార్ సొల్యూషన్స్ ఎం.డి. గారికి,

మొన్న స్వాతంత్య్ర దినోత్సవం నాడు హైదరాబాద్ వచ్చినపుడు ఏదో ప్రైవేట్ ఛానెల్ లో మీ కార్యక్రమం చూడడం జరిగింది. మీ ఉద్యోగులకు మీరిచ్చిన సందేశం చాలా బాగుంది. ఎంత బాగా చెప్పారు. " మాతృ సేవ, దేశ సేవ, ఉద్యోగ సేవ ...మాతృ మూర్తిని గౌరవించిన వాడే దేశాన్ని గౌరవిస్తాడు. దేశాన్ని గౌరవించేవాడే చేస్తున్న ఉద్యోగాన్ని గౌరవిస్తాడు. ఉద్యోగాన్ని గౌరవించడం అంటే నీతి, నిజాయితీగా విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడం. అదే నిజమైన దేశ సేవ. ఈ రోజు మీరంతా ప్రతిన పూనండి. దేశ సేవ కోసం పునరంకితమవుతామని ... ఎవరి కర్తవ్యం వారు నిష్ఠతో చేస్తామని.."

"ఏమిటీ! ఒక బ్యాంక్ మేనేజర్ నన్నిలా పొగడడమేమిటి అనుకుంటున్నారా? అక్కడకే వస్తున్నాను. ఇలాంటి మహోన్నత ఆశయాలున్న మీరు ఒక చీడ పురుగుకు ఆశ్రయ మిచ్చారని తెలియచేయడానికి విచారిస్తున్నాను. హర్నాథ్, అతని భార్య మీ కంపెనీలో సాఫ్ట్ వేర్ లు గా పనిచేస్తున్నారని విన్నాను. అతని తల్లిదండ్రులు పడుతున్న వ్యధ నన్నెంతో కలచి వేసింది. ఒక్క కొడుకే అని శక్తికి మించి అప్పులు చేసి చదివిస్తే ... ఇతను మీ కంపెనీలో చేరి, కొలీగ్ ను పెళ్ళి చేసుకొని ఎంత హాయిగా జీవిస్తున్నాడో మీకు తెలిసే ఉంటుంది. తలిదండ్రులను పూర్తిగా గాలికి వదిలేసి, తన అచూకీ కూడా వారికి తెలియకుండా ఎంత

స్వార్థంతో బ్రతుకుతున్నాడో విచారించండి.

చదువు సభ్యత నేర్పాలి. సంస్కారం నేర్పాలి. ఆదర్శం నేర్పాలి. కాని ఈ వెధవకు స్వార్థాన్ని నేర్పింది. ఎంతగా అంటే - ముసలి తల్లితండ్రులను గాలికొదిలేసేంత - కనీసం తానెక్కడున్నాడో కూడా అమ్మానాన్నలకు తెలియనంత - తన అచూకీ కూడా అందనంత ... తెలిస్తే ...పలకరిస్తే వారి భారం ; అప్పుల బాధ ఎక్కడ నెత్తిన పడుతుందో అన్నంత - కనీసం పెళ్ళి చేసుకొన్నానని చెప్పడానికి కూడా నోరు లేనంత -

కూలి నాలి చేసుకోలేక ; ఆరోగ్యం పాడై, శక్తి లేక కాలే కడుపుల్తో మూగ వేదనతో ముసలి తల్లితండ్రులు అలమటిస్తుంటే ; రెండు జీతాల్తో విందు వినోదాలతో పెళ్ళాం మత్తులో తూలిపోయేంతగా -

ఎదిగిపోయాడనుకున్నారే కానీ, కళ్ళకు కూడా కనిపించనంతగా ఇంత ఎత్తుకు ఎదిగి పోయాడని వారనుకోలేదు.

నేను స్వయంగా అతని తల్లితండ్రుల బాధ చూశాను. వారి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. వాళ్ళు వాడి కోసం చేసిన బ్యాంక్ అప్పు తీర్చడం కనీస ధర్మం. ఎందుకంటే బ్యాంక్ మనీ అంటే పబ్లిక్ మనీ. పదిమందికీ ఉపయోగపడాలి.ఆ లోన్ తో బాగుపడ్డాడు. సంపాదించుకుంటున్నాడు. ఆ అప్పును కూలీ చేసుకొనే ముసలివాళ్ళపైన తోసేయకుండా మనమేదైనా చేయలేమా అనిపించింది. అందుకే నా ఈ ప్రయత్నం. ఇందులో మీరేమైనా సహాయం చేయగలరేమో నని నా ఆశ. ఇలాంటి సేవలు కూడా దేశ సేవ లో భాగమని ధృడంగా నమ్ముతున్నాను.అభినందనలతో-

*                *                *

డియర్ బ్యాంక్ మేనేజర్ గారికి,

మీ ఈమెయిల్ ఇప్పుడే చూశాను. నన్ను కదిలించింది. నేటి యువత పెడ దారి పట్ల మీ తపన, ఆవేదన అర్థం చేసుకోగలను. వారి తల్లితండ్రుల పట్ల మీరు చూపిస్తున్న కన్సెర్న్ నన్ను కట్టిపడేసింది. మీ ప్రయత్నానికి నా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను. వారిద్దరిని వెంటనే పిల్చి తగిన కౌన్సిలింగ్ ఇమ్మని, ఇలాంటి వారికి నా కంపెనీ లో చోటు లేదని, వెంటనే తప్పును దిద్దుకోకపోతే వారిద్దరీ అక్కౌంట్స్ సెటిల్ చేసేయమని నా సెక్రటరికి ఇప్పుడే ఆదేశాలిస్తున్నాను. అంతే కాదు వారం లోగా సెటిల్ కాకపోతే విషయాన్ని నా దృష్టికి తెమ్మన్నాను. మరో వారంలో మీ సమస్య తీరిపోతుందని ఆశిస్తున్నాను.అభినందనలతో - బియార్

సొల్యూషన్స్.

*                                        *                                        *

మూడో రోజు ఉదయం పదిన్నరకల్లా - హర్నాథ్ తన భార్యతో పాటు నా కేబిన్ లో ఉన్నారు.

"కన్న తల్లిని, పుట్టిన ఊర్ని,విద్య నేర్పిన గురువుని, మంచి మిత్రున్ని, దారి చూపిన బ్యాంకుని మరిచిపోతే పుట్టగతులుండవురా దౌర్భగ్యుడా! నీవేదో గొప్పగా చదివే వాడివని, ఉద్ధరిస్తావని మీ అమ్మానాన్నలను ఒప్పించి చదివించి నందుకు వాళ్ళకు, నాకు మంచి గుణపాఠమే నేర్పావు. వాళ్ళను దిక్కుమాలిన వాల్ని చేసి, అప్పుల పాల్చేసేసి కసాయిగా ప్రవర్తించావు. సలహా ఇచ్చి ఉద్ధరించినందుకు నాకు తలవంపులు తెచ్చావు...." జగన్నాధం మాస్టార్ కోపంతో ఊగిపోతున్నాడు.

"మాస్టారూ! ఆవేశపడకండి. మీరలా శాంతంగా కూర్చొండి" కుర్చీలో కూర్చోబెట్టాను.

"అదికాదు సార్! వీడు బాగా చదివే వాడు. వాళ్ళ అమ్మానాన్నలు శక్తి లేక పదిలో ఆపేద్దామన్నప్పుడు నేనే "బ్రిల్లియంట్ స్టూడెంట్' అని అప్పు చేసైనా ; ఆస్తి అమ్మైనా చదివించమని, గొప్పోడౌతాడని చెప్పి తప్పు చేశాను. నా మాట నమ్మి వారు శక్తికి మించి కష్టాలు పడ్డారు. వీడేమో ఏరు దాటాక తెప్ప తగలెట్టాడు. పూరిలో నా పరువూ తీశాడు. నా నమ్మకాన్ని కూడా వమ్ము చేశాడు " అంటూ వాపోయాడు. "చేసేది సాఫ్ట్ వేర్ ఉద్యోగం, కాని మనసులు మాత్రం ఇంత హార్డ్ గా ఎలా మారాయో అర్థం కావడం లేదు"

"మీరు మమ్మల్ని క్షమించండి సార్! నిజంగా నేను తప్పు చేశాను. మా సార్; మీవల్ల నాకు కనువిప్పు కలిగింది. నా స్వార్థం నేను చూసుకున్నాను. మూర్ఖంగా ప్రవర్తించాను. కానీ ఇప్పుడు మారాను. ఆ రోజు మాస్టారే లేకపోతే నేనీ స్థితిలో ఉండేవాణ్ణే కాదు. మిమ్మల్నందర్నీ బాధ పెట్టాను. ఇక మీదటలా జరగదు. మీ అప్పే కాదు మా అమ్మానాన్నలు చేసిన అప్పులన్నీ తీర్చేస్తా. తాకట్టులో ఉన్న మా అమ్మ పొలం విడిపిస్తా. మా అమ్మానాన్నలను హైదరాబాద్ తీసుకెల్తా. మా నాన్నకు మంచి వైద్యం అందిస్తా. ఇక వారు మాతో బాటే ఉంటారు. మంచి కొడుకుననిపించుకుంటా. కనువిప్పు కలిగింది సార్! ఆశీర్వదించండి సార్!" హర్నాథ్ దంపతులు ఇద్దరూ మా కాళ్ళపై పడ్డారు. వాళ్ళ కళ్ళల్లో పశ్చాతాపం కన్నీళ్ళ రూపంలో సుడులు తిరుగుతున్నాయి.

"మా శాలరీల పైన లోన్ తీసుకొచ్చాం ! మా ఆవిడ నగలన్నీ అమ్మేశాం ! ఇప్పుడు ఆరు లక్షలు తెచ్చాం ! బ్యాంక్ అప్పు తీర్చేసుకోండి సార్! మా అమ్మ పొలం కాగితాలిచ్చేయండి ...ముందు ఆమె కళ్ళల్లో ఆనందం చూడాలి."

హర్నాథ్ లో వచ్చిన మార్పుకు జగన్నాధం మాష్టార్ చాలా ఆనందపడ్డారు. వంగి వంగి సార్ కు కృతజ్ఞతలు చెప్పుతుంటే వాడి లోని జంతువు చనిపోయి మనిషి మళ్ళీ పుట్టాడా అనిపించింది. ఎంత మార్పు? వారం క్రితానికి ...ఇప్పటికీ! మధ్యలో ఏదో అద్భుతం జరిగుండాలి. బియార్ సొల్యూషన్స్ వారి కౌన్సిలింగే కారణమా? యువత స్వతహాగా మంచే కావొచ్చు. కానీ దారి తప్పినప్పుడో, మళ్ళినప్పుడో అలాంటి చేదు మాత్రలు తప్పవేమో!

పొలం కాగితాలు చూస్తూ - కొడుకును అక్కున చేర్చుకొంది నూకాలు

ఆమె కళ్ళ వెంట ఆనంద బాష్పాలు రాల్తున్నాయి. పక్కనే నిలబడ్డ సత్తెయ్య మొహంలో ముసిముసి నవ్వులు విరబూస్తున్నాయి.



సాయంత్రం ఆరు దాటుతోంది. హాల్లో సోఫాలో విచారంగా ముఖం పెట్టి కూర్చున్నారు రాజశేఖర్, ఆయన భార్య శ్రీలక్ష్మి. ఇంతలో ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన వారి కూతురు శిరీష బయట స్కూటీ స్టాండ్ వేసి ఇంట్లోకి రివ్వున వచ్చింది.

వస్తూనే...

హాయ్ డాడీ...హాయ్ మాం....ఏంటి అలా డల్ గా వున్నారు..? పదండి. సరదాగా అలా బయటకు వెళ్ళి ఏదైనా హోటల్లో భోజనం చేసి వద్దాం. అంటూ హడావుడి చేస్తున్న కూతురి వైపు ఏ భావమూ లేకుండా నిర్లిప్తంగా చూశారిద్దరూ.

" ఏంటి...నా మీద కోపం పోలేదా ఇంకా.. ఇలా ఎన్ని రోజులు మౌన యుద్ధం చేస్తారు ? సరే మీ ఇష్టం.." అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది శిరీష.

రాజశేఖర్ - శ్రీలక్ష్మిల కోపానికి కారణం శిరీష పెళ్ళి.

శిరీష చదువు అయ్యి, ఉద్యోగంలో చేరిన మూడు సంవత్సరాల నుండీ పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు రాజశేఖర్ గారు. కానీ ఏ ఒక్కటీ నచ్చట్లేదు శిరీషకి.

ఒక రకంగా తప్పంతా వారిదే. వారు కూడా అదే నిశ్చయానికి వచ్చారు. ఒక్కతే కూతురని బాగా గారాబంగా పెంచారు. దానికి తోడు అసాధారణమైన సౌందర్యం , అమోఘమైన తెలివితేటలు ఆమె సొంతం.చిన్నప్పట్నుంచి తననొక మహారాణిలా చూస్తూ అపురూపంగా పెంచడంతో శిరీష తన గురించి సుపీరియారిటీ కాంప్లెక్స్ పెంచుకునేలా చేశారు.

తన అందానికీ, చదువుకీ ఎంతో గొప్పవాడు రాజకుమారుడి లాంటి వాడు వస్తాడని కలల్లో విహరిస్తూ వాస్తవాన్ని మరిచింది. అందుకే తండ్రి తీసుకొచ్చే మంచి సంబంధాలలో ఏ ఒక్కటీ ఆమెకు నచ్చటం లేదు. ఎన్ని మంచి సంబంధాలూ తెచ్చినా ఏదో ఒక లోపం చూపించి కాన్సిల్ చేస్తుంది.

పొడవుగా తెల్లగా ఉన్న వాడు వస్తే, సరైన ఉద్యోగం లేదు అంటుంది. గవర్నమెంట్ జాబ్ సంబంధం తెస్తే రంగు తక్కువ..పొడవు లేదు అంటుంది.

పోనీ అందమూ, ఐశ్వర్యమూ ఉద్యోగమూ వున్నవాడ్ని తీసుకు వస్తే బాధ్యతలెక్కువగా వున్నాయి, నావల్ల కాదు అంటుంది. అలా లెక్కలేనన్ని సంబంధాలు చూసి..చూసి విసిగి వేసారి పోయారు ఇద్దరూ.

పెళ్ళిళ్ళ బ్రోకరు చేతులెత్తేశాడు. మీ అమ్మాయికి నచ్చిన సంబంధం తేవడం నావల్ల కాదంటూ.

ప్రతీసారీ పెళ్ళిచూపుల కార్యక్రమం జరగడమూ..అందరూ నానా హడావుడీ పడడమూ ఆ తర్వాత శిరీష సింపుల్ గా నో చెప్పెయ్యడమూ మామూలైపోయింది.

నిన్ననే వచ్చిన అమెరికా సంబంధం కూడా నచ్చలేదని చెప్పింది. అబ్బాయి బాగున్నాడు. మంచి ఉద్యోగం...సాంప్రదాయమైన కుటుంబం...అన్నీ తెలుసుకుని ఇది తప్పకుండా శిరీషకు నచ్చుతుందన్న నమ్మకంతో వున్న రాజశేఖర్ దంపతులు, ఆ సంబంధం కూడా అబ్బాయి ' నవ్వు ' నచ్చలేదని వంక పెట్టి రిజెక్ట్ చేయడంతో కూతురిపై అలిగి మౌనవ్రతం పాటించారు.

పోనీ తను ఎవరినైనా ఇష్టపడితే అలా కూతురి పెళ్ళి చేద్దాం అనుకుంటే అదీ లేదు. అస్సలు తనలాంటి అద్భుతమైన అందగత్తె ఇష్టపడాలంటే తనకు నచ్చే క్వాలిటీ కాదు కదా. .కనీసం తనను కన్నెత్తి చూసే అర్హత కూడా ఆ చుట్టుపక్కల ఎవ్వరికీ లేదనేది ఆమె స్థిర అభిప్రాయం.ఎలాగైనా తమ ఒక్కగానొక్క కూతురి పెళ్ళి గ్రాండ్ గా జరిపించి తమ బాధ్యత తీర్చుకోవాలనేది వారి తాపత్రయం.

************* *************** **************

ఇదిలా వుండగా ...

మరో సంబంధం వచ్చింది .అబ్బాయి పేరు వంశీ. బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం. పెళ్ళిచూపులకు అబ్బాయి ఒక్కడే వచ్చాడు మధ్యవర్తితో. మళ్ళీ యధావిధిగా పెళ్ళిచూపుల తతంగం మొదలైంది. అబ్బాయి చాలా అందంగా వున్నాడు.

ప్రతిసారీ పెళ్ళిచూపుల్లో శిరీషను చూడగానే అబ్బాయి కళ్ళల్లో మెరుపు, ఆనందం హుషారు కనిపించటం సహజమే.

కానీ..

వంశీ కళ్ళల్లో శిరీషను చూస్తూనే ఆనందం కలగకపోగా, ముఖంలో విసుగు, నిర్లక్ష్య భావం కనిపించాయి.

ఒక పది నిముషాలు శిరీషతో పర్సనల్ గా మాట్లాడాలనీ ఆడిగిన మీదట పెద్దలు తప్పుకున్నారు అక్కడనుండి.

పది నిముషాల తర్వాత....

ముఖం సీరియస్ గా పెట్టి అందరి ముందే మధ్యవర్తితో కోపంగా అన్నాడు వంశీ. " ఏమిటండీ ఇదీ..? మీమీద నమ్మకంతో, మా కుటుంబం గురించి అంతా తెల్సినవారు కదా అని మంచి మ్యాచ్ చూడమంటే ఇలాంటి అనాకారి, చెత్త సంబంధం చూపించారు? " అని..

" ఏంటి బాబూ మీరనేది? నాకు అర్థం కాలేదు..." అన్నాడు మధ్యవర్తి.

" అసలు నేను ఫోటో చూడాలంటేనే మినిమం ఒక మోస్తరు అందంగా వుండాలి. అలాంటిది, ఫోటోలో కంటే ఇంకా అందంగా వుంటుందని మీరు నమ్మకంగా చెప్పబట్టి ఇంత దాకా వచ్చాను...కానీ... నాకు భార్యగా కాదు కదా, కనీసం నా ప్రక్కన నిలబడడానికి కూడా అర్హత లేని అమ్మాయిని చూపించారు. సరే..ఎటూ వచ్చాను కదా అని తన గురించి తెల్సుకోవచ్చని పది నిముషాలు మాట్లాడాను. అందం నేను ఆశించినంతగా లేకున్నా, కనీసం ఎదుటివారితో మర్యాదగా మాట్లాడే మేనర్స్ కూడా లేదని అర్థం అయ్యింది పది నిముషాల్లోనే. అదీకాక తన చూపులు మగవాడ్ని కట్టిపడేసేలాగా కాకుండా కాల్చుకు తినేసేలా వున్నాయి. దానికితోడు, ఈవిడగారికి వంట చెయ్యడం కూడా రాదట. ముగ్గులెయ్యడం రాదట..పూజలు కూడా చెయ్యదట...నేను ఆంధ్రాలో అయితే అందమైన, సాంప్రదాయక పద్ధతులలో వుండే అమ్మాయిలు వుంటారనుకుని భ్రమ పడ్డాను. కానీ, నాకు నచ్చిన ఏ ఒక్క క్వాలిటీ ఈ అమ్మాయిలో లేదని తేలిపోయింది. చ..చ...నా టైమంతా వేస్ట్ చేసారు... " అని విసవిసా బైటకెళ్ళిపోయాడు.

నోటమాట రానట్టు అవాక్కైపోయింది శిరీష. కన్నీళ్ళు అప్రయత్నంగా వచ్చేస్తున్నాయి ఆమె చెంపలమీదుగా...

" నన్ను...నన్ను రిజెక్ట్ చేస్తాడా .." ఆ విషయం జీర్ణించుకోలేక వారం రోజులు సిక్ అయ్యింది. లీవ్ పెట్టి ఇంట్లోనే వుండిపోయింది.రకరకాల ఆలోచనలతో గడిపింది. చివరకు తన తప్పు తెలుసుకుంది. తనను చూడడానికి వచ్చిన ఎంతోమందిని తను అలాగే అవమానించినప్పుడు వారు ఎంత హర్ట్ అయ్యి వుంటారో అనేది తనకు అనుభవమయ్యింది.

ప్రపంచంలో ఏ ఒక్కరూ మిస్టర్ పర్ ఫెక్ట్...అలాగే మిస్ పర్ ఫెక్ట్ లూ ఉండరని గ్రహించింది.

కొన్ని విషయాలలో అయినా సర్దుకు పోక పోతే ప్రపంచంలో ఏ ఒక్కరికీ పెళ్ళి అవదన్న విషయం ఆలస్యంగానైనా తెల్సుకుంది.

తండ్రితో చెప్పింది శిరీష. " డాడీ.. ఇక మీరు తెచ్చిన ఏ సంబంధమైనా నాకు ఓకే...ముందుగా మీరే అన్నీ విచారించి మంచిది, నేను సుఖపడతాను అని మీకనిపిస్తే పెళ్ళిచూపులేమీ వద్దు. సంబంధం ఖాయం చేసెయ్యండి..." అని..

అంతా గమనిస్తూ మౌనంగా వున్నారు రాజశేఖర్ దంపతులు. శిరీష చెప్పిన మాటలతో పన్నీరు కురిసినట్లయింది వాళ్ళ గుండెల్లో.ఆ తర్వాత నెలరోజుల్లో రాజశేఖర్ గారి డిపార్ట్ మెంట్లోనే క్రొత్తగా జాయిన్ అయిన ఇంజనీరు వికాస్ తో పెళ్ళి జరిగిపోయింది శిరీషకి..

******************

ఇంతకీ అసలు జరిగిందేంటంటే...

రాజశేఖర్ గారి ఆఫీసులో క్రొత్తగా జాయిన్ అయిన వికాస్ తక్కువకాలంలోనే ఆయనకు బాగా దగ్గరయ్యాడు. ఆఫీసు విషయాలలో సీనియర్ అయిన రాజశేఖర్ గారి సలహాలు, సూచనలు పాటిస్తూ ఆయనకు బాగా ఆప్తుడయ్యాడు.

కానీ, గత కొన్ని నెలల నుంచి మౌనంగా విచారంగా వుంటున్న రాజశేఖర్ గారిని కారణమడిగిన వికాస్ తో కూతురు విషయం

ప్రస్తావించి బాధపడ్డారు.

సహజంగా తెలివైనవాడు, సమయస్ఫూర్తి కలవాడు అయిన వికాస్. శిరీష ఫోటో చూసి ఆమె అందానికీ, అర్హతలకూ ముగ్దుడయ్యాడు .... " మీకు అభ్యంతరం లేకపోతే, శిరీషకు చిన్న షాక్ ట్రీట్ మెంట్ ఇచ్చి, నేను పెళ్ళి చేసుకుంటాను...అని అడిగిన మీదట... అందగాడూ.. ప్రభుత్వోద్యోగీ , మంచి మనసున్నవాడూ అల్లుడిగా వస్తే కూతురు దగ్గర్లోనే ఉంటుందన్న అభిప్రాయానికి వచ్చి, వికాస్ కి గ్రీన్ సిగ్నల్ యిచ్చేశారు, రాజశేఖర్ గారు.

ఆ తరువాత, తన ట్రీట్ మెంట్ లో భాగంగా తన ప్రాణస్నేహితుడూ, కాలేజ్ డేస్ లో డ్రామాలూ-స్కిట్ లూ అంటే ఆసక్తి చూపే వంశీతో 'ఫేక్ పెళ్ళిచూపులు ' ఏర్పాటు చేయించి పెళ్ళికొడుకు పాత్ర ఇచ్చాడు వికాస్.

ఏది ఏమైనా కూతురు మొండి పట్టుదల వదిలి ఒక ఇంటిదవడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు శిరీష తల్లిదండ్రులు. శిరీష కూడా పెళ్ళయ్యాక వికాస్ లాంటి మంచి భర్త దొరికినందుకు పొంగిపోయింది.

" పెళ్ళికి ముందు అబ్బాయైనా..అమ్మాయైనా తమ జీవిత భాగస్వామి ఇలా వుండాలి అన్న అభీష్టాలను, కోర్కెలను ఎంతవరకు సమంజసమో-సాధ్యమో, తాము ఆశించే అర్హతలకు తాము సరిజోడీ అవునో కాదో నిజాయితీగా బేరీజు వేసుకోవాలి. పెళ్ళయిన తర్వాత ఒకరి అభిప్రాయాలను ఒకరు తెల్సుకుని గౌరవించి ఎదుటివారికి నచ్చేలా తమ ప్రవర్తనను సాధ్యమైనంత వరకూ మార్చుకుంటూ జీవనం సాగించడమే ' వివాహ బంధం ' లోని పరమార్థం.




దూరం నుండి చూస్తుంటే అతనో ఎలుగుబంటిలా అనిపిస్తున్నాడు. ఆ చెట్లల్లో అతనో చెట్టులా కనిపిస్తున్నాడు. మురికిబారిన బట్టలతో పెరిగిన జుట్టూ-గడ్డంతో చిన్నప్పుడు విన్న కథల్లో ఒంటికన్ను రాక్షసునిలా అనిపిస్తున్నాడు. ఆ అడవిదారిలో ఏమి తింటున్నాడు? ఎక్కడ పడుకుంటున్నాడు? ఎలా బ్రతుకుతున్నాడు? చలికి వానకు చలించడా? ఆకలి ఉండదా? అతన్ని చూస్తున్న అందరిలో కలిగే ప్రశ్నలివే. గంటలతరబడి అతను బిగుసుకు పోయినట్టు ఆ చెట్లకింద కూర్చుని ఉంటాడు. ఉండుండి అడవిలోకి మాయమైపోతుంటాడు. మళ్ళీ ఆ చెట్లకింద చేరి అటూఇటూ తిరుగుతూంటాడు. ఒకింత భయం మరొకింత గగుర్పాటు కలుగుతున్నా ప్రతినిత్యం ఆ దారిలో అతనున్నాడో- లేడాని ఓసారి పరికించి చూసి ఉంటే హమ్మయ్య ఉన్నాడు అనుకోవడం, కనపడకపోతే అయ్యోపాపం ఎక్కడికెళ్ళాడో ఏమో..ఏమైనా అయిపోలేదు కదా అని అనుమానపడడం ఆ దారంట వెళ్ళేవాళ్ళకి మామూలైపోయింది.

తన గురించి జనం ఏమనుకుంటున్నారో అతనికి పట్టదు. తన ప్రక్కనుండి ఎవరు వెళ్తున్నారో ఏమంటున్నారో ఎందుకు నవ్వుకుంటున్నారో ఎందుకు జాలి పడుతున్నారో ఎందుకు బాధపడుతున్నారో అతనికి అక్కరలేదు. ఒక్కోసారి సన్నగా ఏదో గొనుక్కుంటుంటాడు..ఒక్కోసారి గుండెలు పగిలేలా రోదిస్తాడు. ఒక్కోసారి గొంతు చించుకుని రంకెలు వేస్తాడు. దూరం నుండి ఎవరన్నా ఓ రొట్టెముక్కో, పండో-ఫలమో విసురుతుంటారు. అతను తింటాడో లేదో కూడా తెలియదు. ఎలా తింటాడు? ఓ పక్కంతా చెంప కాలిపోయి పళ్ళూ - చిగుళ్ళూ భయంకరంగా కనిపిస్తూంటాయి. ఏదైనా తినబోతూంటే ఓ పక్కనుండి జారిపోతుంటుంది. ఏదైనా మాట్లాడబోతే పదాలు తొస్సిపోయినట్టు వింతగా ధ్వనిస్తాయి. అసలు ఆకలి చచ్చిపోయినట్టు.. తిండిమీద ధ్యాసే లేనట్టు ఉంటాడు. ఇక కనుగుడ్డు బయటకు పొడుచుకు వచ్చి మెడంతా వళ్ళంతా కాలిపోయిన మచ్చలతో

భీతిగొల్పుతుంటాడు .ఎవరు అతని దగ్గరకు వెళ్ళడానికి సాహసించరు. ఓ మౌనిలా మౌనంగా..ఓ యోగిలా నిర్వేదంగా అలా గంటలకొద్దీ ఏకాంతంగా కూర్చుని ఉంటాడు.

*********** ******************** *******************

" కేస్లా....ఒరే కేస్లా! " ఏదో ఆత్మీయమైన పిలుపు. అతని మౌనాన్ని భగ్నం చేస్తూ ఓ పిలుపు. అతన్ని మనిషిగా గుర్తిస్తూ.. ఓ పలకరింపు. కేస్లాకు దు;ఖం ముంచుకొస్తున్నది. ఎందరెందరో అదే దారినుండి నడిచి వెళ్తూ భయం భయంగా తొలగిపోతూంటారే....! ఎవరు తనను ఇంత ఆర్తిగా పిలుస్తున్నది?

మళ్ళీ అదే పిలుపు..." కేస్లా..ఒరే కేస్లా! ఆగరా..ఆగు..." అది ఓ స్త్రీ స్వరం.. ఎవరో బాగా తెలిసిన వాళ్ళే పిలిచినట్లు... ఎవరో తనని .మ్మంటున్నట్లు అనిపిస్తున్నది. దూర తీరాలలో ఆ పిలుపు ఎవరిదో.. ఊహూ వద్దు... ఇంకా ఈ మనుష్యులతో బంధాలు వద్దు వద్దు.. ఆ పిలుపు అందనంత దూరం పరుగుపెట్టడం మొదలుపెట్టడం మొదలుపెట్టాడు. పరుగు..పరుగు.... ఆ పిలుపు అతన్ని వెంటాడుతూనే ఉంది." కేస్లా ఆగు అలా ఉరకకు...నా మాట విను.. ఒక్కసారి ఆగు ..." అది పిలుపులా లేదు.. ఏదో పాటలా ఉంది. అవును అది చిన్ననాడు అందరూ ఆమె చుట్టు చేరి అడిగడిగి పాడించుకున్న పాటల స్వరం. తమ కర్తవ్యాలను గుర్తు చేస్తూ మందలించిన భాస్వర స్వరం. తమను అప్రమత్తం చేస్తూ తమ పనులకు సమాయుత్త పరిచిన కంచు స్వరం. తమను కొత్తలోకం చూపుతూ కార్యోన్ముఖులను చేసిన బంగరు స్వరం.

మరపుపొరలు విడిపోతున్నాయి. ఆ పిలుపును తన ఆత్మబంధువు స్వరానికి జత చేస్తున్నాయి. అవును..మాల్యా...అది మాల్యక్క గొంతు. కేస్లా మరింత వేగంగా, ఆమె తనను చేరుకోలేనంత దూరం పరుగెత్తి పరుగెత్తి వగరుస్తూ ఓ దగ్గర మోకాళ్ళ మీద కూలబడిపోయాడు. "వద్దక్కా...! నువ్వు నా దగ్గరకు రావద్దు. నాకు మళ్ళీ ఈ మనుష్యులతో సంబంధాలు వద్దు. నన్ను చంపేసిన ఆ తండాలు వద్దు. నన్ను బతుకనివ్వని ఈ ఊర్లూ వద్దు. అసలు నాకు బతకాలని లేదు. మళ్ళీ నన్ను పిలవకు. మళ్ళీ నీ దరి చేరనివ్వకు. జీవితమంటే ఆశలు రేపకు..." మోకాళ్ళలో ముఖాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు కేస్లా.

ఆ దు;ఖం వరద నీరై పొంగగా పొగిలిపొగిలి ఏడుస్తున్నాడు. ఇన్నాళ్ళు మూగ వేదన కరిగిపోయేలా పసి పిల్లాడిలా స్వేచ్ఛగా బిగ్గరగా ఏడుస్తున్నాడు. తడబడుతున్న అడుగులతో తూలుతూ పిచ్చివాడిలా ఏడుస్తున్నాడు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి ఎప్పటికో తేరుకుని నీటి చెలమను చేరుకున్నాడు. ఎప్పటిలా తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. ఎప్పటిలా ...ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు...ఎప్పటిలా..మరల మరలా కుమిలిపోతూ ముఖం కడుక్కున్నాడు. దోసిళ్ళతో నీరు తాగి..ఓ రాతిమీద కూర్చున్నాడు. నీటిలో అతని ప్రతిబింబం అలలతో బాటుగా భయంకరంగా కదులుతున్నది.

*****************

అప్పుడే బస్సు దిగిన కేస్లానాయక్ తన వారిని చేరుకోబోతున్న ఆనందంతో వడివడిగా తండా వైపుకు రాసాగాడు. తండాలోని తన ప్రియమిత్రులతో ఆడే పులిమేకొ, చెడుగుడులు, కుస్తీలూ..కోలాటాలూ...కోడిపందాలూ, వ్యవసాయ పనుల్లో పాడుకొనే పాటలు, విసురుకునే చలోక్తులూ, వాగుల్లో ఈదుకుంటూ ఒకరిపై ఒకరు నీళ్ళు చిమ్ముకుంటూ ఒకరిని ఒకరు ముంచుకుంటూ ఆడే ఆటలు, వేగంగా నడవడంలో కొండలెక్కడంలో పెట్టుకునే పందాలు, ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలన్నా పని ఒక్కరిదైతే వారితో నడకలు, ఉరుకులు పరుగులు అల్లరి కేరింతలు అందరివి. తండాలోని మిత్రబృందమంతా కలిసి తమ కబుర్లతో నడకలతో అడవికి సందడి తెచ్చేవారు. చిరపరిచితమైన ఆ వని పరిసరాలను కన్నుల నింపుకుంటూ ఉల్లాసంగా నడక సాగించాడు.

అల్లంత దూరం నుండే కేస్లా రాకని గమనించిన పరివారమంతా ఎదురొచ్చి ఆప్యాయంగా పలుకరించసాగారు. తండా నుండి ఒకడు ఇంజనీర్ చదువుతున్నాడంటే వాళ్ళకెంత సంబరమో..తండ్రి సూక్యా కొడుకును మురిపెంగా కళ్ళనిండా చూసుకున్నాడు. తల్లి నాజ్కి కొడుకును అల్లుకుపోయి వళ్ళంతా తడుముతూ పెద్దగా రోదించింది. బంధువులంతా గొంతు కలిపారు. చాన్నాళ్ళకు తమ వారిని కలుసుకోగానే రోదనతో ఆనందం వ్యక్తం చేయడం అక్కడ సాధారణమే. కానీ తన బంధువుల రోదనలో ఏదో తేడా తెలుస్తున్నది. ఆ రోదనలో తీవ్ర వేదన కనబడుతున్నది. తనను అల్లంత దూరాన చూడగానే పరుగులు పెట్టుకొచ్చే మిత్ర బృందం చాలామంది కనబడనేలేదు. అతని అనుమానం నిజం చేస్తూ...

" నీ దోస్తులను ఠాణాలబెట్టిన్రు కొడుకో..ఆళ్ళు ఏమి జెయ్యకుండనే తీస్కపోయిండ్రు కొడుకో..! ఆడ నా కొడుకును మస్తు కొడుతాండ్రంట కొడుకో..." అంటూ పార్వతి..లచ్చిమి ఏడవసాగారు. కేస్లా కుంగిపోయాడు.

" ఏమిటిది? ,అళ్ళి తీసుకెళ్ళారా? ఇట్లా ఎప్పుడుపడితే అపుడు తమవాళ్ళను తీసుకెళ్ళడం, ' వాళ్ళ ' ఆచూకీ చెప్పమని తన్నడం ఇలా ఎన్నిసార్లో...! తన మిత్రులను ఎంత దారుణంగా కొడుతున్నారో అని తలచుకోగానే పట్టరాని దు;ఖం కలిగింది వాళ్ళను ఎలా ఓదార్చాలో తెలియక సతమతమయ్యాడు. పరుగున తాత వాలి దగ్గరకు వెళ్ళి వాలాడు. " ఇప్పుడెట్లా తాతా...? కలవరంగా అన్నాడు." ఎట్ల ఏమున్నదిరా ఎవ్వళ్ళనో ఒకళ్ళను పట్టుకోవాలెగదా మరి. కడుపు తిప్పలుకు జవాన్లు వాళ్ళ బాధలు వాళ్ళు బడుతున్నరు. అయిన గాని అసల్కి మనోళ్ళకు మాత్రం ఏందెలుసని చెప్తరు బిడ్డా! తూరుపుదిక్కున సుక్క బడుస్తదని తెలుసుగానీ ఎవ్వళ్ళకన్న దానిపట్ట వశమా..! మెరుపుతీరు అస్తరు.. వెలుగుతీరు సాయంజేస్తరు. నీడతీరు దొర్కకుంటబోతరు. ఏడుంటరంటే ఏం జెప్పేము? ఆళ్ళనుబట్టుకోను ఎవ్వళ్ళతోని గాదని వీళ్ళకు గూడా ఎర్పాటే. పట్టుకునంట్టుట్టు శకలు జెయ్యాలెగదా," నవ్వాడు వాలి. విస్మయంగా చూసాడు వాళ్ళంటే ఎంత ప్రేమ, నమ్మకం...

" అదంతేమో గానీ తాతా...! నడుమ మనోళ్ళు బలైపోతున్నరు. ఫారెస్టోల్లకు, పోలీసోల్లకు, మనం ఇట్లా వుపయోగపడుతున్నం

కదా!" అనుకుంటూ తూరుపు కొండలవైపు అడుగులు వేయసాగాడు. ఆ తూరుపు కొండలను చూస్తుంటే చాలు కేస్లాలో ఏదో ఉత్తేజం కలుగుతుంది. ఎవరో అక్కడ సంచరిస్తున్నట్టుంటుంది. కానీ ఎప్పుడూ ఎవరూ కంటపడరు. ఏదో అలికిడి తెలుస్తుంటుంది . కాని స్పష్టమవ్వదు. ఆ ఉనికికే ఏదో ప్రేరణ కలుగుతుంటుంది. అపుడపుడు అకస్మాత్తుగా తమవారు వండిపెట్టే అన్నం, కూరలు ఎక్కడికి వెళ్తాయో తెలియదు. ఒక్కోసారి అర్ధరాత్రులు తమ గుడిసెలో తమ పక్కనే పడుకున్నట్లనిపించే. ఆ మామా, అత్తా, కాకా, చిన్ని..ఎవరన్నది తనకు చిన్ననాటినుండీ తెలియదు. మర్నాడు ఎవరిని ఎంత తరచి అడిగినా గంబీర మౌనమే తప్ప జవాబు దొరికేది కాదు. వాళ్ళు ఎప్పుడు ఎక్కడ పంచాయితీ పెట్టి తీర్పు చెప్తారో గాని, ఆ తీర్పు వాళ్ళందరికీ శిరోధార్యం. ఎవరైనా ఏదైనా కానిపని చేయబోయారో, తమనెవరో కనిపెడుతున్నట్టు టక్కున ఆపేస్తారు. మామూలప్పుడు చలోక్తులతో, పాటలతో చెలరేగిపోయే వాళ్ళంతా వాళ్ళ ప్రస్తావన వచ్చేసరికి మౌనంగా..గంబీరంగా మారిపోతుంటారు. ఆ మౌనంలో ఓ భక్తి, ఓ భయం నియమం ఉంటాయి.అపుడపుడు కొన్నాళ్ళు తమతో ఉనంట్టే ఉండి కొన్నాళ్ళకు కనిపించకుండా పోయే వాళ్ళ మాటలు వాళ్ళు పాడే పాటలు ఎంత ఉత్తేజకరంగా ఉంటాయి. వాళ్ళు వెళ్ళిపోయినా కేస్లాకు ఇతర పిల్లలకు దస్రూ కాక బిడ్డ మాల్యక్క ఆ పాటలన్నీ పట్టేసి పాడి వినిపించేది. రమేశ్, లాలూ, వాళ్ళు చెప్పే మాటలన్నీ మంత్రాల్లా వప్పజెప్పేవారు. కొన్నేళ్ళకు మాల్యక్క కనబడకుండా పోయినప్పుడు, తల్లడిల్లిపోయి కేస్లా చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. కాని మాల్యక్కా వాళ్ళ అమ్మానన్న మాత్రం ఓ నిట్టుర్పు విడిచి ఊరుకున్నారెందుకో అర్ధమయ్యేది కాదు. ఇపుడెందుకో ఆ తూరుపు కొండలు చూస్తుంటే దు;ఖం కలుగుతున్నది. పోలిసులు అరెస్టు చేసిన తనవాళ్ళు ఎలా వస్తారో అర్ధం కావడం లేదు. దు;ఖసాగరంలో మునిగిన తనవాళ్ళను ఏ రకంగానూ ఓదార్చలేక బాధపడ్డాడు కేస్లా.

రెండురోజులు గడిచాయి. మిత్రుడు తిరిగి రాలేదు. కేస్లా మనసేదో కీడు శంకిస్తున్నది. ఇంకా ఠాణా నుండి తన నేస్తాలు తిరిగి రాలేదు. ఇపుడేకాదు. అలా పోలిసులు తమవాళ్ళను తీసుకువెళ్ళిన ప్రతిసారీ ఏనాడూ వాళ్ళు క్షేమంగా తిరిగి రాలేదు. వళ్ళంతా గాయాలతో జీవచ్చవాల్లా వచ్చేవారు. వాళ్ళు కోలుకోవడానికి కొన్ని నెలలు పడుతుంది. మమ్ముల్నెందుకు తీసుకెళ్తున్నారు? అని అడిగే ధైర్యం ఎవరికీ లేదు. కేస్లా అనుమానం నిజం చేస్తూ అర్ధరాత్రి ట్రాక్టర్ వచ్చింది. అందులో వళ్ళంతా గాయాలతో కిషన్ లాల్. బిక్కూనాయకే మాత్రమే వచ్చారు. కేస్లాను వాటేసుకుని గాయపడ్డ ప్రాణమిత్రులు దీరులాల్..రాం నాయక్ దీనంగా రోదించారు. హర్యా ఎందుకు రాలేదు? అని అడగగానే ఏమో..రేపెల్లుండి ఇడిసి పెడతమన్నరు....అన్నారు. అందరూ గాయపడి మూలుగుతున్న కిషన్ లాల్ ను బిక్కూనాయక్ ను చూస్తూ ఏడుస్తున్నారు. హర్యాని మరి ప్రాణాలతో చూస్తామాని కేస్లా..హర్యాలాల్ తల్లిదండ్రుల గుండెలు తల్లడిల్లిపోతున్నయి. మూడురోజులు గడిచాకా పిడుగులాంటి వార్త తండాను చేరింది. లాకప్ లో ఉన్న హర్యా ఆత్మహత్య చేసుకున్నాడని. కోక్యా తండా శోక సముద్రంలో మునిగిపోయింది. కేస్లా తీవ్రంగా చలించిపోయాడు. హర్యా ఆత్మహత్య చేసుకోలేదని, చంపబడ్డాడని చాలా మందికి తెలిసి ఏమీ చేయలేని నిస్సహాయత... హర్యాను తలుచుకుని నిస్సహాయంగా ఏడ్చుకున్నారు.

*****************

హర్యా మరణం కొందరు నాయకులకు శవ రాజకీయాలు నడపడానికి బాగా పనికి వచ్చింది. ఇరవై నాలుగ్గంటల చానెళ్ళకు

ముఖ్య వార్త అయి రోజును నింపింది. విద్యార్థులు తరగతులు బహిష్కరించి ర్యాలీలు తీసి రెండు బస్సులు తగలబెట్టడానికి పది షాపులు ధ్వంసం చేయడానికి కారణం అయ్యింది. వార్త పత్రికలకు మర్నాటికి పతాక శీర్షికలు, కాసిన్ని వార్తలు దొరికాయి. హర్యా తల్లిదండ్రుకు మాత్రం పుత్రశోకం తండాకు పుట్టెడు శోకం మిగిలింది. పదిహేను రోజుల తర్వాత ధన్ బాద్ చేరుకున్న కేస్లా హాస్టల్ లో ఉన్న స్నేహితులతో తన బాధను పంచుకున్నాడు. యునాని మెడిసన్ చదువుతున్న మిత్రులు రాఘవా ఈశ్వర్ లతోబాటు సామాజిక శాస్త్రంలో రీసెర్చ్ చేస్తున్న వినయ్ నరేంద్ర అప్పటికే రెండు మూడుసార్లు కేస్లాతో..కోక్యా తండాకు వచ్చారు.వారు మరింత ఆసక్తిగా వింటున్నారు.

కాలం ఎంతటి గాయాన్నైనా మాంపుతుందంటారు. మా తండా వారి ఆకలిని శ్రమను, బాధలను మరిపించే ఆయుధాలు వారి చెంతే ఉన్నాయి. కూడుంటే కూరుండదు..కూరుంటే కూడుండదుగానీ, చేల దారుల్లో అప్పుడే తీసిన తాటికల్లు ప్రత్యేకంగా తయారుచేసే ఇప్పకల్లు..బంగు...సాయంత్రమయ్యేసరికి పాకెట్లలో దొరికే నాటుసారా..వాళ్ళ కడుపులు నింపుతున్నాయి. కొంపలను కూలుస్తున్నాయి. వైద్యం దొరకక చేసుకునే నాటు వైద్యం వికటించి ప్రాణాలమీదకు తెచ్చుకున్న సందర్భాలెన్నో. ఈ విషయాలన్నీ కేస్లా వివరించి చెబుతుంటే మిత్రులంతా ఆశ్చర్యపోయారు. కేస్లా అలా గంటలకొద్దీ తమతండా గురించి చెబుతుండడం చెవులు రిక్కించి వాళ్ళు ఆసక్తిగా వినడం మామూలే.      అందులో తీజ్ పండుగ ముచ్చట్లు కూడా ఉన్నాయి.

తీజ్ పండుగ నాడు మా ఆడపడుచుల సందడి చూడడానికి రెండుకళ్ళు చాలవు. గౌరీ పూజ చేసి వేసిన గోధుమ నారు బుట్టలను పెట్టుకుని సాయంత్రం వేళల పాటలు పాడుతూ బతుకమ్మలాడుతారు. చివరి రోజున గణ్ గౌరి ప్రతిమలు చేసి నైవేద్యం పెట్టిన పరవాణ్ణం కుండలు దాచి అమ్మాయిలను ఏడిపిస్తూంటాం. ఆరోజు మా కుర్రకారంతా ఓ చోట చేరి సందడే సందడి. అమ్మాయిలు ఇవ్వమంటూ గారాలు పోతూ అడుగుతారు.ఆరోజు నేనూ అలాగే సువాలిని ఏడిపించాను. తనకు దొరకకుండా పరుగులు పెట్టించాను. సువాలి నన్ను అందుకోవడానికని నావెనక గంతులేస్తూ వచ్చింది.

" ఇస్తే ఏమి ఇస్తావు..? అని అడిగాను. " ఏమి కావాలి...? అని అడిగింది. " నన్ను పెళ్ళాడతావా?" అని అడిగాను నేను."ఇంత చదువు చదివిన నువ్వు నన్ను ఎక్కడ పెళ్ళాడనంటావోనని భయపడ్డాను. నువ్వే నన్ను చేసుకుంటానంటే వద్దంటానా" అంటూ సంబరపడిపోయింది. ఆ ఆటలు, ఆ సంబరాలు అలా జరుగుతూనె ఉన్నాయి...ఆ రాత్రే ..నా ప్రాణమిత్రులలో ఇద్దరు తుపాకీలకు బలైపోయారు. కనురెప్పే కాటేస్తుందా...! నిజంగానే నా మిత్రులు ఇంఫార్ మర్లా...! కేవలం అనుమానమేనా? అసలు ఎవరిని నమ్మాలి..? ఏం చెయ్యాలి..? నాతో కలిసి నడకలు నడిచి ఉరుకులు పరుగులు పెట్టి, నాతోపాటు ఆడి పాడిన మిత్రులు నిర్జీవంగా పడి ఉన్నారు. మా తండా జనం భయం గుప్పిట్లో నలిగిపోతున్నారు. వీళ్ళకే కాదు, ఇటు పోలీసులకు భయపడాలి, అటు ఫారెస్ట్ వారికి భయపడాలి. రాజకీయనాయకులకు భయపడాలి. చెప్పలేని దు;ఖంతో కుంగిపోయాను.."

" నన్ను మరింత కదిలించే మరో సమస్య చేసిన కష్టం మరచిపోవడానికో, అసలు కష్టాలే మరచిపోవడానికో సాయంత్రం అయ్యేసరికి మా తండా వాసులంతా కష్టానికి సుఖానికి అలసటకు తాటికల్లునో ఇప్పసారానో ఆశ్రయించడం. ఈతిబాధలతో వాళ్ళల్లో వాళ్ళే

కలహించుకోవడం. "    ఒక నిముషం ఆగి మళ్ళీ మొదలుపెట్టాడు.

" నా తండాలో జీవితమంటే నాకే విరక్తి కలుగుతున్న సమయంలో    మీరు వస్తామంటున్నారు. సంతోషం..కాని ముందే చెబుతున్నా... మా వాళ్ళు కొత్తవారిని ఎవరినీ త్వరగా నమ్మరు. గతంలో మీరు వచ్చారంటే ఏదో నాలుగు రోజులు ఉండి వెళ్ళే అతిథులుగా ఆదరించారు. ఇపుడు మీరు ఔషధ మొక్కలపై పరిశోధనలు చేస్తున్న విషయం వాళ్ళకు చెప్పినా అర్థం కాదు. వాళ్ళను తాగుడు మానిపించడానికి మీరు చేసే ప్రయత్నాలు బెడిసికొడితే బాధపడకండి..." తన తండాకి మిత్రులంతా బయలుదేరేముందే చెప్పాడు కేస్లా. అన్నిటికీ సిద్ధమై వారు అక్కడే నెలవు ఏర్పాటు చేసుకుని ఉండి వారి కార్యకలాపాలు మొదలెట్టారు.

అనుకున్నట్టుగానే కొద్దిరోజుల్లోనే తండావారిలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. వాళ్ళను పంపెయ్యమంటూ. కేస్లాకు అన్నివైపులనుండీ వత్తిళ్ళు వచ్చాయి. కేస్లా మిత్రబృందం వినిపించుకోలేదు. తాగుడు మానిపించేందుకు కౌన్సిలింగ్ లు నిర్వహిస్తూ..మందులు ఇవ్వసాగారు. దాంతో తండాలో సారా వ్యాపారం చేసే లింగానాయక్.. రాజు నాయక్ లకు వీళ్ళను ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు. అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఉపాయాలు పన్నారు.

ఆ రోజు లింగానాయక్ కు పూనకం వచ్చింది. తండాను నాశనం చేయడానికి ఎక్కడెక్కడివాళ్ళనో    కేస్లా చేరదీస్తున్నాడని వాళ్ళంతా మంత్రాలు నేర్చుకుని చేతబళ్ళు చేస్తున్నారని..కేస్లాను అతని మిత్రులను ఊరినుండి తరిమి కొట్టాలని అమ్మతల్లి చెప్పింది. తండావారంతా అమ్మతల్లికి కల్లుతాపి శాంతింపజేసారు. కేస్లా తీవ్రంగా ఎదురుతిరిగాడు. తన మిత్రులకు ఏ మంత్రాలు రావని, ఇపుడిపుడే దారిన పడుతున్న మనవారిని బాగుపడనిద్దామని నచ్చజెప్పాడు. ఊరువారు మెత్తబడ్డారు. అంతే... ఆకస్మాత్తుగా    పచ్చని చెట్టు ఎండిపోయింది. రాత్రికి రాత్రే కొన్ని పశువులు చనిపోయాయి. కొందరికి పూనకాలొచ్చాయి. ఊరంతా ఏకమై అమ్మతల్లికి మళ్ళీ కోపం వచ్చిందని. కేస్లా అతని మిత్రులు ఊరొదిలి పోవాలని మరోమారు తీర్మానించారు. మిత్రులంతా తీవ్రమైన వేదనలో వెనుదిరిగారు.

కానీ, నా ప్రాణం పోయినా తండా వదలి పోనన్నాడు కేస్లా. దీరు అతనికి అండగా నిలిచాడు.ఆ సాయంత్రం మరికొన్ని పశువులు అకస్మాత్తుగా చచ్చిపోయాయి. కొందరు వాంతులు చేసుకున్నారు. లింగాకు అతని అనుచరుడు భీముకు మళ్ళీ పూనకం వచ్చింది. .." కేస్లాను పంపెయ్యండి.. లేకపోతే తండాలో ఒక్కరూ మిగలరు.." అమ్మతల్లి అరిచింది. అందరూ చేరి కేస్లాను, దీరును తండా వదిలి వెళ్ళిపొమ్మన్నారు. మిత్రులిద్దరూ తండాను వదిలిపోయేదే లేదన్నారు. లింగా ఏమి చెప్పాడో జనం ఎందుకంత రెచ్చిపోయారో కేస్లాను పంపడానికి కాదు, ఏకంగా చంపెయ్యడానికే జనం సిద్ధమైపోయారు. ఆ అర్ధరాత్రి తండా జనం తరిమితరిమి కొడుతూ కేస్లాపై, పెట్రోల్ చల్లారు.. అడ్డు వచ్చిన దీరూనూ వదలలేదు." చంపండ్రా ఇద్దర్నీ చంపండి..." జనం వారి వెంట పరుగులు తీస్తూ అరుస్తున్నారు. కేస్లా దీరూ..|

వద్దూ..మమ్మల్ని చంపకండి..." దీనంగా అరుస్తూ ..చావుకేకలు పెడుతున్నారు..కాసేపటికి దీరూ కేకలు ఆగిపోయాయి.

**********

కేస్లా ఇప్పుడు మాల్యా ఇంట్లో..ఆమె వడిలో తలపెట్టి పొగిలిపొగిలి ఏడుస్తున్నాడు. ఏదుస్తున్నాడు."దీరులాల్ బతికి ఉంటే ఎంత బాగుండేదక్కా...కాల్చేసారు... మనవాళ్ళను మారచాలనుకున్నామేగాని మంత్రాలు నేర్చి రాలేదు. అసలక్కడె పుట్టి పెరిగామే... అంత నిర్దాక్షిణ్యంగా ఎలా ప్రవర్తించగలుగుతారక్కా? " దీనంగా ఏడుస్తూ ప్రాధేయపడ్డా వినకుండా వెంటపడి మరీ పెట్రోల్ చల్లి మా ఇద్దర్నీ తగులబెట్టారు. నా కళ్ళముందే వాడు చావుకేకలు పెడుతూ కాలిపోయాడు. వాడిమీద పడ్డంత పెట్రోల్ నామీద పడలేదేమో. కాలుతున్న బట్టలతో..గాయాలతో నేను అడవిలోకి పరుగులు పెట్టి పారిపోయాను. ఆ పొగలో నేను పారిపోయిన సంగతి కూడా గమనించలేదు వాళ్ళు. లేకుంటే మళ్ళీ వచ్చి పూర్తిగా తగులబెట్టేవారేమో. ఎవరో రక్షించి లారీలో చాలాదూరం తీసుకెళ్ళి దవాఖానాలో చేర్పించారు. రెండు నెలలున్నానక్కడ. చచ్చిపోయినా బాగుండేదక్కా....నరకం చూసాను...

ఆ గాయాల బాధ ఓర్వలేక ఎంత ఏడ్చేవాడినో....! ఎవరికోసం బతకాలి? నన్ను చంపెయ్యండంటూ వెర్రిగా ఏడ్చాను..." వింటున్న కేస్లా స్నేహితులు కదలిపోయారు. మాల్యా చెంపలపై నీరు జారింది." త్వరలో నన్ను పంపేస్తున్నామని దవాఖానాలో చెప్పారు. త్వరగా వెళ్ళి అమ్మను నాన్నను చూడాలని కోరిక. సువాలిని చూడాలన్న ఆత్రం. రెండు నెలల తర్వాత దవాఖానా నుండి బయటకు వచ్చిన నన్ను చూసి అందరూ దడుచుకుని తొలగిపోతున్నారు. జనమెందుకలా పారిపోతున్నారో తెలియలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఎటు వెళ్ళాలో దారి తెలియదు. భాష తెలియని మనుష్యుల మధ్య ఇబ్బంది పడడం కాదు. మాట్లాడటానికి అసలు నా మాటే అర్థం కాని గందరగోళం. ఒక ప్రక్క కాలిపోయిన చెంపతో నీరు త్రాగడానికి తిండి తినడానికి విపరీతంగా అవస్థపడేవాడిని. తినడానికి తిండిలేక, ఆకలి తీరక వెర్రికేకలు వేసేవాఆదీణీ... అన్నం పెట్టి ఆదరించడానికి ఎవరున్నారు నాకిక? కొన్నాళ్ళకు ఈ పస్తులు అలవాటైనాయిగాని కానీ, ఎక్కడ, ఎలా ఉండడం? తిరిగి తిరిగి ఊరి చివరకు చేరాను. అడివిని ఆశ్రయించాను. ఎండా వాన ఏమున్నా అదే నా నివాసం. "

ఓ రోజు వాగులో ముఖం కడుక్కుంటున్న నాకు నీళ్ళల్లో ఓ వికృత రూపం కనిపించింది. అది నేనే అని అర్థమయ్యాకా ..ఎందుకు జనం నన్ను చూసి దడుచుకుంటున్నారో అర్థమయ్యింది. గుండె వాగయ్యింది.ఇందుకు కారణమైన నా సొంత జనాన్ని నిలదీయాలని వెర్రి ఆవేశంతో మా తండాకి ప్రయాణమయ్యాను. ముఖానికి గుడ్డ కప్పుకుని బస్సెక్కాను. దారిలోనే తెలిసింది. మా అమ్మా నాయనలు ఊరు వదిలి పారిపోయారని. ఎక్కడకు వెళ్ళారో ఎవరికీ తెలియదని. ఇక నన్ను పెళ్ళాడకుంటే చచ్చిపోతానని తీజ్ పండుగ రోజు నన్ను అల్లుకుని ఏడ్చిన సువాలి. మగనితో ఇంకో బస్సులో కనపడ్డది. నేను ముఖం గప్పుకున్నాను. ఇగ జన్మలో ఎన్నడు ఆమె నన్ను చూడకూడదనుకుని కోరుకున్నాను. పని ఇస్తానికి కూడా నన్ను చూసి భయపడే మనుష్యుల మధ్య ఉండలేక ఏకాకిగా బతుకలేక నిశ్శబ్దంగా మారిపోయాను. తిండి దొరకదు. ఎండొచ్చినా వానొచ్చినా నీడ దొరకదు. రోగమొచ్చినా దు;ఖమొచ్చినా తోడు దొరకదు. విరక్తి....విరక్తి..... అడవికి..జనానికి మధ్య బ్రతుకుతూ మరణానికీ మధ్య మౌనానికీ రోదనకీ

మధ్య నేను..స్నానం..పానం మరిచి మురికిగా..మాటా మంతి మరిచి నిస్సహాయంగా ..ఆకలి దప్పులు మరిచి రాయిలాగా..గడ్డం జుట్టూ పెరిగి పిచ్చివానిలాగా ..

ఇలా మారిపోయాను....

" మాల్యాతో అతిప్రయాసలతో జరిగింది చెపుతున్నాడు. కదిలిపోయిన అతని మిత్ర బృందం " ఒరే కేస్లా..." అంటూ వాటేసుకుని ఏడ్చారు...వారిని చూసి..వద్దు వద్దు... నావంక చూడకండి మీరు భరించలేరు నన్ను అసహ్యించుకుంటారు నన్ను. మీరు అసహ్యించుకుంటే నేను భరించలేను. ముఖంపై గుడ్డ కప్పుకుని రోదించసాగాడు. కేస్లా...ఓరే కేస్లా..మేము నీ ప్రాణ స్నేహితులమురా..నిన్ను సజీవదహనం చేసారనుకుని కుంగిపోయాం. ఇన్నాళ్ళకు నీవు బతికే ఉన్నావన్న వార్త అందించి మాల్యక్కనూ మమ్మల్ని రప్పించింది ఎవరో తెలుసా..నీ ప్రాణం .నీ మరదలు సువాలినేరా..." చివ్వున తలెత్తి చూసిన కేస్లాకు లోపలి గుమ్మం దగ్గర కన్నీళ్ళతో నిలిచి ఉన్న సువాలి కనిపించింది." ముందు కేస్లా..సరిగ్గా తినగలిగి స్పష్టంగా మాట్లాడగలగడానికి అవసరమైన ప్లాస్టిక్ సర్జరీ అత్యవసరం. ఆ తరవాత ఆగిపోయిన చదువును కొనసాగించేలా చెయ్యాలి. ఆ తర్వాత ఏం చెయ్యాలన్నది ఆలోచించాలి. మిత్ర బృందమంతా తమలో తాము చర్చించుకుంటున్నారు. చక్కగా క్షౌరం చేయించి, తనను ముట్టుకుని స్నానం చేయించి, అన్నం పెడుతున్న మాల్యను చూసి...

" అక్కా..! నన్ను చూస్తే అసహ్యంగా లేదా..?" అడిగాడు కేస్లా.

" లేదు కేస్లా..అసహ్యించుకోవాల్సింది నిన్ను కాదు. నీ పరిస్థితికి కారణం అయిన మనుస్యులను. వికృతంగా మారిపోయిన మనుష్యతత్వాన్ని...."

************

మిత్రులంతా కలిసి కేస్లాకు ప్లాస్టిక్ సర్జరీ చేయించారు. మూడునెలలు డాక్టర్లు కృషితో కేస్లా కొత్తరూపుతో ఆసుపత్రి నుండి బయటకు వచ్చాడు. ఇప్పుడతనికి మూడు దార్లు కనబడుతున్నాయి.

ఆగిపోయిన చదువు కొనసాగించడానికి మిత్రులతో ధన్ బాద్ కి....

పోరాటాలు చేస్తానికి తుపాకి పట్టుకుని మాల్యాతో...తనవారిని వెదుక్కుంటూ ..తన తండా వారి కోసం బతకడానికి కోక్యా తండాకి.

****

ఎందుకో అతని అడుగులు తండా వైపే పడుతున్నాయి.




సంజయ్ , హారిక అన్నా చెల్లెళ్లు . చదువులో , తెలివితేటలలో వారికి వారే సాటి . ఇంట్లో వారు ఆడింది ఆట , పాడింది పాట . బాగా చదవటం వల్ల బడి లో టీచర్లు కూడా వీరి అల్లరిని చూసి చూడనట్లుగా వదిలేసేవారు . కాని స్నేహితుల దగ్గరికి ఆడుకోవడానికి వెళ్లినా తమ మాట నెగ్గాలనే పంతంతో ఏదో రకంగా గొడవపడి ఇంటికి వచ్చేవాళ్లు .

వీరి సంగతి వాళ్ల అమ్మానాన్నలకు తెలిసినా ఏ విధంగా వివరించి చెప్పాలో అర్థం కాలేదు . సంజయ్ , హారిక ల అమ్మమ్మతాతయ్య వీళ్లని చూడాలని ఊరి నుండి వచ్చారు . ఒక రోజు హారిక ఆడుకోవడానికి స్నేహితుల దగ్గరికి వెళ్లి , కొంతసేపు కాగానే ఏడుస్తూ ఇంటికి వచ్చింది . కారణం ఏమిటని అడిగితే , ‘ తాను స్నేహితులతో క్యారంబోర్డ్ ఆడుకోవడానికి వెళ్లానని , తాను ఎర్ర రంగు కాయిన్ కొడదామనుకుంటే వేరే వాళ్లు ముందు కొట్టేస్తున్నారని , అందుకే ఏడుపు

వచ్చి వచ్చేసా ' నన్నది . అంతలో సంజయ్ కూడా కోపంగా ఇంటికి వచ్చి ఎవరితోనూ మాట్లాడకుండా ఒక మూల కూర్చున్నాడు . ఏమైందని అడిగితే ' తాను క్రికెట్ ఆడడానికి వెళ్లానని , తనకు బ్యాటింగ్ అంటేనే ఇష్టమని , కాని స్నేహితులు ఫీల్డింగ్ చేయమన్నారని , అది ఇష్టంలేక ఇంటికి వచ్చేసా ' నన్నాడు .

అమ్మమ్మతాతయ్యలకి పిల్లలు బడిలో పాఠాలు కంఠతాపట్టి తరగతిలో ఫస్టు వస్తున్నారు , కాని సాటివారితో కలసిమెలసి కాసేపు కూడా ఉండలేరని , జీవిత పాఠాలు అసలు చదువు కోలేదని అర్థం చేసుకున్నారు . వాళ్లు చేస్తున్న తప్పును వాళ్లకి తెలిసేటట్లు చేయాలనుకున్నారు .

మర్నాడు శివరాత్రి కావడం వల్ల బడికి సెలవు ఇచ్చారు . అమ్మమ్మతాతయ్యలు గుడికి వెళ్తూ తమతో పిల్లలని కూడా తీసికెళ్లారు . గుడి నుండి వచ్చేటప్పుడు వీధి నిండా రకరకాల పళ్లు అమ్ముతుంటే చూసి హారిక ఫ్రూట్ సలాడ్ చేసుకుందాం పళ్లు కొనమని తాతయ్యకి చెప్పింది . సంజయ్ నాకు ఇష్టమే అన్నాడు . అమ్మమ్మ శివరాత్రి కదా ఈరోజు నా ఆహారం పళ్లే అంది . వారి ఇష్ట ప్రకారం తాతయ్య ' ద్రాక్ష , అరటి , ఆపిల్ , దానిమ్మ , సపోట , పుచ్చకాయ , బత్తాయి ' మొదలైన పళ్ల ని కొన్నారు .

సాయంత్రం పూజ అయిన తర్వాత పళ్లు కోయడానికి సంజయ్ , హారికలను వాళ్ల అమ్మమ్మ పిలిచింది . ఉత్సాహంగా ఇద్దరు తరగడానికి పీటలు , చాకులు తీసుకునివచ్చారు . మొదట ద్రాక్ష పళ్లని తరిగారు . తరువాత కొంచెం కష్టపడి ఆపిల్ పళ్లని చిన్న ముక్కలుగా తరిగారు . దానిమ్మ పైన తొక్క తీయటం రాక అమ్మమ్మని తీయమన్నారు . పుచ్చకాయను తాతయ్య సాయంతో తరిగారు . సపోట పైన తొక్క ఉన్నా హారిక తేలికగా తీయగలిగింది . అరటి పళ్లని , బత్తాయిలని సంజయ్ తేలికగా పొట్టుతీసి చిన్న ముక్కలుగా తరిగాడు .

మొత్తానికి సంజయ్ ,హారిక , వాళ్ల అమ్మమ్మతాతయ్యలు కలిసి పళ్లని ముక్కలుగా తరిగారు . సంజయ్ వాళ్ల అమ్మ పళ్ల ముక్కలకి పాలు , పంచదార ఇంకా కావలసినవన్నీ కలిపి ఫ్రూట్ సలాడ్ ని తయారుచేసింది . పిల్లలు , పెద్దలు అంతా కలిసి ఫ్రూట్ సలాడ్ తింటున్నారు . అప్పుడు హారిక అంది 'మనం పళ్ల తొక్కలు కొన్నిటిని తేలికగా తీసాం . కొన్నిటిని కష్టపడి తీసాం . కొన్నిటికి తొక్కలే లేవు . కాని అన్ని పళ్లని కలిపి తింటుంటే ఎంతో రుచిగా ఉన్నా ' యంది .

సంజయ్ కూడా ' విడివిడిగా ఒక్కొక్క పండు తిన్నప్పటి కంటే ఇలా కలిపి తింటే చాలా బాగుంది ' అన్నాడు . పక్కనే ఉన్న అమ్మమ్మ ' పిల్లలైనా , పళ్లు అయినా కలిసి ఉంటే చూడడానికి బాగుంటుంది ' అంది . అక్కడే ఉన్న తాతయ్య ' పిల్లలూ మీరు మీ స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి , ఏదో ఒక కారణంతో తగవుపడుతున్నారు . మీరు తొక్క తీసిన పళ్లని చూడండి . పుచ్చకాయ తొక్కని మీరు తీయలేకపోయారు . కాని తొక్క తీస్తే లోపల ఎంత బాగుందో తిన్న మీకు తెలుసుకదా .

అలాగే దానిమ్మ , అరటి తొక్కలని తీసి తయారుచేసిన ఫ్రూట్ సలాడ్ రుచి మాటల్లో చెప్పలేము కదా . అలాగే మీరిద్దరు మీలోని తప్పులని తెలుసుకొని , మీ స్నేహితులలోని చిన్న చిన్న లోపాలను మరిచి కలిసిమెలిసి ఉంటే స్నేహం కూడా ఫ్రూట్ సలాడ్ లాగా మధురంగా ఉంటుందని ' చెప్పారు .

సంజయ్ , హారికలు తాము స్నేహితులలతో అనవసరమైన కారణాలతో గొడవపడుతున్నామని అర్థం చేసుకున్నారు . అమ్మమ్మతాతయ్యలతో మేము ఇప్పుడు తొక్కతీసేసిన పళ్లలాంటి వారము . మా స్నేహితులలతో ఫ్రూట్ సలాడ్ లాగ కలిసిపోతాము . ' తొక్క' లాంటి గొడవలు పడమని చెప్పారు .